ప్రభాకర పరిశోధక మండలి

ప్రచురణము-సంఖ్య—౪

# ప్రజ్ఞాప్రభాకరము

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

# ప్రజ్ఞాప్రభాకరము

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

[౧౯౫౧]

[అమూల్యము]

ఖర

శ్రావణబహుళ విదియ

యోగమిత్రమండలి

మదరాసు

వారిచే ప్రకటితము.

౫౦౦ ప్రతులు.

పూజ్య శ్రీ

ప్రభాకరదంపతులకు

యోగమిత్రమండలి

భక్తితో

సమర్పించు కానుక

# విషయానుక్రమణిక


| | | |
|---|---|---|
| ౧. ఉపక్రమము | ... | 1 |
| ౨. జననాదికము | ... | 3 |
| ౩. బాల్యస్మృతులు | ... | 5 |
| ౪. పురోహితత-సదనుష్ఠానము | ... | 18 |
| ౫. అనుభూతి-తద్వికాసము | ... | 22 |
| ౬. కౌకిపగ | ... | 27 |
| ౭. శాస్త్రము-అనుభూతి | ... | 30 |
| ౮. వెంకటశాస్త్రిగారికడ విద్యావ్యాసంగము | ... | 33 |
| ౯. ధూమకేతు దర్శనము | ... | 36 |
| ౧౦. బ్రహ్మచర్యము-గార్హస్థ్యము | ... | 39 |
| ౧౧. వివాహము | ... | 45 |
| ౧౨. బండిపాటు | ... | 47 |
| ౧౩. శకునపరిగణనము | ... | 53 |
| ౧౪. సాహిత్యజీవనము-అరకుడుపు | ... | 56 |
| ౧౫. టైఫాయిడ్ | ... | 64 |
| ౧౬. వేంకటేశ్వరస్వామి దర్శనము | ... | 68 |
| ౧౭. తొలికలయిక | ... | 71 |
| ౧౮. ఆవేదన | ... | 80 |
| ౧౯. అనారోగ్యము | ... | 86 |
| ౨౦. ఔషధ సన్న్యాసము | ... | 89 |

| | | |
|---|---|---|
| ౨౧. వెలుఁగునీడలు | ... | 93 |
| ౨౨. వెలుఁగుబాట | ... | 99 |
| ౨౩. దివ్యదర్శనము | ... | 102 |
| ౨౪. అనుభూతి | ... | 106 |
| ౨౫. దివ్యబోధ | ... | 110 |
| ౨౬. చేయూడుట | ... | 115 |
| ౨౭. శ్రీ మాస్టరుగారు | ... | 117 |
| ౨౮. నవజీవనము | ... | 125 |
| ౨౯. ఇల్లాలి యినిసియేషన్ | ... | 134 |
| ౩౦. నాడీగ్రంథములు | ... | 139 |

# ప్రకాశక విజ్ఞప్తి

మహర్షిసత్తములు, మహాతపస్సంపన్నులు, ప్రజ్ఞాపూర్ణులు నయిన శ్రీ గురుదేవులు ప్రభాకరశాస్త్రి వర్యుల యోగజీవితము ప్రజ్ఞాసుందరము, ప్రభావసంపన్నము. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు కారణజన్ములు! వసుధైవ కుటుంబకముగా వారి జీవితము సాగినది. ప్రేమరసపూర్ణము వారి హృదయము, మహామహిమోపేతము వారి ప్రజ్ఞ! పసినాఁటనుండి యంతర్వృత్తిని యయి యమృతత్వసిద్ధిసాధనమార్గమున వారిని నడపించిన దివ్య ప్రజ్ఞా చరిత్రమే నేఁడు మేము వెల్వఱచుచున్న 'ప్రజ్ఞాప్రభాకరము.'

నన్నున్ వర్ణన సేయఁగా వలవదన్నా! కన్నయందాఁక మీఁ
ద న్నీవర్ణన మెంచు కిందులకుఁ గొందాఁకం బ్రతీక్షింపు మం
చు న్నన్గూర్చిన యుష్మదాజ్ఞకు నెదుర్చూపై గృహద్వారమం
దున్నాఁడం గనరాఁగదే కనుట కర్హున్ నన్నుఁ జేయంగదే!

కుంభకోణమున నపూర్వము, నసాధారణము నయిన మహత్తర యోగమును నెలకొలిపి యమృతత్వసిద్ధి ప్రసాదమును దమశిష్యులకు నొసఁగఁ బ్రతినపూనిన మహాయోగివర్యు లగు తమ గురుదేవులనుగూర్చి శ్రీ శాస్త్రిగారు రచించిన పద్యమిది! శ్రీ శాస్త్రిగా రాయోగమునఁ జేరిన కొలఁదికాలమున కెపుడో శ్రీ మాస్టరుగారి మహిమాదికమును వర్ణించుచు నేదో పత్రికలోఁ బ్రశంసా పద్యములను గొన్నిటిని రచించి ప్రకటించిరఁట! అది తెలిసి శ్రీ మాస్టరుగారు తమ్ముఁ బూర్ణముగా నెఱుఁగునాఁక నట్టి రచనము లేవియుఁ గావింపఁదగ దని శ్రీ శాస్త్రిగారిని మందలించిరఁట! ఈవిషయము నెఱుకపఱచునదే పయిపద్యము. అటుపిమ్మట నెన్నఁడును వారు శ్రీవారినిగూర్చి యెట్టి రచనము గావింపలేదు.

1948 వ సంవత్సరమున తిరుపతిలో శ్రీ శాస్త్రిగారి షష్ట్యబ్దపూర్త్యుత్సవము జరిగినది. షష్టిపూర్తినాఁడు ప్రాతరుపాసన సమయమున వారు,

'వచ్చిన నేటి కర్వదగువర్షము పుట్టువుఁదొట్టి, గర్భముం
జొచ్చుటదొట్టి నాకరయఁ జూచిన నేటికె షష్టిపూర్తి, యీ
వచ్చినయేడు నిండిన ధ్రువంబుగఁ గాఁగల షష్టిపూర్తితో
నిచ్చట నాకుఁ గావలయు నిష్టికిఁ బూర్తియు సృష్టిపూర్తియున్.'

అని వేఁడి గురుదేవులను ప్రార్థించిరి. అపుడు 'నిన్నటివఱకు ప్రభాకరుఁడవుగా నుండిననీవు నేటినుండి ప్రజ్ఞాప్రభాకరుఁడవు. నన్నుగూర్చి వ్రాయఁగలయోగ్యత నీకుఁ గలిగినది' అని శ్రీవారు దద్బోధించినట్లు తెలియ నయ్యెను. నాఁటే వారు 'ప్రజ్ఞాప్రభాకరము' రచనమునకుఁ దొడఁగిరి. తమకుఁ గలిగిన యోగానుభూతులను వివరించుచు వేయిపుటల గ్రంథముగాఁ దొలిసంపుటమును, నీరోగమువలన నుపకారము పడసిన మిత్రుల యొక్కయు, శిష్యులయొక్కయు ననుభవములను, వారే వ్రాసినవానిని, వేయిపుటల గ్రంథముగా రెండవ సంపుటమును గా 'ప్రజ్ఞాప్రభాకరము'ను వెలయించుట వారి సంకల్పము. అందుకై తొడఁగి రచనమున కుపక్రమించి కొంతవఱకు సాగించిరి. మిత్రులకడనుండియు, నాప్తులకడ నుండియు, శిష్యులకడనుండియు వారి వారి యనుభవములను దెలుపు వృత్తాంతములనుగూడఁ దెప్పించిరి.

తలమునుక లగు కార్యకలాపములలో నెట్లో తీరిక చేసికొని శ్రీవారి గ్రంథరచనమును దినమున కొకకొంతగా సాగించుచునే యుండిరి. కాని యన్నమాచార్యుల కీర్తనముల ప్రచురణము, తదుత్సవాదికముల నిర్వహణము, కుమారసంభవోత్తర హరివంశ వ్యాఖ్యానముల రచనము, తిరుపతిలో మ్యూజియమునకై యమూల్యవస్తువుల సేకరణము - ఇత్యాది కార్యకలాపములలో దలమునుక లగుచుండుటచే నీ గ్రంథరచనము నేఁడు ప్రకటించుచున్నంతవఱకు మాత్రమే కొనసాగినది. ఇంతలో మ్యూజియమున కయిన వస్తుసేకరణ ప్రయత్నమున నుండినవారి యారోగ్యము చెడుటయు, నీ గ్రంథరచనము ముగియకయే వారు భౌతికమును వీడుటయు మా దురదృష్టము! కడకు దుఃఖపుఁ బుక్కిలింతగా మాకు దక్కినది యీ గ్రంథము!

శ్రీవారి యోగజీవితమునకు సంబంధించిన యీ రచనము వారి ప్రథమవర్ధంతినాఁటికి వెల్వఱచుట మా సంకల్పము.

శ్రీ శాస్త్రిగారితో స్వయము నాకుఁ బదునైదేండ్లకు మించిన పరిచయము కలదు. 1939 లో వారు మదరాసు విడిచి తిరుపతి వెళ్ళిన తరువాత మదరాసునకు వారు వచ్చినపుడెల్ల మాయింటనే బసచేయుచుండువారు. వారియోగచికిత్సవలన నారోగ్యము పడసిననాఁటనుండియుఁ బరమభక్తితో నేను వారి ననువర్తించుచుండెడివాఁడను. వైద్యులకుఁ గుదుర్పరాని రోగములతో బాధపడుచున్నవారెందఱో శ్రీవారి యోగచికిత్సవలన నారోగ్యముపడసి యానందముతో నుండుట నే నెఱుఁగుదును.

వారి యాధ్యాత్మికశక్తి యెంత పటిష్ఠమో తెలుపుట కొక సత్య సంభవము నుదాహరింతును.

అన్నమాచార్యుల ప్రథమ వర్ధంత్యుత్సవము తిరుపతిలో మహావైభవముగా సాగుచుండినది. మదరాసు ఉన్నత న్యాయస్థానమున ప్రధాన న్యాయమూర్తులు శ్రీ పాకల వెంకటరాజమన్నారుగా రధ్యక్షత వహించిరి. రెండవదినమున సాయంకాలము శ్రీమతి టంగుటూరి సూర్యకుమారి పాటకచ్చేరి జరగుచుండినది. వేలకొలఁదిజనము విఱుగఁబడి వచ్చియుండిరి. సభాస్థలము క్రిక్కిఱిసి యుండినది. వాతావరణ మల్లకల్లోలముగ నుండెను. కాఱుమబ్బులు క్రమ్ముకొన్నవి. తుపాను వాయువులు వీవసాగినవి. ఉత్సవ ప్రాంగణ మంతయు దుమ్మెత్తి పోయుచుండెను. వేలకొలఁది జనము. స్త్రీలు, శిశువులు, వృద్ధులు పలువు రుండిరి. ప్రాణభీతి! సభలోఁ బెద్ద గగ్గోలయ్యెను. రసాభాస మగు నని శ్రీ శాస్త్రిగారు వెంటనే లేచి మైకు దగ్గఱకు వెళ్ళి 'వర్షము రాదు! మనమందఱము నేకమనస్కతతోఁ బ్రార్థించుచున్నప్పుడు తద్విరుద్ధముగా వర్షమెట్లు రాఁగలదు. మబ్బులు విచ్చిపోఁగలవు. గాలిహోరు తగ్గును. కూర్చుండుఁడు! వాన రాదు! రాదు! రాదు! అని ముమ్మారు నొక్కిచెప్పిరి. ఆశ్చర్యము! శ్రీవారి దివ్యసంకల్పబల మేమో కాని వెంటనే మబ్బులు తొలఁగిపోయినవి. గాలిహోరు తగ్గినది. వర్షము రాలేదు. కచ్చేరి జయప్రదముగా సాగినది. వారి యాధ్యాత్మికశక్తి

ప్రభావ మట్టిది! ప్రకృతివిజయ మైన నిట్టిదియే కదా! అహో! యిట్టివి శ్రీవారి విషయమున మా యెఱుకలో నెన్నియో!!

అమృతత్వసిద్ధికై సాధనము కలుపు నీయోగముయొక్క మహత్త్వము చెప్ప నలవి కాదు. యోగమహిమమును గూర్చియు, తత్స్థాపకులగు గురుదేవుల దివ్యప్రభావమును గూర్చియు శ్రీ శాస్త్రిగారు రచించిన యీ గ్రంథము ముద్రిత మయినయెడల నెందఱకో యీ యోగవిషయము తెలియగోరువారికి నుపకారకముగా నుండు నని దీనిని బ్రకటింప నుత్సహించితిని. యోగవిషయము తెలియగోరువారి కిది మిక్కిలి తోడ్పడఁగలదని నా విశ్వాసము.

శ్రీవారి యోగానుభవములను గూర్చియుఁ, దమకు శ్రీవారితోఁ గల పరిచయ సందర్భములను గూర్చియు ననేక విశేషాంశములు తెలుపుచు 'శ్రద్ధాంజలి' వ్రాసిన శ్రీ కొత్త వెంకటేశ్వరరావుగారికి మే మెంతయుఁ గృతజ్ఞులము. ఈ గ్రంథముద్రణ సందర్భమున శ్రీ శాస్త్రిగారి శిష్యులు శ్రీ తిమ్మావఝ్ఝుల కోదండరామయ్యగారు మాకు మిక్కిలి సహాయపడిరి. వారికి మా కృతజ్ఞత!

అలఁతికాలములో సరిగా సర్వాంగసుందరముగా నచ్చొత్తించి యీ గ్రంథమును శ్రీవారి ప్రథమవర్ధంతి నాఁటికి మా కందఁజేసిన 'వెల్డను ప్రెస్సు' వారి నభినందించుచున్నారము.

మదరాసు
ఖర
శ్రావణ బహుళ విదియ

కంభంపాటి సత్యనారాయణ.

# శ్రద్ధాంజలి

"Greater love hath no man than this,
that a man lay down his life for his friends."

St. John XV, 12.

"మిత్రులకై తనప్రాణ మర్పించుటకన్న నుత్కృష్ట ప్రేమను మానవుఁ డెఱుఁగడు" అన్న జీసను మహోదార ప్రవచనమునకు పరమలక్ష్యభూత మైనది శ్రీ ప్రభాకరశాస్త్రి గారి పుణ్యజీవితము. వారు అందఱను మిత్రులు గనే భావించెడివారు. ఆధివ్యాధులచే దారి తెన్నులు తెలియక, నిస్పృహు లైనవా రాయనకు పరమమిత్రులు. అట్టివారి దుఃఖములోను బాధలోను దూరి, వారే తాముగ భావించి, వారి యాపన్నివారణకై యహోరాత్రములు పరితపించి, ఆ యనుతాపలబ్ధ మగుఆత్మశక్తిచే బాధానివారణ చేసెడివారు శ్రీ శాస్త్రిగారు. అట్లు వారిని గట్టెక్కించిన పిమ్మటగూడ వారి యోగక్షేమముల నరయుచు ఆపదలలో నాదుకొనెడివారు. "సమర్థ మాపత్సఖ" మను స్తుతివాక్యములకు వీరెంతయు తగియుందురు.

"ఆపద గడవం బెట్టఁగ
నోపి శుభం బయినదాని నొడగూర్పఁగ మా
కీ పుట్టువునకుఁ బాండు
క్ష్మాపాలుఁడు నిన్నుఁ జూపి చనియె మహాత్మా!"

యని శ్రీకృష్ణుని గూర్చిన యుధిష్ఠిర సంబోధనము

కలదు. శ్రీ శాస్త్రిగారిచే పరిరక్షితులైనపెక్కు రిక్లే వారిని స్మరింతురనుట కేవలము స్వభావోక్తి! వారి కరుణా ప్రసారముచే నుజ్జీవితులైనవారిలో నే నొకఁడను. ఆ కృతజ్ఞతను పురస్కరించికొని ఈశ్రద్ధాంజలి నర్పింప సాహసించితిని.

వ్యాధులను తపస్సుచే నివారించు టెట్లు? మరియు, ఒకరివ్యాధి నింకొక రుపశమింపఁజేయు టెట్లు? అని పలువురు ప్రశ్నింతురు. ఇది న్యాయ్యమే. అట్టి యనుభవము పడయువరకు నాకు నట్లే యుండెడిది. స్వయముగ నాకు దెలిసిన కొన్ని విశేషముల నుదాహరించి, సహృదయుల సందేహములను దీర్ప యత్నింతును. ఈ రూపమున నాకు శ్రీశాస్త్రిగారి సత్యమధురస్వభావ సంస్మరణావకాశమును, ఈ గ్రంథ రచనలో శ్రీ వా రుద్దేశించిన ప్రయోజనము కొంతవఱకును చేకూఱును.

శ్రీ శాస్త్రిగా రీ 'ప్రజ్ఞాప్రభాకర' రచనకు దొడఁగి నప్పటికే భక్తిరహిత తారక రాజయోగ మార్గమున ముప్పదేండ్లు సాధన మొనర్చి యుండిరి. ఈ సుదీర్ఘకాలమున నెన్నియో మహనీయానుభవములను వారు గడించిరి. తమ యనుభవములను, తమతోపాటు యోగదీక్ష బడసినవారి యనుభూతులను, తమవలన నుపకృతి బడసినవారి కథలను, వారు వేర్వేరు సంపుటములుగ బ్రకటింప నెంచిరి. వారు సంకల్పించిన బృహద్గ్రంథమే రూపొందినచో నది

తెలుఁగు వచన రచనలోని మెఱుఁగులను చూపునదియే గాక, యోగాధ్యాత్మసాధకులలోను, మనశ్శరీరతత్త్వవేత్తలలోను, రోగచికిత్సకులలోను సంచలనము గల్గింపఁజాలినదిగనుండెడిది.

కాని వారా గ్రంథరచన కుపక్రమించి యిపుడు ప్రకటింపఁ బడిన భాగమును పూర్తిచేయునప్పటికి శ్రీ తిరుపతి దేవస్థానమువా రొక మ్యూజియమును నిర్మించుభారమును వారిపై నిడిరి. దానికై వారు ఆహార నిద్రా సౌకర్యములు మాని, పులులు చెరలాడు కడప యడవుల కడ మొదలిడి కమ్యూనిష్టు గెరిల్లాల కాటపట్టు లగు కృష్ణాజిల్లా ముక్త్యాల, నైజామురాష్ట్రపు నల్లగొండ గుట్టలవఱకును గాలించి కన్నుల పండువునుఁగూర్చు సుందర జిన బుద్ధ హిందూ విగ్రహములను బెక్కింటిని తిరుపతి చేర్చిరి.

ఈ విగ్రహములవలన మనకు పూర్వ మాంధ్రదేశములో సమతాధర్మప్రతిపాదకములు, అహింసా ప్రబోధకములు నైన జైన బౌద్ధములు ప్రబలె ననియు, తదనుయాయుల కళారాధనాఫలితముగ పెక్కు మనోహర విహార విగ్రహాదులు వెలసె ననియు, కాలక్రమమున ప్రజలకు వర్ణాశ్రమాచారముల పైనను, వైదిక యజ్ఞ యాగాదుల పైనను చూపు మ్రొగ్గె ననియు, అపుడు వారు పూర్వ శిల్ప నిర్మాణములను చేజేతుల రూపుమాపి రనియు, తమ నూతనావేశమునకు లొంగనివారిని చిత్రవధ సల్పి రనియు తెలియ నగును. నాఁటి దౌర్జన్య హింసాకాండకును, తరువాతి శతములలోని మహమ్మదీయుల విధ్వంసక చర్యలకును,

నేఁటి రజాకరు కమ్యూనిష్టు దుండగములకును భేదము కన్పట్టదు. మానవతలోని పశుత్వ మవిచ్ఛిన్నముగ నాఁటి నుండి నేఁటివరకు సాగుచునే యున్నది! తనకు మంచిదని తోఁచినదాని నితరులచే నంగీకరింపఁ జేయుటకు మానవుఁ డొనర్చు సాధనలో హింసాకాండను వర్జింపనేరఁడా?

ఈ శిలా లోహ విగ్రహములే గాక శ్రీ శాస్త్రిగారు కాళహస్తి సంస్థాన పురావస్తు భాండార మంతయు శోధించి తత్సంస్థానాధీశ్వరుల యుదారానుమతితో ఎన్నో అముద్రిత గ్రంథములు, చిత్రములు, పూర్వపు వీరులు ధరించిన కవచ ఖడ్గాదులు సేకరించిరి. ఆంధ్రప్రభ సంపాదకు లగు శ్రీనార్లవారి సహాయమున బందరునుండి శ్రీ కోట సుబ్బారావుగారలు బహుకాలము శ్రమించి సేకరించి ప్రాణతుల్యముగ భద్ర పరచుకొన్న అమూల్య చిత్ర ప్రతిమాదుల మ్యూజియమును తిరుపతికి తరలించిరి.

ఈ పని యంతయు నొకప్రక్క – మఱియొకవంక తిరుపతి దేవస్థాన ప్రాచ్యకళాపీఠ యాజమాన్యమున శ్రీ అన్న మాచార్య వర్ధంతి జరవుట, కీర్తనల ప్రచురణ, పావులూరి గణితము, ఉత్తరహరివంశము, లక్షణోద్ధారము, నన్నయకు పూర్వపు ఆంధ్రభాష ఇత్యాదుల పరిష్కరించుట, వ్యాఖ్యా నించుట, సమకూర్చుట, పరిశోధించుట జరవుచు, నన్నిచోడుని కుమారసంభవమునకు వ్యాఖ్యానము రచించుటగూడ ప్రారంభించి యీ కార్యముల నన్నిటిని నేకకాలమున సవ్య సాచివలె శ్రీ శాస్త్రిగారు నిర్వహించిరి.

మ్యూజియము వస్తుసేకరణలో పెక్కు చిక్కు లుండెడివి. దారి డొంక లేని యొక కుగ్రామములో నొక చారిత్రాత్మక సుందర శిలా విగ్రహము కల దనియు, దానికై యెవరో బొంబాయి నుండి ధనవంతులు వచ్చిరనియు, ఆలస్యమైనచో తెలుగునాడు దాటిపోవు ననియు తెలిసెడిది! సరి! అంతటితో శరీరశ్రమను లెక్కసేయక ఏదో రీతి నటకు చేరెడివారు శ్రీ శాస్త్రిగారు. ఆ విగ్రహ మే పుంతలోనో పడియుండెడిది. పసులకాపరులు కత్తి నూరుకొనుటకో, బాటసారులు కాలిబాడి వదల్చుకొనుటకో అది ఉపయోగపడుచుండెడిది. త్రవ్వి తీయుటకు తోడు దొరకరు. వెలికితీసి దాని ప్రాముఖ్యమును దెలిపిన పిమ్మట ఊరివారు ఆ విగ్రహము నుంచుకొని మేమే ఆరాధించుకొందు మని యడ్డగింతురు. వారిని సమాధానపఱచి ఆయా వస్తువులను తిరుపతి చేర్చుట యన లక్కయింటినుండి ఏకచక్రపురమునకు చేరు నంతటి కథ! ఈ పని నంతయు శ్రీ శాస్త్రిగారు తమ ప్రియాంతేవాసులను, అందును ఉదయగిరి శ్రీనివాసాచార్యులను నూతగట్టిగా గొని ఏ డెన్మిది నెలలలో బహు స్వల్ప వ్యయముతో నిర్వహించిరి. వేరొకరైనచో మంది సిబ్బందులతో గూడియైన, ఎంత ధనమో వెచ్చించియైన, నిరువదేండ్లలోపుననైన ఈ పనిని సాధింప గల్గుదురా యని యెఱుక గలవారలచ్చెరువుం జెందిరి.

ఈ సందర్భమున నొక విషయము స్ఫురణకు వచ్చుచున్నది. గుంటూరులో నొక నూత్న పరిచయునికడ.

శ్రీ శాస్త్రిగారు కొన్ని గంటల కాలము వ్యయించి ఒక చిన్న పాలరాతి ముక్కను తెచ్చిరి. దానిపై నేదో చెక్కడపు భాగము గలదు. ఆ రాత్రికే వారు తిరుపతి ప్రయాణము. సామానుల సర్దుగడలో దానిని మఱతురేమో యని పలు మారులు సరిచూచికొనిరి. గాజుకుప్పెలను భద్రము చేసినంత జాగ్రత్తతో దానిని సర్దించిరి. మా కీ యాందోళన బోధ పడలేదు. "ఇది యమూల్యశిల్పము. డూబ్రేలు అయినచో దీనికి పదివేల రొక్క మిచ్చును" అని రైలుకడఁ జెప్పిరి. ఈ చిన్న వస్తువు మాటయే యిటులుండ వారు సేకరించిన మ్యూజియమునకు విలువ గట్టుట యసాధ్య మని తోచును.

ఇప్పు డీ శిల్పకళాఖండము లన్నియు తిరుపతి దేవస్థానపు మ్యూజియములో మూగవోయి యున్నవి. వాని కాలనిర్ణయముఁ జేసి, వాని సాంఘిక రాజకీయ ప్రాధాన్యతను, కళాప్రాశస్త్యమును గుర్తించి, వానిని పలుకు బొమ్మలనుగా జేయుగురుతర బాధ్యత దేవస్థానమువారి మెడఁ గలదు.

ఇటు మ్యూజియముకై తిరుగులాటతోను, అటు అపూర్వ గ్రంథ సంస్కరణ ముద్రణముల యొత్తిడితోను నలిగులియై శ్రీ శాస్త్రిగారి యారోగ్యము కొంత చెడినది. ఇంతలో గుంటూరు జిల్లా ఎద్దనపూడి యను గ్రామములో నొక బావిలో నేవో మహత్తరశిల్పములు గుప్తపఱుపఁ బడెవనియు, వానిని సేకరింప వచ్చు వనియు ఆసవెట్టి దుర్విధి శ్రీ శాస్త్రిగారి నటకుఁ గొంపోయెను. జడివాన. మోఁకాటి

బంటి నల్ల రేగడి భాడి. జోడెద్దులబండి సైతము నడువ వీలు లేదు. కాలుదీసి కాలువేయ సాధ్యము గాదు. ఇట్టి మిత్తి యడకత్తెరలోఁ జిక్కికొని అఱువదేండ్ల వృద్ధు, సుకుమార శరీరి, భారవుమానిసి యగు శ్రీ శాస్త్రిగారు తీవ్ర జ్వరముతో నింటికిఁ జేరుకొనిరి. అప్పటికే వారి యారోగ్యము పూర్తిగా చెడినది. దానిని లెక్కచేయక నిరంతరము మంచముమీఁద నుండియే చివరివఱకు వారి మామూలు కార్యముల నిర్వహించుకొనుచుండిరి. వారు తమ యోగ మాహాత్మ్యమున పలుపురను మృత్యుదంష్ట్రలనుండి వెలికి లాగిరి. అట్టి వార మనేకులము వారి చుట్టు నుండియు తుదకు నా మహనీయుని దక్కించుకొననేరమైతిమి. ఈ హఠాద్వార్త విన్న మహాకవి శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు చకితులై "తుదకు నిన్నే జయించె మృత్యువు మహాత్మా" యని అప్రయత్నముగ వగచిరి. శ్రీ సత్యనారాయణగారు తమకు తెలియకయే, శ్రీ శాస్త్రిగారి ప్రేమపాత్రు లందరు ఆ నిముసమున భావించినదే పల్కిరి. అస్సాము భూకంపములో హిమాలయ శృంగములు కొన్ని యదృశ్యమైన వన్న వార్తలతోపాటు, శ్రీ శాస్త్రిగారి నిర్యాణవార్తను మేము వార్తాపత్రికలలో జూచి వాపోయితిమి.

తుదకు వా రెంతో మక్కువతో బృహద్గ్రంథముగా రచింపఁజూచిన ప్రజ్ఞాప్రభాకర మీ తీరున నసంపూర్ణముగా, దుఃఖపుపుక్కిలింతగా ప్రకటింపవలసి వచ్చినది. దీని ముద్రణకగు వ్యయమును శ్రీ శాస్త్రిగారి కిర్వదియేండ్లనుండి ప్రియ

శిష్యులైన చెన్నపురివాసి శ్రీ కంభంపాటి సత్యనారాయణ శ్రేష్ఠిగారు భరించి గురుదేవులయెడఁ గల భక్తిప్రపత్తులను వెల్లడించుకొనిరి. వీరి వృత్తి వెన్నవ్యాపారము. హృదయప్రవృత్తియు నవనీతసమానమే! శ్రీ శాస్త్రిగారు చెన్నపురి విచ్చేసినపుడెల్ల అచటి ఆప్తులందరును వీరియింటనే సమావేశమై వీరి యాదరణకు పాత్రమగుచుండెడివారు. నేటికిని వారి యాదరణకు మేము ఋణపడియున్నాము.

శ్రీ శాస్త్రిగారితో నాకు ప్రథమపరిచయభాగ్యము 1939 మే నెలలో కల్గెను. అప్పటికి సుమారు పది నెలల నుండి నేను తీవ్రానారోగ్యముతో పీడింపబడుచుంటిని. నా యనారోగ్యము తొలుత 106 డిగ్రీల మలేరియాతో నారంభమైనది. కొన్ని ఇంజెక్షనులతో ఆ యమయాతన నుండి బైటపడితిని. అంతటితో నాగిన నెట్లుండెడిదో! ఆ వైద్యపద్ధతిలో క్వైనా వాడుదు రనియు, అది శరీరమునకు మంచిది కాదనియు, హోమియోపతి వైద్యములో క్వైనా వాడ రనియు, ఆ పద్ధతి శ్రేష్ఠ మనియు ఎట్లో తల కెక్కెను. దానితో మరి రెండు నెలలు గడచెను. లాభము లేదు. పిదప ఆయుర్వేదముపై చిత్తము ప్రసరించెను. ఎన్నో చేదు మందులు మ్రింగితిని. అందు కలకత్తావారి పంచతిక్త మని యొకటి గలదు. పేరుకు పంచతిక్తమే గాని నిజముగా నది ప్రపంచతిక్తము. పగవానికైన వలదీ చేదులు! ఆ మీఁదట కేవలము నాటుమందులు వాడితిని. ఆ వైద్యుఁడు చురుకైన వాఁడే! నాటు మందులపై నాకుఁ గలయనాదరణను పోగొట్టు

టకు కొన్ని తీయని మందుల నిచ్చి ఆహారవిషయములో కొంత స్వేచ్ఛ నిచ్చెడివాఁడు. కాని లాభము లేకపోయెను. తిరిగి అల్లోపతికి చేరితిని. అప్పటికి నా శరీరస్థితి చాల మార్పు చెందెను. ఇరువది పౌనుల తూకము తగ్గినది. సాయంకాలమునకు 99·5° జ్వరము వచ్చెడిది. మానసికముగా ఎట్టి నిబ్బరమును లేదు. నరముల జిగి తగ్గి స్వల్పావేశమునకే శరీరము తాళలేకుండెడిది. నిద్ర లేదు. ఏమి తిన్నను వంట బట్టదు. ఈ స్థితిలో అల్లోపతి వైద్యము కొలఁదిగా సాయ పడెను కాని వ్యాధి బోధపడదు. ఎచటనైన భయపడితి నేమో యని వైద్యుఁ డనును.

ఈస్థితిలో చెన్నపట్నములో లాఅప్రెంటిసు పరీక్షకు వెళ్ళవలసివచ్చెను. నేను రైలు దిగి ట్రాము బస్సులలో ఎక్కగలనా యను సందేహముతో నుంటిని. తుదకెట్లో చెన్నపట్నము చేరి స్టేషనుకువద్దకు రావించుకొన్న మిత్రుని సాయముతో హోటలు చేరి పరీక్షలు ముగించుకొంటిని. తరువాత పేరుగన్న ఒక డాక్టరుగారిని చూచితిని. ఆయన కొక నర్సింగు హోము కలదు. రోజుకై దురూప్యముల నిచ్చి పదిరోజు లందున్ననే గాని రోగనిదానము తెలియదనిరి. నేనందు చేరెడిదినము స్థిరపఱచుకొని హోటలుకు వచ్చితిని.

గుంటూరునుండి బయలుదేరునపుడే శ్రీ శాస్త్రిగారి యోగమాహాత్మ్యమునుగూర్చి ట్రీట్మెంటునుగూర్చి శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారివలన తెలిసికొంటిని. ఎందుకైన మంచి దని శ్రీ శాస్త్రిగారికి వారికడ నొక పరిచయలేఖను తీ

కొంటిని. ఆలేఖ తీసికొని త్రోవలో నాలుగు కమలాఫల ములను కొని ప్రొద్దుటనే తిరువలిక్కేణి వెంకటరంగం పిళ్ళె వీధిలోని నాల్గవనెంబరు ఇంటి కేగితిని. తలుపుతట్టి లోని కేగు దునుగదా ఆశ్చర్యముపై నాశ్చర్యము!

శ్రీ శాస్త్రిగారి రచనలను చదివినపుడు వారి యాకార, వేష, భాషాచారములనుగూర్చి నాకు తెలియకయే మనసులో నొక రూప మేర్పడెను. వారు సన్నముగాక లావుగాక బంగారువన్నె గలస్ఫురద్రూపి యగుఆచారపరాయణుఁ డని నాభావన! లావుగా, చామనచాయ మెఱుపుమేనితోనున్న వారిని పోల్చుకోలేక పోతిని. "ఏం! నాయనా! ఎవరు నీవు!" అని వారు స్నిగ్ధగంభీర మగుస్వరముతో నన్ను పలుకరించిరి.

నాయూహాలో ఆకంఠధ్వని యిమ్లుండః ననుకొనలేదు. నేను తేరుకొని వారికి నమస్కరించి "మాది గుంటూరు..." అని చెప్పునంతలో శ్రీ లక్ష్మీనారాయణగారు లోనుండి వచ్చి నన్ను పరిచయము గావించిరి. వారి నచట కలియుదు నని నే నెఱుఁగను. ఏదో పని యుండి చెన్నసగరము వచ్చి ఆక్రిందటి రాత్రియే వారిటకుఁ జేరిరట!

శ్రీ శాస్త్రిగారు నేను వారింటికి చేరుసరికి దంతధావన చేయుచుండిరి. అప్పటి కేడుగంటలు దాటియుండును. ఈసరికి వారు స్నానజపాదులను ముగించి యుందు రని తలచిననా కిది క్రొత్తగా నుండెను. వారితో పరిచయము పెరిగినపిమ్మట తెలిసికొంటిని. సాయంకాలమందు యోగచికిత్సకై వారికడ కేతెంచు నార్తులతో వారికి పెందలకడ తెములదు. అందఱు

వెళ్లినపిమ్మటగూడ చాల ప్రొద్దు పోవువఱకు వారి వారి రోగ కారణాదుల నాత్మోద్బోధమున తెలిసికొనుటతో నిదుర యుండదు. ఒకప్పు డొక నిదురపోయి లేచి తెల్లవారు లాచింత తోనే కాలము గడపుదురు. ఇందుచే ప్రొద్దెక్కి లేచుట జరిగె డిది. వేకువనే ఆచారపరాయణులవలె వేషము సవరించుట కెక్కడ! అన్ని ఆచారములను వారు జీవకారుణ్య యజ్ఞాగ్నిలో వ్రేల్చిరి.

దంతధావన చేసీ చేయుటతో నేఁ దెచ్చినకమలాఫలములను రుచి జూచి, "బాగున్నవి! కాని లోన డొల్ల జాస్తి. రసము తక్కువ" యనిరి. ప్రతివస్తువును పరిశీలించి నాణ్యము తెల్పుట వారి కొక పరిపాటి.

ఆపిమ్మట నాకు యోగచికిత్స నిచ్చుటకు వారు సమ్మతించిరి. కాని ముందు నా భోజనవసతి యెట్లని యడిగిరి. హోటలులో నుందు ననఁగానే వారి కతృప్తి కల్గెను. హోటలులో ఆహారము సరిగా నుండదని వారి బెంగ. మామూలు సాంబారు మెతుకులు గాక మంచి నేయి, కూరలు, పాలు, పండ్లు తీసికొనవలె ననిరి. "ఈయాహారముతో నీజబ్బు కుదురు ననుకొనవద్దు. కుదుర్చునది సర్వకర్త యగునీశ్వరుడే! నీశరీర పుష్టికి ఈ తిండి కావలయును" అని చెప్పిరి. నర్సింగుహోము సంగతి చెప్పగా అందు చేరవల దనిరి. వారి మాటజాడను బట్టి నాయనారోగ్యము చక్కబడు నని వారి తలంపుగా నేను గ్రహించి సంతసించితిని.

నా కంఠస్వరము బలహీనముగా నున్నదని వారనిరి. ఆ మాట నాకు క్రొత్తగా తోచెను. కాని పూర్ణారోగ్యము బడసినపిమ్మట పోల్చి చూచికొనఁగా వారిమాట సత్యమని తెలిసికొంటిని. ఇదియెందులకు వ్రాసితి ననగా శ్రీ శాస్త్రిగారు రోగచికిత్సకు వచ్చువారిని మొదటి చూపులోనే నిశితముగ పరీక్షింతు రని చెప్పుటకే! వచ్చెడివారి ఆకారము, ముఖవైఖరి, మాటతీరు, కంఠస్వరము, అంగవిన్యాసము, వారు తెచ్చెడి కానుకలు మొదలగువానినిబట్టి వారి వారి స్వభావములను, అనారోగ్యముతీరును శ్రీ శాస్త్రిగారు గ్రహింతురు. వారి యూహ తప్పగుట నే నెన్నఁడు చూడలేదు. ట్రీట్మెంటుల లోనే గాక ఈ కుశలతను వారు నిత్యజీవితములో నొక వినోదముగా నవలంబించెడివారు. దస్తూరినిబట్టి స్వభావమును తెలిసికొనుట, జాబులపై పోస్టుమార్కులను చూడకుండ చిరునామా వ్రాసిన తీరునుబట్టి ఆకవరు ఎచటినుండి వచ్చినదో చెప్పుట, ఒకప్పుడా జాబు చదువకయే అందలి విషయమును చెప్పుట మొదలగు చిన్ని చిన్ని వినోదవిమర్శలతో వారి చుట్టు నొక చల్లని ఆశ్చర్యకర మైనవాతావరణము కల్పించెడివారు.

ఆ తొలిపూట ట్రీట్మెంటులో నాశరీర మంతట ఒక శక్తి ప్రవహించినట్లుండెను. చెమట రోడికలు గట్టెను. హోటలుకు పోయి చక్కగా భోజనము చేయు మనిరి. సాయంత్రమువరకు కాల మెట్లు గడపెద వని యడిగిరి. క్రొత్తచోట నేమి చేయుటకు తోచక విసుగు చెందుదు నని వారి యాందో

శన! ట్రీట్మెంటుకు వచ్చినవారి శారీరక, మానసిక సౌకర్య ములనుగూర్చి అంత శ్రద్ధగా విచారించెడివారు శ్రీ శాస్త్రి గారు! చికిత్సాకాలములో చీకాకులు లేకుండ ఆనందముగ నుండవలె నని వారి తలపు. "ఏదో పుస్తకములతో కాల క్షేపము చేయుదు" నని నే నంటిని. శ్రీ లక్ష్మీనారాయణ గారు "ఈయన మంచి చదువరి. అందుచే ఉబుసుపోక కేమి చిక్కు లేదు" అని చెప్పిరి. దానికి శ్రీ శాస్త్రిగారు "పుస్తకా లన్నీ కట్టిపెట్టు. భోంచేసి కమ్మగా నిద్రపో" యనిరి. శ్రీ శాస్త్రిగారు బహుగ్రంథపరిశోధకులు. కాని పుస్తకపాండిత్యముపై వారి కభిమానము లేదు. మన మన శ్శరీరములే సర్వరహస్యములను వెల్లడించు పుస్తకములు. వానిని పఠించుతీరు అలవర్చుకొనుట మేలు అని వారి అభి ప్రాయము. సాహిత్యమును గూర్చిన వారి యూహలను తరు వాత స్పృశించెదను.

సాయంత్రము తిరిగి నేను వచ్చినపుడు నాయాకలిని గూర్చి, భోజనపదార్థములనుగూర్చి, నిద్రనుగూర్చి, వచ్చి నపుడు తీసికొన్నపాలు, పండ్లనుగూర్చి, శరీరస్థితినిగూర్చియు వివరము లడిగి తెలిసికొనిరి. నేను వారు చెప్పినట్లే నడచు కొనుటయు, నిద్రాహారము లమరుటయు గుర్తించి బండి త్రోవను నడచుచున్న దని వారు తృప్తి చెందిరి.

వారికడకు వచ్చు ప్రతివారిని ఈరీతిగనే యే పూట కాపూట ప్రశ్నించి ధ్యానములో నేమి జరిగినదియు, ఇంటి వద్ద నెట్లున్నదియు తెలిసికొని ఉత్సాహపఱచుచు ఎవరికైన

బాధ తగ్గనిచో కారణ మన్వేషించుచు, దోషములను దిద్దుచు, ఆదిద్దుగడతో నారోగ్యము చక్కబడుట గమనించుచు, అనవరతపరహితకాంక్షతో కాలము గడపెడి వారు శ్రీ శాస్త్రిగారు.

ఆపట్టున నే నచట నలుబది దినము లుంటిని. ఆకాలమున ట్రీట్మెంటుకు సంబంధించిన వింత లనేకము జరిగెను. వాని నన్నింటి నిట వ్రాయ వలనుగాదు. నాకు సంబంధించిన నొకటి రెండు చెప్పి విడిచెదను.

శ్రీ శాస్త్రిగారి వద్దకు చేరునప్పటికి నాకు ఏమి తిన్నను వంటఁ బట్టెడిది గాదు. నిద్ర సరిలేదు. కాని వలసినంత యాహారమును నిర్భయముగ తీసికొమ్మని రనియు, పవలు సైతము నిద్ర పొమ్మని రనియు వ్రాసితిని. నే నా మాటల నక్షరశః పాటించితిని గాని అందుచే నెట్టి యసౌకర్యము కలుగలేదు. కొన్నాళ్ళయిన పిమ్మట ఒక ఉదయము "ఈ పూట ఏమి తీసికొంటి" వని శ్రీ శాస్త్రిగా రడిగిరి. రెండిడ్లెనలు తీసికొంటి నని చెప్పితిని. వెంటనే, "అన్యాయ మన్యాయము! ఏడింటికి రెండిడ్లెనలు, పదకొండుకు భోజనమా?" అని శ్రీ శాస్త్రిగా రనిరి, ఎక్కువ తింటిని గాబోలు నని నేను నివ్వెరపోయితిని. "నీ ఒడ్డు పొడుగులకు రెండిడ్లెన లేమూలకు! నాలుగు న్యాయము" అనిరి. మరునాఁడు తిరిగి యడిగిరి. "నాలుగు తీసికొంటి" నంటిని. "ఆపైన" అని యడిగిరి. "మామూలు పద్ధతి నొక యరకప్పు కాఫీ తీసికొంటి"నంటిని. "ఇది కేవల మక్రమము. జోడిడ్లెనుల కొక యరకప్పు. రెండు

జోళ్ళకు నిండుకప్పు'' అనిరి. మరునాఁ డట్లు చేసితిని. "ఇడ్డెనలు మాత్రమేనా? ఈ శాస్త్రము నీకు తెలియదు. విను! మొదట రెండిడ్డెనలు. వానిపై కొంచెము కాఫీ. ఆమీఁద నుప్మావ్. దాని కాచ్ఛాదన దోసె. ఆకప్పు మీఁద ఒకకప్పు కాఫీ పోయువలె'' నని కడుపు చెక్కలగునట్లు నవ్వించిరి. ఆయూపుతో పూట కెన్నిది ఇడ్డెనలు, భోజనమున నరవీశెడు కూరలు, రెండుకప్పుల పెరుగు; మధ్యాహ్నము నిద్ర లేచి అరడజను పేవాజప్పళము పండ్లు, కిస్మిస్, అంజూరా ఆపిల్ ఫలములు; సాయంత్రము నాల్గుబోండాలు, కాఫీ; రాత్రిభోజనములో మామిడిపండ్లు – ఇంతవఱకు వచ్చితిని. ఈ రాకాసితిండి నేఁడు నేనే నమ్మఁజాలన ట్లున్నది. లేకున్న నిరువదిరోజులలో నిరువదిపౌనుల తూకము పెరిగి యుండ ననుకొందును!

ఒకరోజున అన్నామలై విశ్వవిద్యాలయములో గణిత శాస్త్రాధ్యాపకులుగా నున్న ప్రొఫెసర్ నరసింగరావుగారు వచ్చిరి. వారుగూడ యోగమిత్రమండలిలోనివారే. శ్రీ శాస్త్రిగారి ఇంటనే బస. ప్రసంగవశమున నాకథ యంతయు శ్రీ శాస్త్రిగారు చెప్పిరి. వా రాశ్చర్యముతో వినిరి. ఈ మాటలు జరుగుచున్నంత కాలము నాలో గుబగుబమని యేదో సంచలనము జరిగెను. ఉచ్ఛ్వాస నిశ్వాసములు దీర్ఘము లాయెను. వెన్నెముక నిట్టనిలువున బుసగొట్టు త్రాచువలె నిలిచెను. రెండుభుజములు వెనుక కొత్తుకొని రొమ్ము విప్పారెను. శ్వాసను కొలుచుపద్ధతి నాకు తెలియదు గాని, కొలిచినచో నది రెండుబార లైన నుండునేమో! మా

మువ్వురకు నాశ్చర్యము కలిగెను. "ఎట్టి శరీరవ్యాయామము లేకయే ఇంతటి శ్వాస యెట్లు కలిగినది? చూచితిరా! ఇదంతయు మాష్టరుగారి దివ్యానుగ్రహము!" అని శ్రీ శాస్త్రిగారనిరి. మాష్టరుగా రన వారి గురుదేవులు. శ్రీ శాస్త్రిగారు తమ వలన బాగయిన వారందరితోను తాము నిమిత్తమాత్రుడనియు, మాష్టరుగారి యనుగ్రహమే సర్వనిర్వాహకమనియు చెప్పెడివారు.

నే నచట నున్న దినములలో ననేకులు ట్రీట్మెంటుకు వచ్చెడివారు. వారిలో రిక్షాలాగువారు, కస వూడ్చుకొను వారు, ఆఫీసు గుమాస్తాలు, ఆఫీసర్లు, ఉపాధ్యాయులు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, డాక్టర్లు, ఇంజనీయర్లు, లాయరులు, సనాతనులు, సాయిబాబా మతప్రవర్తకులు, కమ్యూనిష్టులు, విద్యార్థులు, కాంగ్రెసు నాయకులు మొదలగు పలుతెఱంగులవా రుండెడివారు. తేలుకాటు, ఒడలు కాల్పు, గాలిసోకు, టైఫాయిడు, పరిణామశూల (Gastric ulcer) పైత్యకోశమున రాళ్లు (Gall stones), నంజు, జలోదరము మొదలగు అన్నిబాధలను శ్రీ శాస్త్రిగారు యోగట్రీట్మెంటుతోనే చక్కజేసెడివారు.

వీరిలో మిక్కిలి దయనీయుం డగు నొక బాలునిగూర్చి వ్రాసెదను. ఆబాలుని తండ్రి రిక్షాలాగువాఁడు. నాలుగు రోజుల క్రిందట ఆబాలుఁడు కాలు జారి పడెను. అప్పటి నుండియు వానికి స్మృతి కలదు గాని నోట మాట లేదు. కనుపాప లొకప్రక్కకు తిరిగి వెర్రిగా చూచును. మూతి వంకర పోయి యున్నది. మెడ ఒకప్రక్కకు వాలెను. కాలు

సేతులు ముడుచుకొని పోయి స్వాధీనమున లేవు. వానిని చేతులపై మోసికొని వచ్చిరి. ఆబాలుఁడు ముద్దగట్టిన బాధ వలె నుండెను. వానిని చూచుటతోడనే దెబ్బతిన్న లేగ దూడను జూచి యడలు గోమాతవలె క్షోభించిపోయిరి శ్రీ శాస్త్రిగారు. ఇటు బాలునియవస్థ, అటు శాస్త్రిగారి యవస్థ చూడలేకపోయితిమి. ఆబాలునికి లోని కాహార మేమియు ఇవ్వలేదని తెలిసికొని వాని తల్లిదండ్రులపైనను, వారి దరిద్రముపైనను కటకటపడి ఇంటిలోనుండి ఒకకప్పు కాఫీ తెప్పించి స్వయముగా చిన్ని చెమ్చాతో వానినోటఁ బోసిరి. ఆ పిమ్మట వాని యారోగ్యమునకై ధ్యానము చేసిరి. ఈసరికి ఆ బాలుఁడు ప్రక్కయానుడుతో ఒకవిధముగ కూర్చుండ గలిగెను. అంతట శ్రీ శాస్త్రిగారు వాని శరీర మంతయు నిమిరి సర్దిరి. వాడు సరిగా కూర్చుండ గలిగెను. చుట్టునున్నవారి మొగములు వికసించెను. ఇక వానిని నిలుచుండఁ జేసి నడిపింపవలెను. వానిని లెమ్మని చెప్పిరి. కాని వాఁడు తడవుకొనునే గాని లేవలేఁడు. డ్రిల్లు చేయువారి నాజ్ఞాపించు సార్జంటువలె నధికారగర్జనతో లెమ్మని తిరుగ ఆజ్ఞాపించిరి. అంతట వాఁడు లేచెను. అప్పుడు శ్రీ శాస్త్రిగారి తీరు చూచి తీరవలెను! ఒకప్రక్క యానందము! మరొకప్రక్క యాందోళనము! వాడు నడచిననే గాని వారికి తృప్తి లేదు. వాకిలివఱకు రెండుమార్లు వాడు నెమ్మదిగా నడచెను. తరువాత వాని నింటికి గొంపొమ్మనిరి. వెనుకటివలెనే తండ్రి వాని నెత్తుకొనఁ బోయెను. శ్రీ శాస్త్రి

గారు వలదని వానిని నడచియే ఇంటికి పొమ్మనిరి. మే మందర మాశ్చర్యముతో చూచుచుండగా వాడు నడచి యింటికి చేరెను.

ఈ రీతిగా వ్రాయ మొదలిడినచో ఆ నలువది నాళ్ల లోని ముచ్చటలే ఒక గ్రంథ మగును. తరువాత నాల్గు సంవత్సరములకు నేను తిరుపతిలో శ్రీ శాస్త్రిగారి పునర్దర్శనము చేసినపు డచటి సంరంభ మింతటికంటె మిక్కిలి హెచ్చుగా నుండెను. తిరుపతిలో ట్రీట్మెంట్ల పద్ధతి కొనసాగినతీరు చూడఁగా మానవకోటికి అమృతత్వసిద్ధి యబ్బనున్నది గాబోలు ననిపించెడిది. తిరుపతిలో నున్నపుడు జబ్బులను 'పో' యన్న పోవునట్లు తోచెడిది. కాని మకరాసులో చూడనిదుర్ఘటనలు కూడ తిరుపతిలో జరుగక పోలేదు. డాక్టరు లాస వదలుకొన్న చివరి ఘట్టములలో కొంద ఱచ్చటికి చేరినవారు కలరు. అట్టి వారిని మాత్రము మృత్యువున కేల వదలవలె నని శ్రీ శాస్త్రిగారు సాహసించి ట్రీటు చేసెడివారు. వారిలో కొందఱు సురక్షితులై నేఁటికిని సుఖజీవనము నెఱపుచున్నవారు కలరు. కాని కొన్నింట ట్రీట్మెంటు వలన నుపయోగము కన్పించుచునే ఆయువు తీరెడిది. నూటికి నూరుగురను సాధ్యాసాధ్యదశలయం దన్నింటను రక్షించుటే జరిగినచో నిక సాధన పూర్తి యయినట్లే కదా! అట్టి శుభముహూర్త మిప్పటికి రాలేదు. ఎప్పటికి వచ్చునో!

ఆధ్యాత్మికశక్తివలన శారీరకరుగ్మతలు మాన్పనగు నని పలువురు విశ్వసింపరు. నమ్మకుండుటయే న్యాయ్యము.

బలవత్తరప్రమాణము లున్ననే గాని విశ్వసింప వీలుగాని క్రొత్త విషయ మిది! తొలుత టెలిఫోను పద్ధతిని ప్రదర్శించి నపుడు అచట నున్న ఒక గొప్ప రాజకీయవేత్త దాని నొక గారడీ యని నిరసించె నట! తాను మాటాడుచు, ఆ కంఠ ధ్వని మఱొకరినుండి వచ్చుచున్నట్లు చేయు కళ [Ventriloquism] అనె నట పాశ్చాత్య భౌతిక శాస్త్ర పరిశోధకులు క్రొంగ్రొత్త విషయములను కనిపెట్టినపుడు పలుమారులు వారి నప్పటి పండితప్రపంచము నిరసించుటయో, హింసించు టయో జరిగెడిది. గెలీలియో నుండి జగదీశబోసు వఱకు శాస్త్రపరిశోధనాచరిత్రలో నిట్టి సన్నివేశములు పెక్కు గలవు. కాని అభూతజ్ఞాతము లగు విషయములను సునిశిత ముగను, పలుమారులును సంశోధింపకయే యొప్పుకొనుట వలన గూడ ఒప్పమి గలదు. ప్రత్యేకించి ఆధ్యాత్మికప్రపంచ మునకును, భౌతికప్రపంచమునకును నిచ్చెనలు వేయుపని చాల ప్రమాదభూయిష్ఠ మైనది. మార్గమా క్రొత్తది. దారి చూపువారా లేరు. ఈ దారి ఎటకు గొంపోవునో తెలియదు. మన యాయుష్కాలములో గమ్యస్థానమును చేరగలమో లేదో తెలియదు. అందుచే నీ రంగములోని యన్వేషకునకు

> "అసతో మా సద్గమయ
> తమసో మా జ్యోతి ర్గమయ
> మృత్యో ర్మామృతం గమయ"
>
> బృహ. ఉ. 1. 3. 28.

అనునిత్యపథికుని ప్రార్థన మొక్కటే తోడు.

క్రీస్తు ప్రభువుగూడ ఆత్మశక్తిచే అనేకులను నిరామయుల నొనర్చె నని విందుము. క్రైస్తవులలో నిట్టి నమ్మకమును, అనుభవములును నేఁటికిని గలవు. సెంటు బెర్నాడోటే గీతము [The song of st Bernadotte] అను నవలలోని వాస్తవికకథ యంతయు నిట్టిదే. ఫ్రాన్సులోని LOURDES అను పట్టణములోని మఠమువద్ద నిత్యము అనేక దేశములనుండి రోగులు వచ్చి ప్రార్థనలో పాల్గొని నిరోగు లగుదు రట! అచట ప్రవేశము బడయునపుడే రోగిని ఒక డాక్టర్ల సంఘము పరిశీలించి రోగవివరములను వ్రాసి యుంతు రట! పిమ్మట వారు వెడలిపోవు నప్పటి శరీరస్థితిని పరిశీలించి అది ఎంతవరకు నిజ మగుమార్పో కాదో నిర్ణయించి రికార్డు చేయుదు రట. జీవ వైద్య శాస్త్రములలో నగ్రశ్రేణికి జెంది, నోబెల్ బహుమతి బడసిన అలెక్సిన్ కెరోల్ అనుమహానీయుఁడు MAN THE UNKNOWN అను గ్రంథములో నిట్టి చికిత్సను గూర్చి ఇట్లు వ్రాసినాఁడు.

" ....The most important cases of miraculous healing have been recorded by the Medical Bureau of Lourdes. Our present conception of the influence of prayer upon pathological lesions is based upon the observation of patients who have been cured almost instantaneously of various affections, such as peritoneal tuberculosis, cold abscesses ,osteitis, suppurating wounds, lupus, cancer, etc. —The only condition indispensable to the occurence of the phenomena is prayer. But there is no need for the

patient himself to pray, or even to have any religious faith. It is sufficient that some one around him be in a state of prayer. Such facts are of profound significance. They show the vality of certain relations, of still unknown nature between psychological and organic processes. They prove the objective importance of the spiritual activities, which hygienists, physicians, educators and sociologists have almost always neglected to study. They open to man a new world........."

నేఁటి విజ్ఞాన పరిశోధనవలన పెక్కు ప్రకృతిరహస్యములు వెల్లడి యయినవి. పదుమూఁడు, పదునాలుగు శతాబ్దములలో శాస్త్రపరిశోధనతీరును పరికించిన వా రెవరును నేఁటి విజ్ఞానసముపార్జన సాధ్య మని యూహించి యుండరు. నేఁటి విజ్ఞానపరిశోధన జీవ జడ పదార్థములను వేర్పఱచు కక్ష్యాంతరములోనికి జేరుచున్నట్లు తోఁచును. మరియొక యడుగు వైచినచో నది విరాట్టునే చేరు నేమో! శాస్త్ర పరిశోధకులు వారి కవసర మయినపుడు పరిశోధనామార్గములను, పరికరములను మార్చుకొనుచునే యున్నారు. ఈ నూతనాన్వేషణకు వలయు మార్పులను జేసికొనుట వారి ప్రజ్ఞకు మించినది గాదు. కాన వేగిరపడి వేనిని త్రోసివేయవల దని మనవి!

# [3]

శ్రీ శాస్త్రిగారి ప్రజ్ఞ బహుముఖముల ప్రసరించినది. వారి వ్యక్తిత్వమును శ్రోత్రవారికి పరిచయపఱచ గోరెడు రచన కెంతయో నేర్పు గావలెను. మరియు గ్రంథమా పెరుగును. అందుచే నేనిట కొన్ని కొన్ని పట్టులను స్పృశించి వదలెదను.

కల్పనాసాహిత్యమును గూర్చి వారి యభిప్రాయము విశిష్ట మైనది. అట్టి గ్రంథములందు మనము చూచునది అసత్యమే! అసత్యపఠనలో కాలము వ్యయింప నేల? కవి ద్రష్టయైన గాని జీవితసమస్యల లోఁతు తెలియనేరఁడు. ద్రష్ట కాని వాని రచనలు కొలఁదిలోతున నూరెడిజలమువలె దుష్టములు.—నిజమైన కవిత్వమునకు శబ్దార్థాలంకారముల యాడంబరముల పని లేదు. ద్రష్ట యైనవాని రచనలందు వస్తుగౌరవమునుబట్టి అన్ని యలంకారములు నందు స్వతస్సిద్ధముగ నేర్పడును. ఇందులకు గాంధీజీ రచనలే సాక్షి. మానవవిజ్ఞానకళ్యాణములను గూర్చు శాస్త్రవిషయగ్రంథములు పఠనీయములు.

మరియు నిత్యజీవితములోని యనేక యథార్థ సంఘటనలు కవితావస్తువుగ స్వీకరించి, కరుణరసప్రధానముగా నీతిప్రబోధకములుగా అలఁతి యలఁతి మాటల కూర్పుతో సుందరముగ రచింపనగు నని వీరు తలఁచెడివారు. ఆరీతిని వారు కడుపుకీపు, విశ్వాసము, కపోతకథ, మున్నాళ్లముచ్చట మొదలగు చిన్ని ఖండకావ్యములను రచించిరి.

పూర్వసాహిత్యమున భవభూతి మహాకవి యుత్తర రామచరిత్ర వీరిని పులకింపఁజేసెడిది. ఆనాటకమునకు వీరు చెప్పెడువ్యాఖ్య ప్రతిభాసమన్వితముగా నుండెడిది. శాకుంతల మన్న వీరి కభిరుచి తక్కువ. తుమ్మెద నెపముగా దంభములాడుచు ప్రవేశించుదుష్యంతునిఁ జూచి వారు జుగుప్స పడెదరు! ఆ పాత్రకును నేఁటి రౌడీరసికునకు భేదము లే దని వారి యూహ. సాహిత్యమును గూర్చి వారికిఁ గల విశిష్టాభిప్రాయములు నన్నింటి నిట వ్రాయ ననువు గాదు. ఆ పనికి నేను చాలినవాఁడను కాను. వారి ఆత్మజిజ్ఞాస సాహితీరంగమున నెట్లు ప్రతిబింబించెనో చూపుటకు మాత్ర మిది వ్రాసితిని. తుదకు సాహిత్య విమర్శయందును, చరిత్రపరిశోధనమందును కల్గు ఈర్ష్యాద్వేషాదులను రోసి వారు వానిని వదలి తమ జీవితమును మానవసేవకే అంకితము జేసిరి. ఆ సందర్భమున వారు చెప్పిన పద్యములు.

కవితాశిల్పము సల్పఁగాఁ దొలుత వేడ్కల్ రేగ నాకుఁ, గృశుల్
చివురెత్తెఁ, వెస మోము మొత్తెఁ, నిఁక నాచేఁ జెల్ల వీ కల్ల బొ
ల్లి వినోదంబు, లవే జరామరణముల్ చీడల్ హతం బార్చి పు
ట్టువుచెట్టుఁ సఫలీకరించుకొని యంటుల్ గట్టెదఁ మాలినై.
త్రికరణశుద్ధిగా భవదధీనుఁడనై యితరప్రవృత్తి వీ
డికొని పరార్థలాభ మొకటే గమనించుచు నుందు, నింక మా
యికము ధనాదికమ్ము గణియింపను, సత్యదయోపకార సా
ర్థక మగునాత్మచింతనపథంబునఁ దప్పి చరింప నీశ్వరా !

శ్రీ శాస్త్రిగారు కల్పనాసాహిత్యమును నిరసింతురనియు, సాహిత్యమున సైతము కరుణను, నీతిని ప్రధాన

ముగా నెంతు రనియు, సాహిత్యకృషియే వీడి రోగులకు ట్రీట్మెంటు చేయుటతో కాలము గడపెద రనియు వ్రాసిన దానినిబట్టి వారి సాన్నిధ్యమున నుండుట యన శుష్క వేదాంతములతో నీరసజీవనమును గడపుట యని తలపోయ రాదు. ఆయన నిజముగా సత్యాన్వేషి! కళారాధకులు! ఉత్సాహజీవి! వారి ప్రతి పనియందును ఈ గుణములు కన్పించుచుండెడివి. రకరకముల రంగుపెన్సిళ్ళు, కలములు, చేతికర్రలు, వింత వింత వస్తువులు సేకరించుటయందు వారికి ప్రీతి యెక్కువ. ఈ పెన్సిళ్ళను సేకరించుటే వారి వంతు గాని వాడుకొనుట యుండదటవంతు! ఇట్లే ఫౌంటెన్ పెన్నులు. దేనితో వ్రాసిన దస్తూరి సొంపుగా నుండునో యని చూచెడి వారు. చుట్టునున్నవారు తమ తమ పెన్నులతో పోటీపడెడు వారు. చిటికెనవ్రేలంతటి కొబ్బరికాయల నెచటి నుండియో తెప్పించి వానికి వెండిపొన్నులు, మూతలు చేయించి స్వయముగా మెఱుగు పెట్టి స్నేహితులకు బహూకరింతురు ఇట్టిది నా కొకటి ఇచ్చిరి. నేను నశ్యము వాడనుగదా యని సందేహించితిని. నశ్యమునకైనచో వా రాపని చేయరు. ఆకాయలో దూదిపెట్టి అందు మంచి యత్తరు గాని యూడికొలొం గాని వేసి వాసన చూచుకొనవచ్చు నని వారు సలహానిచ్చిరి. ఇట్లే అనేకరకముల చేకర్రలను వారు స్వయముగా మెఱుగు పెట్టి స్నేహితుల కిచ్చెడువారు. తాటిచేవతో చేయబడి గుర్తింపరానివి, పామువలె ఏ డెనిమిది వంకరలు తిరిగినవి, పెద్ద పెద్ద వెండిపొన్నులతో మెఱయునవి యగు రకరకముల

కత్రలు వారికడ నుండెడివి. ప్రార్థనా మందిరములో కూర్చుండుటకు రకరకముల పొడల జింకలచర్మములు, పెద్ద పులిచర్మములు తెప్పించెడివారు. వారికడకు తెలుఁగునాటి నాలుగుమూలలనుండి అన్నివర్ణములవారును, అన్నితరగతుల వారును వచ్చెడివారు. వీరందఱిని తమవచోచమత్కృతితో నలరించెడివారు. మఱియు వారు వారు వాడిన క్రొత్తమాటలను గూర్చియు, వాని ఆనుపూర్విని గూర్చియు అప్పటి కప్పుడే ఫైలాలజీని నిర్మించెడివారు. దోసె అనగా రెండుచేతుల వెడల్పు గల దనియు దో=రెండు, + సెయ్ = చేతులు) అరసె యనగా అరచేతి వెడల్పు గల దనియు (అర+సెయ్) అనియు నాభత్యములకు క్రొత్తరుచి కలుఁగునట్లు చెప్పెడివారు. ఇఁక పండ్లు కోయదగిన పరువములు, వాడఁదగిన రీతులు, కూరల రుచులు బహుపరిశీలనతో చెప్పెడివారు. గుంటూరు, కృష్ణాలలోని గోగుపచ్చడినిగూర్చి 'కడుపుతీపు' అను చిన్ని పద్యకావ్యములో వారు ఇట్లు వ్రాసిరి.

"పయరకూర వేచి పచ్చిమిరెపపండ్ల నుక్కళించి పోసి యూర నిచ్చి
కొంత కొంత పొగిపికొనుగోఁగుఁ బచ్చడిచవికి నింక నోరు చివికితీరు."

ఈ యోగసాధకులకు పుష్టికర మైన యాహారము అవసరము ట్రీట్మెంటు చేయువారికి ఈ సౌకర్యము మిక్కిలి యవసరము. కాని మదరాసులో నున్నఆరోజులలో శ్రీశాస్త్రి గారికి ఏఁబదిరూకల వేతనము. పెద్దకుటుంబము. ఆపైన వచ్చిపోయెడివారు. సగము పైగా యింటి అద్దెకే ఖర్చు. ఇక బియ్యము, పప్పు, కూరలు, పాలు, నేయి, కట్టెలు, బట్టలు,

అహో! నిజముగా నివి యన్నియు శాస్త్రిగారి కుండెడివా? ట్రీట్మెంటుకు వచ్చినవారివద్ద చిల్లగవ్వ పుచ్చుకొనరు. ఎవరైన నాలుగుపండ్లు తెచ్చిరో వారి కనుమానము! ప్రతిఫలము పుచ్చుకొని ట్రీట్మెంటు చేయు మనుచున్నారని. తెల్లవారుసరికి, సాయంకాలమగుసరికి ట్రీట్మెంటువేళకు దహాదహామని యాకలి! యోగసాధనకన్న నాకు చూడగా వారి సంసారసాధనయే కష్ట మనిపించినది. ఆపేదఱికముగూడ వారిని భగవదభిముఖులనే గావించెడిది. ఇన్ని చిక్కులలోను వారు చలింపక "భారము లన్నియు నీపైన నైచి నిర్భయుడనై యున్నానుతే" అనియో, "తరము గాని యెండవేళ కల్పతరు నీడ దొరకినట్లాయె ఈవేళ!" అనియో గొంతెత్తి పిల్లవానివలె పాడుచుండగా మనము వేరొక ప్రపంచములో నున్నట్లు తోచెడిది. ఆపూటకు బియ్యము లేక, భగవంతుడేమి చేయునో చూత మని జరపిన కథలుకూడ కలవు. ఆపూటకెవరో ఇంతకన్న భాగ్యశాలి నెల్లూరినుండి శేరున్నర బియ్యము మూట గట్టుకొని పదిగంటల ప్రొద్దెక్కినప్పటికి తెచ్చి యిచ్చెను. ఇతడాదినము రావలసినవాడుగాదు. వీరి యవసరము తెలిసినవాడును గాదు. మరియొకనాడు భోజనమునకు పూర్వమే యని జ్ఞాపకము—ఏదో మాటాడుచు ఇపుడు అనాసపండు తినిన బాగుండును అనిరి శాస్త్రిగారు. ఇంతలో తలుపు తెరచుకొని రాజమండ్రినుండి ఒకమిత్రుడు అనాసపండ్ల బుట్టను తెచ్చెను. లేమిడిచే నలిగులి యగుచున్నను దాని నుండియే ఒకవింత తృప్తిని కల్పించుకొనెడివారు శ్రీ శాస్త్రి

గారు. ఒకరాత్రి భోజనానంతరము విశ్రాంతిగా నిద్రపో బోవుచు నిట్లనిరి. "ఏమయ్యా! నాకు గలపరితృప్తి జార్జి సార్వభౌమునకైన నుండదు. ఈ పూట ఇచటకు బాధ పడుచు వచ్చినవా రెందఱో నవ్వుచు బోయిరి. నావలన ఈశ్వరు డిట్టి పుణ్యకార్యములను చేయించుచున్నాడు గదా యను తృప్తితో నేను హాయిగ నిద్రింపఁగలను. మరియు మన కేపూటకు వలయువాని నాపూటకు చుక్కలు చుక్కలుగా అమృతము స్యందించినట్లు భగవంతుఁ డనుగ్రహించు చున్నాఁడు. అప్పటి కప్పు డది యాస్వాద్యమై హాయిని గొల్పు చున్నది. నిలువఁజేయవలె ననెడుపరితాపము గాని, నిలువ చేసి దానిని సంరక్షించుకొనుటకు పడునవస్థలుగాని నాకు లేవు గదా!" ఈమాట విన్నవారికి ఎట్టి ఇక్కట్టులను, నాటంకములను, కష్టములను సైతము రోగి తనకు మేలు కలిగించు సాధనములుగ మార్చుకొనగలఁ డనుమహానీయ సత్యము స్ఫురించి తీరును!

## (4)

శ్రీ శాస్త్రిగారు నెఱపు ట్రీట్మెంటు పద్ధతినిగూర్చి పాఠకు లీసరికి తెలియ గోరుచుందురు. ఉభయసంధ్యలయందును నొకచో నుపవిష్టులై శాస్త్రిగారు వారి గురుదేవులను స్మరించి, నమస్కరించి, కనులు మూసికొని కొంత తడవు అంతర్వీక్షణములో నుందురు. వారిలో నేమి జరుగునో మనకు తెలియరాదు. రుగ్ణతాపీడితులు గూడ ఆసమయములందు వారి సన్నిధిని చేరి కూర్చుండి, వారి వారి యనారోగ్యములు

నయమగునట్లు అనుగ్రహింపుమని కరుణాసముద్రుఁడైన భగవానుని వేడికొని, కనులు మూసికొని శరీరములో నేమి జరుగునో సాక్షిమాత్రముగ గమనింతురు. కొందఱికి వింత వింత సుందరతరదృశ్యములు కనుపడును. కొందరికి శరీరమున నొప్పి గలభాగములం దేదియో కదలించినట్లును, సవరించినట్లును తెలియనగును. కొందఱు చీకుచింతలు మఱచి హాయిగా నిద్ర జెందుదురు. ధ్యానానంతరము శరీర ముత్సాహముగను, బాధావిహీనముగను ఉండును. కొన్నిపూట లిట్లు జరిగినచో క్రమస్థిరారోగ్య మేర్పడును. ఎప్పటికప్పుడు ధ్యానసమయమున జరిగినవిశేషము లన్నియు రికార్డు చేయఁబడుచుండును.

ఒకప్పుడు ఒకరి యనారోగ్యకారణము మానసికము అయి యుండవచ్చును. అట్టియెడ నాకారణము నన్వేషించి యెరుకకుఁ దెచ్చుకొని దిద్దుకొన్ననే గాని ఆయనారోగ్యము చక్కబడదు. శారీరకమైనను, మానసికమైనను అనారోగ్య స్వరూప మంతయు చికిత్సకునికి అవగాహన కానిదే చక్కబడదు. ఇందునుగూర్చిన అద్భుతమైనవిశేషము లెన్నియో చికిత్సకై వచ్చినవారు రికార్డు చేసినవే చాల గ్రంథము కలదు—

దగ్గర కూర్చున్న వారికే గాక శ్రీ శాస్త్రిగారు సుదూరమున నున్నవారికిగూడ చికిత్స జరపుటయు, ఆశ్చర్యకరముగ వా రారోగ్యము పొందుటయు గలదు. ఒకప్పుడు ప్రమాద సమయ మని తోచినపుడు, ఇతరోపాయము లన్నియు కట్టుబడి

నపుడు, శ్రీ శాస్త్రిగారికి టెలిగ్రాము పంపుటయు, ఆతంతి చేరీ చేరక మున్నే ఇచట సౌఖ్యము గలుగుటయు గలదు.

శ్రీ శాస్త్రిగారు వ్యక్తులకును, రుగ్ణతలకును ట్రీట్మెంటు చేయుటయే గాక దేశము మొత్తమును పీడించుసమస్యల సుఖపరిష్కారమునకై గాఢమైనతపస్సు చేయుటయు గలదు. 1946 ప్రాంతమందలి రాయలసీమ కరువునుగూర్చియు, 1947 భారతదేశ స్వాతంత్ర్యమునుగూర్చియు వారు చేసినఅమోఘ తపస్సును, అందు వారు పొందిన దివ్యానుభూతులును మఱువరానివి. ఈసందర్భమున గాంధిజీ ఉపవాసములలో శ్రీశాస్త్రి గారు వారి క్షేమమునకై యెంతగానో కృషి చేసెడివారని వెల్లడించక యూరకుండఁజాలను. శ్రీ శాస్త్రిగారు తమ సహజ వినయశీలమువలన నిట్టివి బహిరంగపఱచెడివారు కారు. దేహములు రెండు గాని ప్రాణ మొకటే యన్నంత గాఢాభిమానముతో గాంధిజీని వీరు ప్రేమించెడివారు. ఆయన అహింసాతత్త్వమును, హరిజన సంస్కరణ, దేవాలయ ప్రవేశ ఉద్యమములను బలపఱచెడువారు. ఆయద్భుతవిశేషము లెల్ల ప్రకటించవలసినదే! గ్రంథవిస్తరభీతిచే వాని నన్నిటిని వదలితిని. వారి పరిచయు లెల్లరు వాని నెఱుగుదురు.

శ్రీ శాస్త్రిగారివలెనే పలువురు భృక్తరహిత తారక రాజయోగమున దీక్ష బడసిరి. వారెవరు గాని ఇంతటి పట్టుదలతో, విజయవంతముగా నిత్యము ట్రీట్మెంటు చేయుటనే నెఱుఁగను. వారిలో కొందరికి ట్రీట్మెంటు పద్ధతినిగూర్చి వేఱు అభిప్రాయములు గూడఁ గలవు. ఒకటి—ట్రీట్మెంటు

చేయువా రాపదలపా లగుదురు. రెండు—ఈ యోగము ట్రీట్మెం టులకై ఏర్పడలేదు.—అని వీరి మతము. ఈ విషయమై శ్రీ శాస్త్రిగారివలన మేము తెలిసికొన్న దేమనఁగా :

ఒకటి :—ట్రీట్మెంటు పద్ధతికి మూలసూత్రము పరుల యార్తినిగూర్చి ఆపుకోలేని యనుతాపము. ఆబాధ తనకే కల్గినదా యన్నంత వగపు. ఆ యనుతాపమే బాధితుల యార్తిని దీర్చును. ట్రీట్మెంటు సలుపువాఁడు "ఇదిగో! చూడు! నే నొక మంత్రము వేయుచున్నా" ననుదృష్టితో నున్నచో నది సాగదు. ట్రీట్మెంటు పడయువాఁడు "ఏదీ! నాపై నీమంత్రము ప్రయోగింపు చూత" మను తీరున నుండ రాదు. అట్టిచో నేమియు జరుగదు.

ప్రథమమున శ్రీ శాస్త్రిగా రితరుల బాధనుగూర్చి తపించుటే గాని, అందువలన ప్రయోజన ముండు నని గాని, రోగ నివారణ జరిగినదని గాని గమనించలేదు. కాని కొన్నిమారులు తీవ్రానారోగ్యముచే బాధపడువారిని జూచి శ్రీ శాస్త్రిగారు దుఃఖితు లగుటయు, అతిశీఘ్రముగ వ్యాధి నివారింపబడు టయు గమనించి నిర్హేతుకజాయమాన మగుఅనుకంపమే సర్వరోగనివారక మని తెలిసికొనిరి.

మఱియు స్వపరభేదములను పాటించినచో ట్రీట్మెంటు పని చేయదు. మానవుల నందఱను నేకకుటుంబముగ జూచు సమత్వబుద్ధి యేర్పడినకొలఁది ఈ ట్రీట్మెంటు విధాన మద్భుత ఫలితముల నిచ్చును. ఈ యోగము ననుసరించువారు పలువు రున్నను నీ ప్రత్యేకార్హత శ్రీ శాస్త్రిగారికే యబ్బుటకు

కారణము వారి అపారకరుణాస్వభావమే. కాని ట్రీట్మెంటు చేయువారికి ఆయారోగుల బాధలు శారీరకముగా ఛాయామాత్రము కల్గుటయు నిజమే. 1926 ప్రాంతములో శ్రీ శాస్త్రిగారు బాహాటముగా, నిత్యకృత్యముగా ట్రీట్మెంటు నవలంబించినపుడు పలువురు మిత్రు లీ కారణమును జూపి వారింపఁజూచి రట! ఆనాఁటిధ్యానములో శ్రీ శాస్త్రిగారు తమ గురుదేవులతో నీరీతి విన్నవించి రట—"నిజముగా పరులబాధ తొలఁగి ఆకారణమున నాకు బాధ కల్గినను సమ్మతింతును. ఆతొలఁగించునది నేను కాదు. నావెనుక నీవే దాగియున్నావు. సర్వదయామయుఁడ వైననీవు నావలన పరులబాధలను తొలగించి నన్ను బాధలో ముంతు వని నేను వెరతునా? నీ వెనుక నేను దాగ నేరనా?" ఈ విషయమునే దెలుపుచు శ్రీ శాస్త్రిగారు రచించిన పద్యములు :

స్వామీ అంతరనిలయా స్వయం వ్యక్తమై వెలయు
నాయజ్ఞానావరణను నాశముఁ జేయు మహాత్మా
నే నను నాయధమాధమ నిర్వాహము తొలగించి
నీలో నను గలుపుకొని నెగడగదే పరమాత్మా.
నాలో గల వని యెఱుగక నానాబాధల పడితిని
త్రోవెఱిగితి నిప్పటికి దుఃఖము తొలగెను దేవా.
దేవర నా కీదేహము దేవళమై వెలసినది
చక్కగ నెలకొని విశ్వస్వామిత్వము నెఱపగదే!
అద్దమువలె దేహం బిది యమలినముగ జేసికొని
నిద్దపునీ తేజము జగదుద్దీప్తము చేయగదే!

అనుక్షణము త్వన్మయతాహ్లాదను హెచ్చెడువిధమున
క్షణక్షణము మన్మయమై జ్వలియింపగదే దేవా!
అహంకార మమకారము లడగార్చి క్రమక్రమముగ
కరగజేసికొని నీలో కన్నతండ్రి! గడతేర్చుము.
నాచాటున డాగిరొ దోబూచులాడు చున్నావా?
చూచితి నిక నే నేమఱి నీచాటున డాగెదను.
వెనుకడుగిడ నిక నాథా! వెలుపుజెంద నిక నాథా!
కడతేఱెద నిక నాథా! కల్యాణం బిక నాథా.

ఆ నాఁటి నుండి శ్రీ శాస్త్రిగారు దేహమును వీడు మరుక్షణమువఱకు నేకదీక్షతో ననేక భయంకరజాడ్యములను మాన్పిరి. నిజముగా ట్రీట్మెంటువలన నెట్టి యుపకారమైన జరిగియే యున్నచో వారు భౌతిక కాయము నెన్నడో వీడియుండవలసినది. క్షయ, జలోదరము, ఉబ్బసము, మెనింజైటిస్, గుండెజబ్బు, పాముకాటు మున్నగు ఉపద్రవముల నెన్నింటినో వారు చక్కబరచిరి. ఈ యోగచికిత్సావిధానమున వారికి పాతిక సంవత్సరములకు మించిన యనుభవము గలదు. అందు వారే పరమ ప్రామాణికులు!

విశేషించి వా రిట్లు చెప్పెడువారు. "పరుల యనారోగ్యములను సవరించునెడ మన యనారోగ్యములు కూడ తొలగును" అని. ఇది మాలో పెక్కురకు అనుభవపూర్వకముగా విదిత మైనవిషయము.

"దయాగుణము బలవంతముగా తెచ్చిపెట్టుకొనునది గాదు. అది ఆకసమునుండి పుడమిపై పడుచల్లని జల్లువంటిది.

దయఁ జూపువానిని, దయఁ బడయువానిని అది ద్విగుణముగా వర్ధిల్లఁజేయును" అని మహాకవి షేక్స్పియరు చెప్పినది అక్షరశః నిజము.

"The quality of mercy is not strain'd;
It droppeth as the gentle rain from heaven
Upon the place beneath; it is twice blest;
It blesseth him that gives and him that takes:",

మరియు జీసను చెప్పినట్లు,

"Blessed are the merciful: for they shall obtain mercy."—Mathew, v, 7.

రెండు:—ఈ యోగము ట్రీట్మెంటులకై యేర్పడ లేదనువారికి శ్రీ శాస్త్రిగారు ట్రీట్మెంటులే లేనిచో నిది యెవరికి కావలయును? అని సమాధానము చెప్పెడివారు. అభ్యాసకాలమున శరీరమున జరుగు కొన్ని స్పందనముల కొఱ కెవ్వరు దీని నాశ్రయింపరు అని పలికెడువారు.

ఇంతకు శ్రీ శాస్త్రిగారి సాధన వారి ప్రకృతి ననుసరించి విశిష్టమార్గ మవలంబించె నని తోఁచును. ఆత్మచింతన పథము కూడ సత్యదయోపకార సార్థకముగ నుండవలె నని వీరి నిశ్చయము. వీరి ఆత్మార్పణా విధానము జీమూతవాహనుని కథను, బౌద్ధ జాతక కథలను స్మృతికిఁ దెచ్చును.

వీరి కడ ట్రీట్మెంటు పడయఁగోరి చేరినవారు ఆరోగ్యమును బడసిన పిమ్మట తమ కారోగ్యమును ప్రసాదించిన దివ్యతత్త్వమును అన్వేషించెడివారు. మఱియు తమ బాధ నెపముగ వారు సర్వాంతర్యామి నెఱుకకు దెచ్చికొన ప్రయ

శ్నించెడివారు. ఒరుల క్లేశము నపనయించుటకు చికిత్సకుఁడు వారితో నైక్యతను భావించనిదే ఫలము కలుఁగ దని వ్రాసితిని. ఇట్టియెడ ట్రీట్మెంటు అనేకముగా గన్పట్టుచు నేకమగుపదార్థమును గురుతించుటలో నొక యభ్యాసముగ పని చేయుచున్నది. మనలను మనము చూచికొనుట కేర్పడిన భృక్తిరహిత తారక రాజయోగసాధనకు ట్రీట్మెంటు పద్ధతి సహాయకారియే యగుచున్నది. అవసరముకూడ నగుచున్నది.

మఱియు–ఇతరుఁడు బాధపడుచుండఁగా చూచి యోగి యూరకుండు టెట్లు ?

“ ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున
సుఖం వా యది వా దుఃఖమ్ స యోగీ పరమో మతః ”

భగవద్గీత VI. ౩౨.

“ఓ యర్జునా! ఎవఁడు సుఖములోను దుఃఖములోను సర్వులను తనవలెనే చూచునో వాఁడు పరమయోగి” అను భగవద్గీతాప్రబోధమును గూడ జ్ఞప్తికిఁ దెచ్చుకొందముగాక!

## భృక్తిరహితతారకరాజయోగము.

శ్రీ శాస్త్రిగారు ట్రీట్మెంటులతో బాగు చేసిన వారితో ఆ బాగు చేయునది తాము కామనియు సర్వాంతర్యామి, సర్వదయామయుఁడు నగు ఈశ్వరుఁడే యనియు చెప్పెడివా రని వ్రాసితిని. వారి గురుదేవులే సాక్షాత్పర బ్రహ్మము! కాని వారి పేరైన ఎన్నఁడును ఉచ్చరించెడివారు కారు. కారణము – ఈ యోగమును గూర్చి ప్రచారము చేయవల దని సాధకులను వారి గురుదేవులు శాసించియుండు

ఠియే! చరమదశవరకును శ్రీ శాస్త్రిగారీ నియమమును పాటించెడివారు. అంతియేగాక ఆ యొరవడినే తమ్ముగూర్చి కూడ ప్రచారము నిరోధించెడివారు శ్రీ శాస్త్రిగారు. అందు చేతనే లోకమున వారి కృషి తెలియఁదగినంతగా తెలియఁ బడలేదు. వారివలన ఉపకారము పొందినవారిలో కొంద ఱును, వారి యాంతర్యము నెఱిఁగిన మిత్రులు కొందఱును పత్రికాముఖమున వెల్వరించిన దుఃఖపు వెల్లువవలననే పలువురు మొదటిసారిగా వీరు యోగసాధకు లని తెలిసికొనిరి. ఎవఁడు లోకమును వీడిన పిమ్మట లోకము వానిని కృతజ్ఞ తతో స్మరించునో అట్టివాని పుట్టువుగదా ధన్యము!

శ్రీ శాస్త్రిగారవలంబించినది భృక్తరహితతారక రాజయోగము. దీనిని 1910 లో కుంభకోణమున నొక మహాపురుషుఁడు స్థాపించెను. వారి నామాక్షరములే ఈ యోగమునకు మూలమంత్రము. వారిని స్మరించి నమస్క రించినవారికి బ్రహ్మజ్ఞాన మిత్తు నని వారి ప్రతిన. బ్రహ్మైక్య మును పడయవలసినది ఏదో సమాధిదశలోనో లేక దేహము విడచిన పిమ్మటనో గాదనియు, ఈ ప్రజ్ఞతోనే ఈ లోక మున నే ఈ దేహముతోనే యనియు వారి మతము. వీరు చెప్పిన వానిని బోలినకొన్నివిషయములు పూర్వగ్రంథములం దుండవచ్చును. కాని వీరు ఏ గ్రంథముపైనను ఆధారపడి యీయోగమును ఆరంభింపలేదు. అది కేవలము నూతన సృష్టి! వీరు సర్వస్వతంత్రులు! మిగుల మహిమాన్వితులు! వీరి నీ మండలివారు సాక్షాత్పరబ్రహ్మముగా తలఁతురు.

పూజ, భజన, హారతి మొదలగు బాహ్యచిహ్నము లేవియు వీరు వలదందురు. వీరిని తలంచి నమస్కరించినచో శరీరములో యోగక్రియ ఆరంభ మగును. సాధకునివంతు సాక్షిమాత్రముగ తనలో జరుగుమార్పులను గమనించుటయే. ముద్రలుగాని, ఆసనములుగాని, ప్రాణాయామముగాని, హఠ యోగాభ్యాసముగాని అక్కఱ లేదు. వానిని నిషేధింతురు గూడ! అభ్యాసకాలమున ప్రజ్ఞ సాధకుని స్వాధీనములోనే యుండును.

ఆహారవిషయమున కఠిననియమము లేవియు లేవు. శరీరమునకు చల్లదనమును, పుష్టిని కల్గించుసాత్త్వికాహారము తీసికొనవలెను. సాధనకై ఇల్లు వాకిలి వదలరాదు. సన్న్యాసము పనికి రాదు. ఎవరివృత్తి వారు సాగించుచునే సాధన చేయవలెను. సాధకులు తమ్మితరులు గుఱుతించుటకై ఎట్టి యార్భాటమును ప్రకటింపరాదు. ఈసాధనవలన అనేకమహాత్తులు లభించును. వీని నెన్నఁడును దుర్వినియోగముచేయ రాదు. మఱియు అవి ప్రధానములును గావు. ఈ యోగ గౌరవమునకు తగినట్లు సాధకులు తమ ప్రవర్తనను నీతి మార్గమున నడపించుకొనవలెను.

ఇంకను ఈ యోగమునుగూర్చి వ్రాయఁదగిన దెంతయో కలదు గాని ప్రస్తుతమున కింతయే చాలు నని విరమించుచున్నాను.

గుంటూరు
ఖర
శ్రావణ బహుళ విదియ

కొత్త వెంకటేశ్వరరావు

C. V. V.

నమస్కారము

# ప్రజ్ఞాప్రభాకరము

శ్రీ నిరంతరానందనిశ్శ్రేయసార్థ
సాధకము, సర్వకిల్బిషబాధకము, స
మగ్రవిజ్ఞానదము, మహామహిమఘనము
శరణమగు మాకు సద్గురుచరణయుగము.

౧

## ఉపక్రమము

సత్యజ్ఞానానందాత్మక మగుపరతత్త్వము తత్ప్రీతి కూలగతితో అవివేకజీర్ణారణ్యమున జిక్కి చీకాకు పడు చున్న యనదను నన్ను త్రోవకు దెచ్చి కాపాడిన తీరును మిత్రగోష్ఠిలో విన్నవించుకొనుటకొఱకే నా యీ గ్రంథరచన ప్రయత్నము. దీని రచనమున నాకు పురుషోత్తముఁ డగు గాంధి స్వచరిత్ర రచనావిధానము దారిదివ్వె. గులాబి మొగ్గను గడుపునఁ బెట్టుకొని దాని గ్రమ్ముకొని కలుకునూగు తొడిమ తాకే తొలుత గానవచ్చినట్టుగా ఉపక్రమమున

నిందు ప్రభాకరనామకుఁడ నగు నేనే కానవత్తును గాని, నాలోని దివ్య తత్త్వపుఁ బూవు వికాసము చెందిన పిదప, నది సువాసనను సౌకుమార్యమును వన్నెలను వెలార్పఁ జొచ్చిన పిదప, దాని గొని యానందింపఁ గోరువారికి నేను తత్ప్రదర్శకుడనుగానే, యంగుళీగ్రాహ్య మగు తొడిమను గానే యడుగునఁ బడి యుండి కానవత్తును. అప్పు డిది ప్రజ్ఞా చరిత్రమే కాని ప్రభాకర చరిత్రము గాదు. ప్రభాకరచరిత్ర మయినను ఆ ప్రభాకరుడు తొల్లింటి నేను గాక వేఱొకఁడే.

పరుషము నిష్ప్రయోజన మబద్ధ మనార్యము చేరరాదు నా
విరచనలందు, డెందము పవిత్రముగా విలసిల్లి సత్యసుం
దరము పరార్థయుక్త మగుతత్త్వము నే వెలయింపఁగావలెన్,
గురుచరణారవిందములకుం బ్రణమిల్లెద నట్టి నేర్మికై.

---

## ౨

## జననాదికము

సర్వజిన్మాఘ బహుళైకాదశీ మంగళవారమున ఉదయాది 19 గడియలకు జ్యేష్ఠాచతుర్థచరణమున—క్రీ. 1888 ఫిబ్రవరి 7 వ తేదిని - కృష్ణాతీరమున పెదకళ్లేపల్లి గ్రామమున నేను జన్మించితిని. నా జాతకచక్రము జన్మకాల ఘటికాది వివేచనతో నా బాల్యమున మా నాయనగారు వ్రాసియుంచినది కలదు గాని - నేను దాని నెల్ల నిందుదాహరింప వల దనుకొంటిని. జోస్యులకు దాని పరిశీలనపు టలజడి వల దని నా కోరిక.

మా యూరు పూర్వము వేదశాస్త్రాది విద్యావిదులగు విప్రులతో సర్వ వర్ణములవారితో విలసిల్లినది. నా పసితనము నాఁటికిఁ గూడ వేద శ్రౌత సాహిత్య విశారదులనేకులు మా గ్రామమం దుండిరి. శ్రీ వత్స గోత్రు లగు వెలనాటి వైదిక బ్రాహ్మణుల వంశము నాది. శేషమ్మ మా తల్లిగారి పేరు. సుందరశాస్త్రి మా తండ్రిగారి పేరు. ఆ పుణ్యదంపతులకు నలువురు పుత్రులు, నలువురు కుమార్తెలును కలిగిరి. నేఁటికిని సోదరులము నల్వురము సుఖముగా నున్నాము. నాకు అక్కగారు అన్నగారు నిద్దఱగ్రజులు. తర్వాతివా రవరజులు. మా తల్లి పరమసాధ్వి.

మా తండ్రిగారు కొంత కొంతగా స్మార్త వైదిక జ్యోతిష శిల్ప సంస్కృత సాహిత్యముల నేర్చిన వారు. ఆంధ్ర

మున మంచి సాహిత్యమును కొంచెము కవితా పరిజ్ఞాన
మును గలవారు. వైద్య విద్యా విశారదులు. పారంపర్య
ముగా పురోహితత జీవిక యయినను మా తండ్రిగారు
ప్రధానజీవిక వైద్యముగా వర్ధిల్లిరి. మా తల్లిదండ్రులు పర
స్పరము ప్రేమమయులు. వివాహ మయిన తర్వాత వారె
న్నడు భిన్నస్థలములలో నెక్కువ నాళ్లు వసించి యెఱుగరట!
దంపతులు గాఢానురక్తు లగుచో, సత్సంకల్పు లగుచో,
రసభావానందమయు లగుచో తత్సంతానము చిరంజీవిత్వాది
గుణగణ్యమై వెలయఁగల దని ఇటీవలి నా గట్టి యెఱుక.
ఇందు కెన్నో తార్కాణ లెఱుగుదును.

మా తల్లిదండ్రుల ప్రగాఢానురాగము తత్సంతాన
మగు మా కింతదాఁక క్షేమారోగ్యాదికము ప్రసాదించిన దని
నా విశ్వాసము. మా తండ్రిగారెనుబదిమూఁడేండ్లు నిరామయ
దీర్ఘజీవితము గడపిరి. వారి తండ్రిగారును నెనుబదిమూఁడేండ్లు
జీవించిరి. మా తాతగారవసానకాలమున కుమారుని బిలిచి
"నాయనా! నీవును నావలె నెనుబదిమూఁడేండ్లు జీవించ
గలవు" వని మా తండ్రిగారి నాశీర్వదించిరట! పలుమారులు
మా నాయనగారీ యాశీర్వాదమును జెప్పుకొనుచుండెడి
వారు. వారి యాశీర్వాదము మా తండ్రిగారియెడ ఫలించి
నది! మా తల్లిదండ్రులు సంపన్నులు కారు గాని సంపన్నుల
కంటె సుఖముగా జీవిక గడపిన వారు. పుత్రపౌత్రాదులతో
మా యూర మా యిల్లు దోసతోటవలె నుండెడిది. మా
యింట మా నాయనగారు నూటింటిదాక జన్మోత్సవములు
వారి కాలమున జరపినట్లు లెక్కించుచుండెడివారు.

# 3

## బాల్యస్మృతులు

ఒకనాఁడు తోడిబాలురతో గోచికూడ లేక వీధిలో చింపిరి కాగితముల నేఱి యేదో పిచ్చి చదువు చదువుకొనుచుండఁగా నన్నుఁ జూచి పుణ్యమూర్తి కొట్టకువు సుందరరామయ్య పంతులుగారు (వారు మాయూర నేఁబది యేండ్లకుఁ బైపడిన కాలము బడి పంతులుగా నెలకొని యూరి వారి కందఱకు ప్రాథమికవిద్య నేర్పిన సచ్చరిత్రులు.) నాచేయి పట్టుకొని యింటికి గొనివచ్చి మా మాతృశ్రీ నడిగి గోచి గొని తానే మొలత్రాటికి దాని దగిలించి బడికి గొని పోయి రెండు మూడు నాళ్లలోనే అక్షరజ్ఞాన మలవరిచిరి. తర్వాత వారిచేతనే మా తండ్రిగారు నా కక్షరాభ్యాసము జరపించిరి. నన్ను నే నెఱుఁగుటకు ఇది నా తొలిగుర్తు.

బడిలో నేదో చదువు సాగినది. అన్నింట నేనే మొనగాఁడను. లెక్కలు మాత్రము నిండుసున్న. తెలుఁగన్న వెఱ్ఱి తీపు. బడిలోని యుపాధ్యాయులు నాచే పద్యముల జదివించుచు సంతోషించుచుండెడివారు. సంగీతముతోడి చదువు నాఁటికి నేఁటికిని గూడ నాకుఁ గొఱుకఁబడని మెఱికబియ్యమే! సంగీతము లేకున్నను సందర్భస్ఫూర్తి గలుగునట్లు పసినాట లెక్క కెక్కుడుగ పద్యములు నేను చదువఁ గల్గుట యుపాధ్యాయులకు ముచ్చట గొల్పెడిది. మా చుట్టుపట్టు గ్రామములన్నింటికంటె మాయూరనే మాయింటనే సంస్కృతాంధ్ర

నిఘంటువులు ధర్మశాస్త్రాదిగ్రంథ సంచయము నధికముగా నుండెను. గ్రంథములకై యనేకులు మాయింటికి వచ్చెడివారు. అర్థ మయినంతవఱకు మా యింటఁ గలగ్రంథముల నెడతెగక నేను చదువుచుండెడివాఁడను. మా తండ్రిగారు తెలుఁగు మఱుఁగులు కొన్ని తెలియఁ జెప్పుచుండెడివారు. ఈ ముచ్చటలఁ బడి నేను ఇంగ్లీషు చదువు నిరాకరించితిని. సంస్కృతాంధ్రము లగుచో స్వగ్రామముననే కొన్ని గంటలే చదువఁదగుట, ఇంగ్లీషుకు తల్లిదండ్రులను, సుఖ భోజనమును విడిచి పెద్దయూరు బందరు పోవలయుట, పదొకొండు గంటల నుండి అయిదు గంటలదాఁక స్కూలుకు పోయి చదువవలయుట, ఊరిలోని మిత్రగోష్ఠిని విడువవలయుట దుఃఖకరములుగా నా కపుడు తోఁచినది. నిర్బంధించి మా తల్లిదండ్రులు నన్ను గ్రామాంతరమునకుఁ బంపఁజాలరైరి. పుత్రవాత్సల్యమును, భోజనాది సౌకర్యములు గ్రామాంతరమున కల్గింపఁ గల ధనసంపత్తి లేమియు దానికిఁ గారణములు.

స్వగ్రామముననే బ్రహ్మణ్యు లయినమద్దూరి రామావధానులుగారి దగ్గఱ సంస్కృతము, నింట తెలుఁగు చదువ సాగితిని. పుణ్యమూర్తులు, ప్రాతస్స్మరణీయులు మద్దూరి రామావధానులుగారు మా తండ్రిగారు నాబాల్యమిత్రులు. సమవయస్కులు. బ్రాహ్మముహూర్తమున నిద్ర లేచి సరిగా వేళకు సంధ్యావందనాగ్నిహోత్రాది ప్రాత రాహ్నికములు నిర్వర్తించుకొని ఒక గంటసేపు ఉంఛవృత్తి నెఱపి, తొమ్మిది గంట లగుసరి కింటికి వచ్చి, మాధ్యాహ్నికము నిర్వర్తించు

కొని పది కొట్టక పూర్వమే సుఖముగా భోజనము చేసి, విశ్రాంతితో విద్యార్థులకు పాఠములు చెప్పుటతో శ్రీవారు సత్కాలక్షేపము జరుపుచుండిరి. పది గంటలలోగా భోజనము కానిచో వారి కొంటికిణత తలనొప్పి వచ్చును. వారతి సుకుమారశరీరులు. వారిని గూర్చి మా తండ్రిగారిని గూర్చి నాఁడు మా యూరి వారిట్లు వాకొనుచుండువారు. రామావధానులు గారికి తన కనారోగ్యము కలుగుట ఊరి కంతకు అనారోగ్యము కలుగుట – సుందరశాస్త్రిగారికి తన కుటుంబమున కనారోగ్యము కలుగుట యూరి కంతకు ననారోగ్యము కలుగుట – అని. తమ, తమ కుటుంబవు టనారోగ్యములకు వీరు గజిబిజి పడునంతగా ఇతరుల యనారోగ్యముల గూర్చి వీరు గజిబిజి పడువారు కారనుట దీని తత్త్వము.

మా యింటి దగ్గఱనే సాలెవీథిలో సాలెవారు వారి గురువగు భావనఋషికి ఉత్సవము జరుపుచుండిరి. నా వయస్సప్పటికి ఎనిమిదో తొమ్మిదో ఉండును. సంజవేళ 7, 8 గంటలప్పుడు భోజనము చేసి అక్కడ జరుగుచున్న యుత్సవమును జూచుట కేగి యట్టట్టే నేను మైమఱచి నేల వ్రాలిపోయితిని. అక్కడివారు మైమరుపాటు కలుగుచుండుట నావల్ల విని నన్నింటికి గొనివచ్చిరి కాబోలును! ఎంతసే పయినదో! మా తండ్రిగారు దగ్గఱ శివకవచము పారాయణ చేయుచుండగా మెలకువ వచ్చెను. నా కేమియు బాధ గోచరింపలేదు. అంతే. అటుపై సాధారణముగా జాతర్లకు, దేవోత్సవములకు నే నంతగా వెళ్ల నుత్సహింప కుండుటే జరుగుచు వచ్చినది. పై

సందర్భమున నాకు మైమఱుపా టేల కలిగెనో అప్పు డెవ్వరికిని నెఱుక కందలేదు. పెక్కేండ్లకుఁ దర్వాత నాకే అది తెలియవచ్చినది. అర్హ సందర్భమున దాని చెప్పుదును.

పదేండ్లవయసు రాక ముందే యిట్టిది మఱొక సంఘటన! మాయూర కలరా తీవ్రముగా వ్యాపించినది. ఊరిలో నీదుర్వ్యాధి వ్యాప్తికి చింతించుచు గుమిగూడి సంభాషించు పలువురలో నేఁడు మాటాడినవారే రేపు దాని వాతఁబడుట, మరణించుట జరుగసాగెను. గ్రామస్థు లెన్నెన్నో తంటాలు పడిరి. గ్రామదేవతలకు ఇతరదేవతలకు మ్రొక్కుకొనిరి. వ్యాధి కొన్నాళ్ళకు తగ్గిపోయినది. తగ్గినవెంటనే పెద్దయెత్తున నాయాదేవతలకు జాతరలు సాగించిరి. ఆదేవతల యాకృతులు, వారిని గూర్చిన పంబవారికథలు, జంతుబలులు నాకు చాల రోతను భీతిని గొల్పసాగినవి. దేవత లిట్టివారా? ఈ అర్చన లేమిటి? అని నేను పలుకసాగగా చుట్టుప్రక్కలవారు దేవతలు నాపై కోపగింతు రని ఊరికి చెఱుపు చేయుదు రని మాటాడకు మని నాపై కోపగింపసాగిరి. ఆజాతర తుదినాఁడు కొర్లంక యనుపేరి దేవత కొకబండి గట్టి దానిమీఁద గసిగలలో పందిపిల్లల నైదింటిని గ్రుచ్చి అవి గిజగిజ కొట్టుకొనుచు మరణయాతన ననుభవించుచుండగా నూరేగించి యూరి బయట ఆయాదేవతల కంపకములు చేసిరి.

నాఁటి దుర్దర్శనము నేఁటికి కనుల గట్టినట్లు గానవచ్చుచున్నది. ఊరివారు జాతర సరిగా సాగె నని సంతసింపసాగిరి. గొప్ప సంక్షోభముతో నేను దుఃఖింపసాగితిని.

మరణమును గూర్చి, మరణానంతర స్థితినిగూర్చి, పుట్టుకను గూర్చి, పుట్టుకకు పూర్వస్థితినిగూర్చి, దేవతలనుగూర్చి నిరంతర చింత నాకు రేగెను. పెద్దల నడుగజాల నైతిని. తోడి వయసువారికి నాగోడు తెలుపుట వ్యర్థ మయ్యెను. వీని యాథార్థ్యము తెలియవలె నని రాత్రులందు భగవంతునికి మ్రొక్కి కనులు మూసికొని సమాధానము ప్రతీక్షింప సాగితిని. కనులు మూసికొని చూడ సాగగా చిమ చిమ చిమ్మ చీకటి నన్ను చుట్టుముట్టి మహాసముద్రమువలె గోచరింప సాగెను. దాని మధ్యభాగమున నే నున్నట్టు తెలియును. అనంతముగా నన్ను చుట్టు ముట్టి యున్నట్టి యా యంధకారము పొడుగుగా నున్నదా, చతురస్రముగా నున్నదా అని కూడ జూడ దొడగితిని. అది యేదో గోళాకారముగా నున్నట్టు తోచును. దాని నడుమ 'నేను ఉన్నాను, ఉన్నా' నన్నప్రజ్ఞ మాత్రము మినుకు మినుకు మనుచు గజిబిజి పాటుతో దోచుచుండెను. ఎన్ని రాత్రులో యిట్లు నిద్ర పట్టు నంతదాక చూచుచునే యుంటిని. ఒకటే యంధకారము. భయంకర మయిన యీ యంధకారములో నే నున్నా నన్నయెఱుక, మెలకువ మాత్రము ధైర్యచ్ఛాయను గొల్పసాగినది. అట్లు కనులు మూసికొని బైటకు జూచుచున్నట్లు చూచుటే కాని యప్పుడు నా దేహములోనికి జూచుకొనుట యన్నది నే నెఱుగను. అట్లు చూడలేదు. బైటి యంధకార గోళమున నుండి నా ప్రశ్నలకు సమాధానములు దొరకలేదు. నేను చచ్చిపోయితిని. తర్వాత! అనుకొనెడివాడను. అప్పుడే

చీకటిలో నేను లేను అని తోచెడిది. బ్రతికి ఉన్నాను అనుకొనెడివాడను. ధైర్యము తోచి మినుకు మినుకు మనుచు అణుమాత్రుడను ఉన్నాను—అని తోచెడిది. ఎంత తంటాలు పడినను ఇంతే. ఒకనాడు నాలో చర్చ. ఎందుకు పుట్టితిని? చచ్చితిని గనుక. ఎందుకు చచ్చితిని? పుట్టితిని గనుక. చచ్చితిని సరే-మరల పుట్టకుండరాదా? పుట్టితిని సరే - చావకుండరాదా? తోచదు. ఇట్టు మనోమథనము జరగగా చివరికి తేల్చుకొన్నాను. నాపుట్టుక నే నెఱుగను. నాచావును నే నెఱుగను. అంతా చీకటే. ఇప్పు డేదో నేను ఇట్టు మినుకు మినుకు మనుచున్నాను. ఇది ఆరిపోతే ఏ మవుతుందో తెలియలేదు. వెల్తు రెక్కడున్నది? నే నున్నా నని మినుకు మినుకు మను అణుమాత్రపు వెల్తురే యున్నది. ఇది ప్రజ్వరిల్లరాదా? ఈ చింత హెచ్చయినది. జాతరలమీఁద రోత మఱీ హెచ్చినది.

ఆకాలముననే అప్పటికి నాకు పదేండ్లవయ సుండునో, ఉండదో మాయూర శివరాత్ర్యుత్సవము గొప్పగా సాగును. మా చుట్టుపట్టుల యూళ్ళ కెల్ల మాయూరు గొప్పశివక్షేత్రము. అక్కడ నాగేశ్వరస్వామి యని శివలింగమున్నది. అమరావతివలె నదియు బ్రాచీన శివక్షేత్రము. ఎంత ప్రాచీన మయినను నది బౌద్ధమత వినాశ చిహ్నముగా వెలసినదే యని నా నమ్మకము. అక్కడ శివలింగ మొక బౌద్ధస్తూపశిలయే యని యిటీవలి నా నిశ్చయము. అక్కడి దేవాలయమున అర్ధ ధర్మచక్రములు గల బౌద్ధస్తూప శిలలున్నవి. కంటకసేల (గంటసాల) స్తూప విధ్వంసనానంతర

మక్కడి స్తూపశిలలు చుట్టుపట్టుల దేవాలయ నిర్మాణముల కుపకరించినవి. గంటసాలస్తూపపు సూచీశిల యొకటి మంగి యువరాజు శాసనశిలగా మాఱినది. క్రీ. 6. 7 శతాబ్దములకే బౌద్ధస్తూపములు గొన్ని యైనను విధ్వంసము చెందిన వనదగును. మా యూరి శివలింగము జనమేజయ సర్ప యాగస్థానమందు అనంత, వాసుకి, తక్షక, కర్కోటక, మహానాగకుమారులచేత సుప్రతిష్ఠిత దివ్యలింగ మని పదుమూఁడవ శతాబ్దినాఁటి శాసన మున్నది.

ఒక శివరాత్రినాఁడు-జగజ్జ్యోతి వెలిగించువేళకుఁ జాల ముందుగానే నే నక్కడకు జేరితిని. కొన్ని మణుగుల నేతి కుండులో గొప్ప జ్యోతి వెలిగించిరి నేను తిరిగి వచ్చుటలో గోపురద్వారమున జనసమ్మర్దములో నలిగి పోయి క్రింద పడితిని. నామీఁది నుండియే జనము నన్ను చింపిరిగుడ్డను ద్రొక్కించుకొనుచు నడచినట్లు నడవజొచ్చిరి. చచ్చితి నను కొంటిని. ఊపిరాడదు. ఎట్లో నన్ను కాళ్ళతోనే ద్రొక్కించుచు గోపురద్వారము వెలికిపో పడదన్నిరి. బయటకు వచ్చిన తర్వాత నెమ్మదిగా ఒంటరిపట్టుకు దొరలి చాలసేపు విశ్రాంతి గొన్నపై చక్కబడితిని. నాటినుండి గుళ్ళు గోపురములు జాతరలు నాకు దూర మయినవి.

మఱొకప్పుడు మాచుట్టుపట్టుల యూళ్ళ నెల్ల ఒకానొక యలజడి రేగినది. అది యిట్టిది – ఒకనాఁ డుదయమున నుండి సాయంకాలము దాఁక ఊరివా రెల్లరు ఊరివెలుపల వసించి అక్కడ వంటలు చేసికొని దేవతలకు నైవేద్యము

చేసి భుజింపవలయును, ఇంటి వాకిటితలుపులమీఁద శ్రీవైష్ణవ నామ మంటించవలెను. మెడలో సొరకాయ పెంచిక కట్టుకోవలెను. అట్లు చేయకున్నచో మహానర్థము వచ్చును. ప్రతి యింటివాకిటి తలుపులమీఁద నామములు వెలయించిరి. ఎక్కడివో రెండు సొరకాయ బిళ్లలు (అమ్మిరి గాఁబోలును) వచ్చినవి. జందెములకు, మెడహారములకు, మొలత్రాళ్లకు నందఱు వానిని కట్టుకొనిరి. ఊరివెలుపల వంటలకు పయనమగుచుండిరి. మానాయఁగా రిందుకు ప్రతికూలురు—ఊరివెలుపల కందఱును వెళ్లినపిదప దొంగ లూరు దోచుకోఁగల రని. మునసబు కరణాలు దైవభీతితోనే జాగ్రత్త వహింతు మని మాట యిచ్చిరి. కొంద ఱెవ్వరైన నూరు విడువకున్నచో తర్వాత నేదేని యాదృచ్ఛికముగానే ఆయెను - గ్రామమున కీడు దాపరిల్లినచో దాని తాకిడి ఊరు విడువని వారిమీఁద పడఁగలదు. కాన మాఱుమాటాడక యూరు విడిచి వెళ్లవలసినదే యని యందఱు తీర్మానించుకొనిరి. మేము మాత్రము యింట పులిహోర చేసికొని యది మూట గట్టుకొని ఊరి వెలుపలకు వెళ్ళి అక్కడ దేవతకు దాని నివేదించి భుజించి యింత మజ్జిగ త్రాగి యింటికి రాఁదగు ననుకొంటిమి. నన్నందుకై కరివేపాకు తెచ్చి పెట్టు మనిరి. ఊరిలోని వారందఱు నాహారసామగ్రులతో నూరివెలుపలకు వెళ్లుచుండిరి. దొడ్డిలో కరివేపచెట్టు గల బ్రాహ్మణుల యింటికి వెళ్ళి కరివేపాకు నడిగితిని. వారు నూరివెలుపలికి పయన మగుచుండిరి. 'కరివేపా కీయ వీలులేదు. మేము వెళ్లుచుంటి' మనిరి. నేను

దొడ్డిలోనికి వెళ్లి గోసికొని పోవుదు నంటిని, 'తలుపులు తాళములు వేసినాము. వల్లగా' దనిరి – దొడ్డివైపున వెళ్ళి కోసికొందు నంటిని–వల్లగాదు పొమ్మని వారు వెళ్లిపోయిరి. నేను దొడ్డివైపునకు వెళ్లి చెట్టుకేసి చూచుచుంటిని. కొందఱు నన్ను జేరవచ్చిరి. కరివేపాకు కావలె నంటిని. ఎందు కనిరి? ఈ దేవతకు ద్వారమున కరివేపమండ కట్టవలె నట! అందుకు గావలె నంటిని. అంతే. నాకొకమండ గోసి యిచ్చిరి. తర్వాత ఒకరొకరే ఒక్కొక్కమండ చొప్పున విఱుచుకొని కొనిపోయి ద్వారతోరణముల కెక్కించిరి. చెట్టున ఒక ఆకేని మిగులలేదు. మఱునాఁ డింటివారు వచ్చి ఆదుండగము నేను చేసినదని గుర్తించి నన్ను దండించినంత నిందించిరి. నే నబద్ధమాడినందుకు ఫల మనుభవించితిని.

దైవముపేర సంఘమున అలజడి పుట్టించుట సుకరమనీ, అది దిద్దు టంత సుకరము గాదనీ, సంఘము విద్యావిజ్ఞానవంతమై మొత్తముమీఁద వర్ధిల్లిననే గాని యిట్టి చెట్టలు దొలగింప సాధ్యము కాదనీ విన్నవించుటకే ఈ విషయముల నిక్కడ వ్రాసితిని. మతము, వైద్యము, జోస్యము, ధర్మము, ఆచారము ఇత్యాది సంప్రదాయ సంకేతములతో చెడుగు లెన్నెన్నో సంఘమున దిద్దఁగుదురనివై మొద్దువారి కదల కున్నవి. వ్యాపించుచున్నవి. మూఢవిశ్వాసముతో వాని ననువర్తించులోక ముండుటచేఁ దత్ప్రచారకులు వానిని స్వయము విశ్వసింపకపోయినను వాని వలనిలాభముచే లోకమున పలుకుబడి సాగించుకొనుచున్నారు.

కొందఱు సగ మెఱుకతో నన్నింటిని బాటించుచున్నారు. ఇటీవల జరగినవిషయ మొకటి.

నామిత్రున కొకనికి ముక్కులో పెద్దకురుపు లేచినది. ఆతని కాయుర్వేద వైద్యమునఁ గొంత నమ్మకము. మిత్రుఁ డొక ఆంగ్లవైద్యుడు దానిని ఆపరేషన్ చేసి సులువుగా దొలగింతు ననుచుండెను. వ్యాధితుఁడు పిరికివాఁడు. కూరగాయ దేశీయవైద్య మెఱిగినమిత్రుఁ డొకఁడు నఖమును అనగా చేతిగోటిని నువ్వులనూనెతో గాచి గోర్వెచ్చగా ముక్కులో రెండు బొట్లు వేసిన నది మాను ననెను. తోడనే ఆతని తల దన్నినమిత్రుడు ఇతరులగోటికంటె తనగోరు కత్తిరించి వేసికొనిననే మఱీ మంచి దనెను. నాకు వెఱ్ఱులు వేకులు నెత్తసాగినవి. ఇట్లంటిని. 'అతఁ డాపన్నుఁడు గా నున్నాఁడు. అశాస్త్రీయముగా నెఱుక లేని మొఱకు వైద్యములఁ జెప్పకుఁడు'. 'నే నెందఱకో ఈవైద్యముచే ముక్కులో కురుపులు మాన్పితిని. ఎఱుక లేనివైద్యము కా దిది' యని తొలియాతఁ డనెను. రెండవయాతఁ 'డిది యశాస్త్రీయము గాదు. కొన్ని వ్యాధులకు తనశరీరములోని రక్తమునే ఒకచోటనుండి మఱొకచోట ఇంజెక్షన్ చేసి వ్యాధులు కుదుర్చుటను ఆంగ్లేయులు గుర్తించిరి కాదా! ఇది ఎంతో పూర్వమే మనవారు కనిపెట్టి సాగించిన విధానము. నేను నాకే కురుపు లేవగా నాచేతిగోరే వేసి కాచిన నూనెతో కురుపు మాన్పికొంటిని' అని నన్ను మాటాడకుండఁ జేసెను. నాలో ఇంతం తనరానియశాంతి. ఇది బూటక మని. ఇది చేసిన రోగి

చెడిపోక పోయినను గుణము కల్గక పోవచ్చు నని యారాట పడ సాగితిని. మద్రాసులో ఉన్ననా ళ్లివి. ఓరియంటల్ లైబ్రరీకి వెళ్లి 'నఖము' గుణములకై వెదకితిని. అక్కడ ఆయుర్వేద వైద్యశాలలో పనిచేయుచున్న మిత్రున కిది తెల్పితిని. 'నఖ' మనఁగా చేతిగోరు కా దనీ, అది సుగంధ ద్రవ్యమనీ, నత్తగుల్లల వంటి జలజంతువుల గుల్లల మూతచిప్ప యనీ యామిత్రుఁడు తెల్పెను. గ్రంథములఁ బరికించి దాని యాథార్థ్యమును గుర్తించితిని. వెంటనే రోగికి దాని నెటిఁ గించి మంచి వైద్యము చేయించుకో గోరితిని. తర్వాత ఆపరేషన్ జరగెను. ఆతఁడు స్వాస్థ్యము చెందెను.

అంతరంగమున విస్పష్టపరిజ్ఞానవుతీరు గోచరింపని వారు చేయు సాహసకార్యము లిట్టివి! ఎటుక కందని వ్యాధిత శరీరమున యెటుక కందనియౌషధమును జాలినంత యెటుక లేనివారు ప్రయోగించుట, ఏదో జరగుచుండుటయుఁ గా వైద్యవిధాన మున్నది. అంతరంగమును ప్రీల్చుకొని యంత రాత్మాభిముఖముగా బయనించుచు సత్యజ్ఞానానందముల నంతలంతల ననుభవింప నలవడినవారి ప్రజ్ఞలే ప్రపంచోపకారకము లగుచుండును.

ఇంచుమించుగా నాపదియేండ్ల ప్రాయముననే నాకడ గొట్టుసోదరికిఁ జాల జబ్బు చేసినది. జీవితము నిలువదేమో యని యందఱు సందేహించుస్థితి కలిగెను. తర్వాతస్థితి యెట్లుండునో యని మాకు చల్దియన్నము వడివడిగాఁ బెట్టిరి. మాతో వావిడిచి చెప్పకున్నను ఇంటిలోని యలజడిని

గుర్తించి నేను బెంగతో నెవ్వరికిని గానరాకుండ గుడిలోని
కరిగి యక్కడ నొకమూలలో రక్షించు మని యాబిడ్డను
గూర్చి భగవంతునిగూర్చి యేమేమో ధ్యానింపఁజొచ్చితిని.
ఇంటికి మధ్యాహ్నపుఁదిండికి రాలేదు. ఇంటిలో అలజడి కొంత
తగ్గినది. రెండు మూఁడు విరేచనము లయి బిడ్డ తేటగా నున్నది.
అపాయభయము తొలఁగినది. అందఱును భోజనము చేసి నేను
గానరాకపోవుట గుర్తించి వెదకసాగిరి. మిత్రులిండ్లలో
నెక్కడను నేను గానరాలేదు. ప్రొద్దు గ్రుంకువేళ కావచ్చి
నది. మానాయనగారికి వెఱపు కల్గినది. వెదకఁగా వెదకఁగా
తుదికి గుడిలో నక్కియున్న నన్ను గనుగొని బిడ్డక్షేమ మెఱిఁ
గించి చాల దుఃఖించి నన్నింటికిఁ గొనివచ్చిరి. పసితనము
నాఁటినుండియు వ్యాధికి మృతికి నేను తార్మారయి పోయెడి
వాఁడను. ఏమియు తోచక చేయఁగల్గినది లేక ఇంట నిలువ
లేక ఎవ్వరును గుర్తింపఁజాల రని గుడిలో నొకమూల నక్కి
నాఁడు నేను దైవప్రార్థనము చేసితినే కాని దానికి ఫలిత
ముండు నని యానాఁడు నే నెఱుఁగను.

మానాయనగారు వైద్యవృత్తిలో రోగులకడ కటు
వుగా సొమ్ము పుచ్చుకొనుచుండిరి. ఒకసందర్భమున వ్యాధి
తుని యార్తికిఁ జకితుఁడ నయిననేను మానాయనగారిని
సొమ్మునకై నిర్బంధింపక మం దీయఁగోరితిని. 'ముందు వ్యాధి
కుదుర్చుఁడు. వానిచేత సొమ్మిపుడు లేదు. నెమ్మదిగా ఇయ్యఁ
గలఁడు. ఇయ్యకపోయినఁ బోనిండు. మీకు పుణ్యము దక్కు'
నంటిని. రెండునిమిషము లాలోచించి 'నాయనా! ఈకాఠి

న్యము మీమీఁది ప్రేమచేతనే నేను వ్రాసవలసెను. నే నిట్టి కాఠిన్యము వ్రాసకున్న సొమ్ము రాదు. అది యార్జించినఁ గాని మీపోషణము సాగదు. మీమీఁది ప్రేమ నన్నితరులమీఁద నింత కఠినునిఁ గావించినది' అనిరి. కనుల నీరు గ్రుక్కుకొని యూరకుంటిని. ఆసంభాషణము నాలో మఱపు రాక కుదుర్కొని నాఁటినుండి నన్ను వేధింపఁజొచ్చినది. దానినిర్వాహము ముందు తెలియఁగలదు.

---

## ౪

## పురోహితత - సదనుష్ఠానము

పురోహితవృత్తి నాకు మిక్కిలి రోఁత గొల్పినది. అది శాస్త్రగర్హిత మన్నకారణమునఁ గాదు. ప్రాచీనధర్మశాస్త్ర ప్రకారము చూచినచో నేఁడు బ్రాహ్మణు లవలంబించుచున్న వృత్తు లనేకములు శాస్త్రగర్హితములే! భృతకోపాధ్యాయత్వము, వైద్యము, గాయకత్వము, వడ్డివ్యాపారము మొదలయిన యింక నెన్నో యింతకంటె నీచము లగువృత్తులు ధనలబ్ధికై బ్రాహ్మణులు చేయుచున్నారు. అయినను అవి నిందితములు గాకున్నవి. అట్టిచో నిక బ్రాహ్మణులే చేయవలసినవి పూజారితనము, పురోహితత గర్హితము లేల కావలెను? సంఘమున కావశ్యక మైనకులవృత్తి యేది గాని గర్హితము గారాదు. అయినను పూర్వు లెల్లరు నవలంబించిన దైనను పురోహితత నాకు సమ్మతము కాలేదు. అది నేఁడు వట్టిబూటకముగా సాగుచున్నది. నూటఁ దొంబదిపాళ్లు పురోహితులను గోరువారు వారియం దాదరము గౌరవము లేనివారు. వా రేదో యలవాటును బాటించుచున్నా మన్న తృప్తికై కర్మ లాచరించుచున్నారే కాని పరమార్థబుద్ధితోఁ గాదు.

ఆ యాచరించుకర్మలును ప్రయోజనమును, స్వరూపమును సన్నసన్నగాఁ గోల్పోవుచు వచ్చి యర్థరహితము లైన బాహ్యాడంబరములుగాఁ బర్యవసించినవి. నిజముగా వాని

యెడ శ్రద్ధగలవారు స్వయము వాని నభ్యసించి నిర్వర్తించు కొనగలరు. అట్టివారు స్వయము పరమార్థబుద్ధితో నాచరించు చుండువారినే పురోహితులనుగా వరింపఁగలరు. పురోహితత వంశాచారముగా వచ్చుచుండుటచే నం దెన్నో భ్రంశములు చేరినవి. బ్రాహ్మణులలో వేయింటి కొక్కరయినను సరిగా నగ్నిహోత్రముల నుంచుకొనువారు నేఁడు లేరు. శ్రౌతసంప్రదాయమే యుత్సన్నప్రాయ మైనది. ఉపనయనమునాఁడు, వివాహమునాఁడు మాత్రము చేయునగ్నికార్యము, దానిని సరిగాఁ జేయనందుకుఁ బ్రాయశ్చిత్తములు, హోమములు పురోహితుని వింతపాటలు నాటలు నయిపోయినవి. కాళిదాసు నాటకములందు విదూషకుఁ డెట్టి పూజ్యత బొందినాఁడో నేఁడు వివాహోపనయనాది కర్మలందు పురోహితుఁడు నట్టి పూజ్యతనే పొందుచున్నాఁడు. "అశ్రద్ధ పితాళ్ళకు ఆకతాయి తర్పణ" మన్నట్లు అశ్రద్ధథానుఁ డయినగృహస్థుకుఁ దగినట్టె యవాకుల పురోహితు లేర్పడినారు. కనుక నీయవహేళిత వృత్తిలో ప్రవర్తింప రాదని, సంభావనలకు, భిక్షములకు నేనిది నేర్చితి నది నేర్చితి నని యాచనలకుఁ బోరాదని పసినాఁటనే నేను నిర్ణయించుకొంటిని.

నా కుపనయన మయినది. సంధ్యావందనాదికము నిర్దుష్టముగా నేర్చుకొంటిని. సంధ్యాభాష్యము చదివి యర్థము తెలిసికొంటిని. ఇంటిదగ్గఱనున్నచో నిక వైదికవృత్తికిఁ జొరపడ వలసివచ్చెడి దేమోకాని ఈశ్వరుఁ డనుగ్రహించెను. చల్లపల్లి విద్వాంసులు, మహర్షికల్పులు శ్రీ అద్దేపల్లి సోమనాథశాస్త్రులు

గా రప్పుడప్పుడు మాగ్రామమునకు విచ్చేయుచుండువారు. ఎడ్వర్డు పట్టాభిషేకము జరగినపుడు నే నేవో సంస్కృతశ్లోక ములు రచించితిని. వారు విచ్చేసి నారచన విని నన్నుం బ్రేమిం చిరి. వారు విజయనగరమున భీమాచార్యులుగా రను తర్క విద్వాంసులకడ సంగమేశ్వరశాస్త్రిగారితోఁ గలసి పెక్కేండ్లు తర్కశాస్త్రము నభ్యసించి తొలుత మాగ్రామమున నెల కొనఁగా నేదో తీవ్రవానారోగ్యము కలుగఁగా మానాయన గారు వారి కౌషధ మిచ్చి వ్యాధి కుదిర్చి రఁట ! తరువాత వారు చల్లపల్లి చేరిరి. ఆ యనుబంధమున వారు మా యింటికి విచ్చేయుచుండువారు. వారిదగ్గఱఁ జదువుకొనుటకు నేను చల్లపల్లి చేరితిని. లఘుకౌముది చదువ నారంభించితిని. కాని వారు పాతంజల యోగసూత్రములను గూడఁ జెప్పిరి. అందుఁ జదివినవిషయములు నాలోఁ జొచ్చుకొని పోయి వింత యోచనలఁ గొల్పసాగినవి. వారు తెల్లవారుజామున నిద్రలేచి రాత్రి పండ్రెండు గంటలదాఁక ననుష్ఠానముతో తపోమయ ులుగా విరాజిల్లుచుండెడివారు. విద్యార్థుల మగుమమ్ము గూడ నట్లు చక్కదిద్దఁ జూచుచుండెడివారు. కర్మానుష్ఠానముల మీఁద నా కేటికో శ్రద్ధ కలుగకపోయెను. బందరులో శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రులుగారు హిందూహైస్కూలులో తెలుఁగు పండితులుగా నప్పు డుండిరి.

ఇంటివాకిటఁ గూర్చుండి నేను పాఠము చదువుకొను చుంటిని. లోపల ఇల్లూడ్చుట జరుగుచుండెను. ఆదుమ్ము వాకి టికి వచ్చుచు నామీఁదను పోవుచున్నది. 'సమ్మార్జనీ రజ

శ్చైవ శక్రస్యాపి శ్రియం హరేత్' అని కలదు. ఇక్కడే కూర్చుంటి వేమి యనిరి. చూడలేదు అంటిని. 'అది కాదు. శాస్త్రవిశ్వాసము లేదు' అనిరి. ఊరకుంటిని. వారవతలికి వెళ్ళినతర్వాత 'దుమ్ము మీఁదఁ బడుట రోతే! నేను పుస్తకముమీఁది దృష్టితో ఉండి గుర్తింపఁజాల నయితిని. గురువులవా రన్నట్టు నిజముగా నిట్టిశాస్త్రముమీఁద విశ్వాసము నాకు లేనట్టే ఉన్నది' అని యేదో ప్రక్క నున్నమిత్రునితో ననుచుంటిని. అది విని శాస్త్రులవారు నన్ను చీవాట్లు పెట్టిరి.

---

౫

## అనుభూతి - తద్వికాసము

ఏదో సందర్భములో నాపసి (అయిదు ఎనిమిది సంవత్సరములనడిమి) వయస్సుననే ఆంజనేయుని దేవళమున బ్రాహ్మణ సంతర్పణము జరుగుచున్నది. నేను నున్నాను. బీటలు వాసి శిథిలముగా నున్న గుడి తలుపుసందున నుండి యెవరో తొంగి చూచిరి. ఆరగించుచున్న లోనివా రది గుర్తించి గద్దించిరి. బైటిమనిషి పైదొలగెను. మే మందఱము భుజించి వెలికి వచ్చితిమి. సాధు వొకఁ డాకొని యక్కడుండెను. 'నీవే కదా తొంగిచూచిన' దని భుక్తానులిప్తు లగు మావా రడిగిరి. 'అగు నండి! లోని సందడి విని గుడి కదా! లోని కలకల మేమో అని చూచితిని. భుజించుట చూచితిని. మీరు గద్దించితిరి. మీ భోజనానంతర మాకొన్నవానికి నా కింత యన్నము పెట్టుదు రేమో అని కూర్చుంటిని' అనెను. 'బ్రాహ్మణ సంతర్పణము చెడగొట్టితివిరా దుర్మార్గుఁడా' యని మావారు చెడదిట్టిరి. 'అయ్యా! మీ రింత యన్నము పెట్టిన నా కడుపు నిండును గాని మీ భోజనము చూచినంత మాత్రమున నా కేమి యొలుకునండీ! లోన భుజించుట యెఱుఁగక చూచితిని' అనెను. 'ఇంకా భుజింపవలసిన బ్రాహ్మణు లున్నారు. అంతా ముగిసేదాకా నీకు పెట్ట వీలులేదు. పో! తొలగిపొమ్మని ఒక మొనగాడు బ్రాహ్మణుఁ డుదరము నులుముకొనుచుఁ దిట్టెను. మిట్ట మధ్యాహ్నము పన్నెండు గంటల వేళ!

ఆ సాధువు కన్నీరు కార్చుచు ఆకసము కేసి తలవాల్చి కేలు దోయి సూర్యభగవానునికి మోడ్చి 'తండ్రీ! నే నేపాపము నెఱుఁగను. నన్ను వీరు తిట్టుచున్నారు. సర్వసాక్షివి! చూచు చున్నావు! కనికరించుమో దేవా! అని చేతి కుండికలోని నీటితో బిక్క మొగము కడుగుకొని యక్కడనుండి వెడలి పోయెను. ఆ సాధు వట్లు సూర్యునికి మ్రొక్కుచు మండుటెం డలో మాడుచు నాడినపలుకులు నా గుండెలలో వేడిగా నాఁటుకొనెను. ఒడలు జలదరించెను. ఇంటికి వెళ్లునప్పటికి తీవ్రజ్వరము వచ్చెను. మూఁడునాళ్లు చాల బాధపడితిని. ఆ బ్రాహ్మణుని ధౌర్త్యము, ఆ సాధువు జాలిమాటలు నాలో నా మూఁడు నాళ్లు నెంతో గందరగోళము గల్గించినవి. మా తలిదండ్రులకీ గొడవ నేను తెలుపలేదు. క్రమక్రమముగా నా జ్వరము తగ్గినది. ఆ మూఁడునాళ్ల శరీరకంపములో నాలో నెంతో లోతున నేదో భావము పాతుకొని పోయి నది. ఈ సంభవము మాత్రము నాకు పలుతూరులు స్మృతి పథమున మెలగుచునే యుండినది. కాని అది లోఁ బాదుకొని పోయి నాలోనుండి వెడలించిన వివేకజ్వాలలను మాత్రము నే నిటీవలనే - ఈ విషయము వ్రాయుచున్నప్పుడే - స్పష్టముగా నిరూఢముగా నెఱుఁగగల్గితిని.

పంద్రెండేండ్లకుముందు మామాతృశ్రీ దివ్యధామ మందగా ఔర్ధ్వదైహికకర్మకలాపము మాయన్నగారు చేసిరి. నేను తద్దినము పెట్టువాని తమ్ముఁడనుగా దగ్గఱ నుంటిని. "జ్యేష్ఠేనైవ తు కర్తవ్యం" అనుశాస్త్రనిర్ణయము చొప్పునే నేను పాటించి

తిని వచ్చిన వైదిక బృందము నేను కర్మ కలాపములు చేయ కూరకుంటి నని గర్హింపసాగిరి. శాస్త్ర నిర్ణయమును మా యింటి ప్రక్కనే ఉన్నసాంబశివశాస్త్రిగా రనువిద్వాంసులు నిరూపించి యా వైదికగోష్ఠిని నోరెత్తకుండఁ జేసిరి. అప్పుడు కర్మకలాప మంతయు ముగిసిన తర్వాత అన్నాతురులగు ప్రజలకు వర్ణవిభేదము లేకుండ ఒక నాఁ డెల్ల నేడెనిమిది వందలమందికి సంతర్పణము గావించితిమి. సంకల్పము నాది గాని నిర్వాహ మెల్ల మా తమ్ములు చేసిరి. వీధి యెల్ల శుభ్రపఱచి విస్తళ్లు వేసి భోజనములు పెట్టితిమి. కొందఱు వీధి యెల్ల చండాల భోజనముతో సంకరైన దని గర్హించిరి. చుట్టుపట్టుల యూళ్ల నలజడి రేగెను. మా నిర్ణయము నిర్విక్రముగా సాగెను. ఇట్టి సంకల్పము నాలో పొడముట నా బాల్యమున నాలోఁ గుదుర్కొన్న యవ్యక్తభావ కారణమున నుండి వెడలినకార్యవికాసమే యగుట నిటీవల గుర్తించితిని.

మరియు ముక్త్యాలలో జరిగిన నా కుమారుని వివాహమునగూడ నక్కడి సర్వజాతుల వారికిని, పాకీ వారికి గూడ ఒక్కొక్కనాఁ డొక్కొక్క జాతివారికిఁ గా మృష్టాన్నసంతర్పణము జరపు టయ్యెను. ఈ సందర్భమునఁ గూడ మా తమ్ములే నిర్వాహకులు. ఆ వివాహసందర్భములో మా కాప్తమిత్రులు, శ్రీ ముక్త్యాల ప్రభువులు తమ యింటి వివాహముగా వివాహసర్వవ్యయము ఎన్నివే.

లయ్యెనో తామే భరించిరి. ఇట్లు జరగుటకు గూడ బాల్యమున నాలోఁ గుదుర్కొన్న యవ్యక్తభావమే కారణము.

భూమిలోఁ బడవేసినవిత్తనము కొంతదాఁక ఏమయినదియుఁ దెలియరాక యుండి యుచితకాలమున నంకురరూపముగా బహిర్వికాసము చెందినట్లు మానవహృదయములలోఁ జొచ్చుకొని పోయినయనుభూతులు కూడ నుచితకాలమున వానికిఁ దగినట్లు పాకముతో వెల్వడి విరివి సెందును. కాని యివి బీజరూపముగా నెన్నఁడో లోనికిఁ జొచ్చుకొని పోయిన యాయనుభూతులవల్ల నేర్పడినవే యని గుర్తించుట మాత్రము సర్వత్ర జరుగదు. లోతయినసంస్కారములు కొన్ని కాల మెంతో గడచి యనుకూలసందర్భము సమకూడినప్పుడు గాని కార్యపరిణామము సెందఁజాలవు. ఆచెందిన కార్యపరిణామమునాఁటికి కారణజ్ఞప్తి మఱుగుపడి పోవుట సంభవింపవచ్చును. ఈబీజరూప సంస్కారములు లో సొచ్చుటయుఁ దర్వాత నవి బహిర్వికాసము సెందుటయు నొక్కజన్మములోనే జరగు ననఁగాదు. పూర్వక్షణపు బీజరూపసంస్కార ముత్తరక్షణముననే బహిర్వికాసము చెందునది గాఁ గొన్ని సందర్భములం దుండవచ్చును. కొన్ని సందర్భములం దేడుజన్మముల దాఁకఁ గూడఁ దేలనిది గావచ్చును. భగవత్ప్రాప్త్యర్థమైన సంకల్పబీజములు భగవత్తత్త్వమును గూర్చి స్పష్టపరిజ్ఞానము కుదురుదాఁక విరివి సెందుచుఁ బెరిగి పెరిగి పారమ్యము పొందినపిదప నక్కడనుండి బహిర్వికాసము

నకు వచ్చుచుఁ బరిపూర్ణతను జెందుటకుఁ గూడ నట్లే యేడు జన్మములదాఁక సాగవచ్చును.

పరిపూర్ణత చెందు టనఁగా మానవసామాన్యము కంటె నెంతో ఉన్నతోన్నతముగా ఎంతో లోతు లోతుగా గోచరించినతత్త్వమును మానవుఁడు తనప్రేమ ప్రసరించినచోట్ల నెల్ల వ్యాప్తపఱుపఁగల్గుట. ఉన్నతోన్నతము, లోతులోతు నయినభావ మదాటుగా అకారణముగా అసాధనముగా గోచరింపదు. తన హృదయ మెంతెంత ప్రేమమయ మగునో, ఆప్రేమ మానవతమీఁద నెంతెంత యధికాధికముగాఁ బ్రసరించునో మానవుఁ డంతంత ఉన్నతముగా అంతంత లోతుగా పారమ్యమునకుఁ జేరిక చేరికగాఁ బోగల్గును. చెట్లప్రేళ్లు విరివి సెంది దూరదూరము వ్యాపింపను వ్యాపింపను చెట్లు మీఁదికి పెరుగగల్గును. కూంకటి వేరు నేలలోఁతుకును జొరగల్గును గదా!

## ౬

## కాకిపగ

పది పదుమూఁడేండ్ల వయసువాఁడను. అప్పటికి చల్లపల్లిలోఁ జదువుకొనుటకు వెళ్ళియుండు ననుకొందును. నాకు చింతచిగురు పప్పుకూర యన్నఁ బ్రియము. మాయింటిదొడ్డిలో నున్నచింతచెట్టు గుబురుగాఁ జిగిర్చి యగ్నిజ్వాలలు రేగుచున్నట్లు మిలమిల చిగుళ్లతో మెఱయుచుండెను. 'ఆచిగురు కోసి తెత్తును. కూర వండి పెట్టు' మని మాయమ్మగారిని కోరితిని. గోడమీఁద నెక్కి చిగురు కోయుచు చేతి కందనికొమ్మ నొక కొంకికఱ్ఱతో వంగ లాగఁజొచ్చితిని. ఆకొమ్మప్రక్కలఁ గాకిగూ డున్నది కాబోలును! నాకుఁ గానరాలేదు. ఒక కాకి యఱచుచు నినుపమేకుతోఁ గొట్టినట్టు నానెత్తిమీఁద ముక్కుతోఁ గొట్టెను. ఇంకను గొట్టుచు కావు కావని యఱచుచు ఇంక నెన్నింటినో కాకుల రప్పించుకొనెను. ఒకటే గగ్గోలు! కంగారు పడి గోడ దిగి యింటిలోనికి వచ్చి వేసితిని. మర్నాడే నేను చల్లపల్లి వెళ్లిపోయితిని.

తదాది నే నెప్పు డింటికి వచ్చినను నీకాకిపగ ప్రత్యక్ష మయ్యెడిది. మఱచి దొడ్డిలోనికి వెళ్లితినా కాకి ముక్కుతో నాతలమీఁదఁ గొట్టిన దన్నమాటే! భోజనము చేసి చేయి కడుగుకొనుచో నానెత్తి మీఁద నాకాకి రెట్ట వేయుటయు ముక్కుతో పొడుచుటయు జరిగెడివి. కొన్నిసమయములలో తలమీఁది యారోఁతకు మరల

స్నానము చేయవలయుచుండును. ఈకాకిపగ నన్నుఁ బదిపంద్రెండేండ్లు బాధించినది. ఎఱిఁగి నే నేమియు నాకాకికి అపకృతి చేయ లేదు. దానిగూటికిని గూడ నెట్టికీడును జరుగ లేదు. కాని దానిపగ మాత్రము నాపై ప్రబలముగా బహువత్సరములు సాగినది. మద్రాసు వచ్చినతర్వాత నెల నెలకు నే నింటికిఁ బోవుటయుఁ దప్పెను. ఆచింత చెట్టు నెండిపోయెను. వత్సరమునకో వత్సరములకో నే నింటికి వెళ్లుచుండినను నా కాకాక్షిబాధ మఱి కలుగక పోయెను. ఆకాకికూడ వేఱుచోటికిఁ జేరెనో! ఏమయ్యెనో! ఈకథ నెందు కిక్కడ వ్రాసితి ననఁగా నిది నాకుఁ జాల వివేకము గఱపి బహుసమయములలో భావవీథిలో విహరించుచుండినయథార్థగాథ!

ఇటీవల బసవపురాణాదిగ్రంథముల ముద్రణసందర్భములందు నాపై తీవ్రముగాఁ గోపము ప్రకటించి యిప్పటికిఁ బ్రకటించుచున్నవారియెడ నేను వర్తింపవలసినతీరును కాకిపగ నాకు పాఠము చెప్పినది. ఎంత తీవ్రముగా విరోధించినవారిపయి నయినను బ్రతివిరోధము పాటింపక, యంతరంగమున నాత్మీయతనే పాటించుచు ననురాగమునే సాగించుచుఁ దెలియఁ జెప్పఁదగినదానిని (కొందఱే అట్లు చెప్పఁదగినవా రగుదురు) సమ్ముఖములో సుదృఢముగానే తెలియఁజెప్పుచు నుండు వో నావిద్వేషుల విద్వేషము, వారికిఁ దెలియకుండనే యంతరంగ

మునఁ జొచ్చి నెలకొనుచున్న యీయనురాగముచే రేపఁబడి మఱింత రేగి ప్రతిఘటనము లేమిచే నిర్వీర్య మయి కాల క్రమమున నీరసించి యాఱిపోగలదు. ఇందు కనేకానుభవ ములు నా కిటీవలివి కలవు. ఇట్లు ప్రవర్తింపఁ గల్గుటకు నాలో గురుదేవుల యనుగ్రహమును, శ్రీగాంధిగారి దివ్యచారిత్ర మును 'అంతర్బహిశ్చ' నాకు జాగ్రత్తను గొల్పినవి.

---

# ౭

## శాస్త్రము - అనుభూతి

శ్రీసోమనాథశాస్త్రులుగారి తపస్వితపై నాకు మహా భక్తి! కాని వారి ననువర్తింపవలె నని కాని, అనువర్తించి నచోఁ గడతేరఁగల్గుదు నని కాని నాకు తోఁచలేదు. యోగ సూత్రములను పాఠము చెప్పునపుడు వారు తాము యోగ సిద్ధికై కొంత పాటుపడితి మనియు, దానివల్ల ఆరోగ్యము చెడిన దనియు, ఆపద్ధతుల ననుభూతికిఁ దెచ్చుకొనఁజాల మయితి మనియుఁ జెప్పిరి. వారికే సాధ్యము కానిచో మమ్ము దీనిఁ జదివించు టేల యని నాకుఁ దోఁచెను. కాని కోపింతు రని వారి నడుగనయితిని. మఱొకనాఁడు నాప్రశ్నమును వారే వేసికొని "మీలో నెవరయిన వీనిని సాధింపఁగల రేమో యత్నించి చూడండి. సరియయినగురువు దొరకు నేమో చూడండి. నా కనుభూతి కలుగనంతమాత్రాన శాస్త్ర మప్రమాణ మనుకోకండి. మీరుగా సాహసించకండి" అనిరి. ఆ మాట నాలోఁ జొచ్చుకొని పోయినది. వారు మంత్రయోగ మయులు. అనుష్ఠానమున గాఢతత్పరతయే కాని వారికి దాని ఫలిత మేమి అన్న యోచనమే యుండెడిది కాదు. చేయ వలసినది గనుక చేయుచుండుటయే. ఇటీవల వారి తపఃప్రయత్నమునుగూర్చి యోచించుటలో నేతదర్థక మగునుపనిషద్వాక్యము సమాధాయకముగాఁ దోఁచినది.

నేను నాయిర్వది యెనిమిదవ వత్సరమున భృక్తి రహితతారక రాజయోగమునఁ జేరి యబ్బురపుటనుభూతులను బడయుచుండఁగా వారు సజీవులుగా తపోమయులుగా విరాజిల్లుచునే యుండిరి. తఱచుగా నేను స్వగ్రామమునకు వెళ్ళినపుడు చల్లపల్లి వెళ్ళియు, వారు వారియల్లుఁగూతుళ్లు వర్ధిల్లుచున్న మాస్వగ్రామ మగు పెదకళ్లేపల్లికి విచ్చేసినపుడు సందర్శించియు నావిషయముల వారికి నెఱింగించుచునే యుంటిని. వా రెంతో కుతూహలముతోఁ దాము గూడ నాతో నొకతూరి కుంభకోణము వచ్చి శ్రీవారిని దర్శించి సంభాషించి యేమేమో పడయవలయు నని యుత్సాహపడుచు వచ్చిరి. వారి కీయోగసంపర్కము కలుగఁ జేయవలె నని కోరిక నాకును నుండెడిది. కాని యదియు జరుగలేదు.

వారు భౌతికశరీరము విడిచినపిదప నాముప్పది యెనిమిదవయేట నొకనాఁడు నాధ్యానసమయమున శ్రీవారును, మానాయనగారును, మామామగారును, నాతోపాటు ధ్యానానుభూతిలో నుండుట కొన్నినిమిషములపాటు గోచరించెను. ఈ మువ్వురకు నిట్టి యనుభూతి కలుగుఁ గాక ని బహువారములు నాప్రార్థనమునఁ గోరుకొనుచుండెడివాఁడను. కాన యీయనుభూతి నాకు ముదము గొల్పినది.

---

౮

# వెంకటశాస్త్రిగారికడ విద్యావ్యాసంగము

శ్రీ సోమనాథ శాస్త్రులుగారిని వీడుట సమ్మతము గాకున్నను శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు క్రొత్తగా బందరు హైస్కూలులో నాంధ్రోపాధ్యాయులుగా విచ్చేసి యుండుట చేతను, వారిమహత్త్వము చుట్టుపట్టులయూళ్లవా రందఱు చాలవిడ్డూరముగాఁ జెప్పుకొనుచుండుటచేతను, శ్రీ సోమనాథ శాస్త్రులుగారి దగ్గఱ సహాధ్యాయులముగా చదువుచున్న వారము ముగ్గురము అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి, పిసిపాటి వెంకటరామశాస్త్రి, నేను బందరులో శ్రీవారి సన్నిధిని జదువుకొన నుత్సాహపడితిమి. తొలి యిద్దఱు ముందు బందరు చేరి సందర్భములు చూచుకొని నన్ను రమ్మందు మని వెడలిరి. వారి ప్రోత్సాహమున కొలఁదినాళ్లకు నేనును బందరు చేరితిని. అప్పటికి నా వయస్సు పదునాఱేం డ్లయి యుండును.

తెలుఁగున నా కేమేని యెఱుక యేర్పడె నన్నచో నది శ్రీ వెంకటశాస్త్రిగారి గురుతానుగ్రహప్రాప్తమే. వారి దగ్గఱ పుస్తకము పట్టి చదివినదానికంటె వారి ముఖతః వినోదగోష్ఠిలో విని నేర్చినది చాలా. ఆధ్యాత్మిక విషయమున బందరు వాసమునఁ గాని శ్రీ శాస్త్రిగారి సన్నిధిని గాని నాకు కలిగిన యుద్బోధ మేమియు లే దనియే యనవలెను. అంతే కాదు. శ్రీశాస్త్రిగారి సన్నిధిని అవధానధారణలు,

పద్యరచనలు, ఉపన్యాస వినోదములు, కవితాకల్పనములు, వాదప్రతివాదములు, అహంతలు, మమతలు బలసి అధ్యాత్మ చింత యంతర్ధాన మందిన దనవలెను. శ్రీ శాస్త్రిగారు మాయమర్మము నెఱుఁగని స్వచ్ఛహృదయులు. బందరు రాక పూర్వము వారి తీరు 'దేశాటనం పండితమిత్రతా చ' అన్న శ్లోకము చొప్పున చాతుర్యమూలములు గలదై వర్తిల్లినది. అప్పటి దేశాటన పండితమిత్రతా రాజసభా ప్రవేశాదులు వారు చెప్పను వచ్చును. మేము వినను వచ్చును. కాని పండిత మిత్రతకుఁ దర్వాతిదియు, రాజసభాప్రవేశమునకుఁ బూర్వపు దియు నగు చాతుర్యమూలము వారు చాటు చేయక సవిస్త రముగాఁ జెప్పుచుండెడివారు. నేను సిగ్గునఁ జిదికిపోవుచుండెడి వాఁడను.

ఆ కాలముననే మా యన్నగారికి వివాహము జరిగి నది. ఆ వివాహము జరపినవారు, నా పెదతండ్రిగారి బావ మఱఁది, సంగీత సాహిత్య విద్యారసికులు, దివిసీమలోని చోడవర గ్రామమున నెలకొన్నవారు, శ్రీ లంక నాగేశ్వర శాస్త్రిగారు. వారికి నామీఁద చాల వాత్సల్యము. ఆయన విధురులు. సంతతి లేదు. విద్యావినోదులే కాక వేశ్యావినో దులును. మా యన్నగారి వివాహము తర్వాతఁ గొన్నాళ్ల కొక పుత్రస్వీకారము కూడ వారు చేసికొనిరి. ఆ కుఱ్ఱవాని కుపనయనము చేసిరి. ఆ వివాహమునకు నుపనయనమునకును గొప్పగా భోగపుమేళములు ప్రాతస్సాయంకాలములందు, రాత్రులందుఁ గూడ జరుగసాగినవి. వానినిఁ జూచుట కుద్యో

గులు పలువురు వచ్చుట జరగెను. ఉపనయనము జరగిన తర్వాత కొన్నాళ్లు నన్నక్కడ నిర్బంధించి వారు నిలుపు కొనిరి. సంస్కృత నాటక కథలు, కాదంబరీ కథ నన్ను మా మేనమామగారు వేశ్యాపరివారితు లయి చెప్పగోరుచుండిరి. నేనును చెప్పుచుంటిని. ఎన్నాళ్లక్క డుండుట? పదినా ళ్లయిన తర్వాత ఆ యూరనుండి మా యూరికి వచ్చి వేసితిని.

ఆ వేశ్యల శృంగారములు, ఆటపాటలు, నేను కథలు చెప్పుచున్నప్పుడు వారు నెఱపిన సౌహార్దము, వారిహాస్యగాడు, బ్రాహ్మణవృద్ధుడు, సంగీత సాహిత్య రసికుడు నన్ను మెచ్చు చుండుట, మా మేనమామగారు నన్ను ప్రతివత్సరము వేసగి సెలవులలో - శ్రీ వెంకటశాస్త్రిగారు బందరు విడిచి వెళ్లు దురు గాన-తమ యూరికి వచ్చి యుండు మని కోరుట నన్ను ముగ్ధుని జేసి వైచినవి. మా యూరు విడిచి బందరు కేగి వారపుమెదుకులు తినుచు చదువుకొనుట వెగటు గొల్ప సాగినది. ఇల్లు విడిచి పదునాఱుమైళ్లు బందరు నడచి వెళ్లుట యెప్పుడును పరిపాటియే యైనను నా కప్పు డది చాల బాధ గొల్పినది. ఒకటి రెండు ఫర్లాంగులు వెళ్లులేటే నాకు చాల కష్ట మయ్యెను. అక్కడ నొక బురదకాల్వ దాటవలెను. వెనుకకు తిరిగి పోవుదునా యని తోచెను. బట్టలు సర్దు కొనుచు కొంచెముసేపు కూర్చుండి యోచించితిని. ఎన్నో చీకాకులు రేగినవి. శ్రీ వీరేశలింగము పంతులుగారి ప్రహ సనములు, ఉపన్యాసములు నంతకు ముందు చదివి యుంటిని. వేశ్యలగూర్చి వారు వ్రాసిన వెల్ల తలఁపునఁ బాఱినవి. ఇక

నెట్టి గోష్ఠుల కెన్నఁడు గాని పోరాదని శపథము చేసికొంటిని. క్రీ. 1904 ప్రాంతముల మాట యిది. అటు తర్వాత నే నెన్నఁడును వేశ్యాభినయ దర్శనమునకుఁ బోయి న టెఱుక లేదు.

బందరులో చదువుకొనుచుండుకాలమున నేను శ్రీ కొండ వెంకటప్పయ్యపంతులుగారి యింటను, శ్రీ వల్లూరి సూర్యనారాయణరావుగారి యింటను వసించుచుండువాఁడను. వారి కప్పుడు నాపైఁ జాల వాత్సల్యము. శ్రీ సూర్యనారాయణ రావుగారు వారి జీవితావసానము దాఁక నాయోగక్షేమములు కనుగొనుచుండువారు. వారి ప్రేరణముననే నేను మద్రాసు చేరితిని. అప్పటికి నాకు పదునెనిమిదవ యేఁడు. వారు శ్రీ రెంటాల సుబ్బారావుగారికి నన్నుగూర్చి జాబు వ్రాసిరి.

౯

## ధూమకేతు దర్శనము

మద్రాసులో మా బావగారు శ్రీ రామేశంగారి దగ్గఱ గుమాస్తా శ్రీ కాజా వెంకటశేషయ్యగారుండిరి. వారియండతో నేను మద్రాసులో నెలకొంటిని. మద్రాసు చేరగానే నాకు పండిత గోపాలాచార్యులుగారు, శ్రీ పురాణం నాగభూషణము గారు మిత్రు లయిరి. గోపాలాచార్యులుగారి ద్వారా నాకు శ్రీ పసప్పాకం అనంతాచార్యులుగారితోను. వారి కుమారు లగు శ్రీనివాసాచార్యులుగారితోను మైత్రి యేర్పడెను. మద్రాసు చేరగానే వెస్లి మిషన్ హైస్కూలులో తెలుఁగు పండితుఁడనుగా నేను గుదుర్కొంటిని. రెండేండ్లక్కడ నుంటిని. ఆ నాళ్లలో తఱచుగా ప్రాచ్యలిఖిత పుస్తకశాల కరుగుచు నక్కడి గ్రంథములు చదువుచు నుంటిని.

శ్రీ వేపా రామేశముగారితో నేను దఱచుగా విద్యావినోద మనుభవించుచుండువాఁడను. రామేశంగారు విద్యారాశి. గణిత ఖగోళ చరిత్రాది శాస్త్రములందు నిష్ణాతులు. వారికడ ఖగోళశాస్త్ర రహస్యము లెన్నో తెలిసికొనుచుండెడివాఁడను. వారికొక టెలస్కోపు కలదు. వారి ధర్మపత్ని యంతర్వత్నిగా నుండి పురుటికై పుట్టినింటికి వెళ్లుచుండు సందర్భములలో నెలల తరబడి రాత్రులందు వారితో చాలసేపు నక్షత్ర గ్రహ మండలములను బరిశీలించుచుండువాఁడను. ఎన్నో ఖగోళ శాస్త్ర రహస్యములు వారెఱుఁగఁ జెప్పుచుండువారు. నేర్చు

కొనుచుండెడివాఁడను. ఎపిగ్రాఫియా ఇండికా, ఇండియన్ ఆంటిక్వరీ, ఎపిగ్రాఫికల్ రిపోర్టులు మొదలగు చరిత్రాధార గ్రంథము లెల్ల వారి దగ్గఱఁ గలవు. వాని నెల్లఁ జదువఁ దెచ్చుకొని చదువుచుండువాఁడను.

1910 వ సంవత్సరము. హాలిన్ కామెట్టు వచ్చి నప్పుడు - ఇంకా కొన్నాళ్లకది స్థూలదృష్టికి గోచరించు ననఁగా టెలస్కోపుతోను, బైన్యాక్యులర్ తోను తెల్ల వారుజామున లేచి ఆకాశభాగమును మేమిర్వురమును బరిశీలించుచుండువారము. ఆ ధూమకేతువు తొలుత అరుణోదయ మగుచుండగా తూర్పుదిక్కున గోచరించెను. అది యుదయించునంతలో ఉదయారుణకాంతులు క్రమ్ముకొనఁగా కానరాక పోయెడిది. ఒకనాఁడు బైనాక్యులర్ చేత నుంచుకొని మేడ దిగి రోడ్డుమీఁదికి పోయి పరిశీలింపఁగా నాకది వెల్తురుచీపురుకట్టవలె గోచరించెను. పర్వెత్తుకొని (అంతలో అరుణద్యుతులు క్రమ్ముకొనునని) రామేశంగారికి చూప వచ్చితిని. ఆ ఆత్రపాటులో మేడమెట్లు కొట్టుకొని మోఁకాలిమీఁద చర్మము చిట్లి నెత్తురు కారుచుండెను. అది చూడక నేను కేతువు కనబడె నని స్పష్టముగా గోచరించుటకు టెలస్కోపును సరిద్రిప్పుచుంటిని. నెత్తురు చూచి ఇదే మని రామేశంగా రడిగిరి. అప్పుడు దెబ్బ గుర్తించితిని. అంత లోనే టెలస్కోపులో స్పష్టముగా కేతువును గుర్తించితిని. రామేశంగారు నాయుద్వేగమును, రక్తస్రావబాధను గూడ గుర్తింపమిని జూచి నివ్వెఱ చెందిరి. నివ్వెఱ కొంత ఉడిగి

టెలస్కోపులో కేతువును గుర్తుపట్టుచుండగా వెలుఁగురేకలు చెలరేగి కానరానియ వయ్యెను. మర్నాటి తెల్లవారు జామున నిర్వ్యరము లేచితిమి. జాగ్రత్తగా గుర్తించి నిన్నటి యాకాసపు పట్టు చూపఁగా రామేశముగారు స్పష్టముగా చూచి యప్పుడే దాని గూర్చి హిందూ పత్రికకు వ్రాసిరి. మర్నాడు వారికి కొన్ని పల్లిగ్రామములు దాని మొలుకకై వచ్చినవి. అటుపై నాల్గయిదు రోజులకుఁ గాబోలు నది యందఱ మొలుకకు నందినది.

ఆ ధూమకేతువును దక్షిణహిందూదేశమున ప్రజాసామాన్యమున తొలుత గుర్తించినవాఁడను నే నగుటలో మహత్తర మయినవిశేష మేదో ఉండ బోలు నని నే నిటీవల విశ్వసించుచున్నాను. అందుకే దీని గూర్చి యించుకంత హెచ్చుగా వ్రాసితిని. తత్ప్రయోజన మేదో ముందు తెలియఁగలదు.

---

# ౧౦

## బ్రహ్మచర్యము - గార్హస్థ్యము

రెండేండ్లు కెలెట్ హైస్కూలులో నేను తెల్గు పండితుఁడనుగా నుండఁగా నాకు వివాహనిర్ణయము జరిగి మా తలిదండ్రులు నన్నింటికి రమ్మనఁగా నే నింటికి వెళ్లుచు బందరులో శ్రీ వల్లూరి సూర్యనారాయణ రావుగారింట దిగితిని. అవి హైస్కూలు వేసవి సెలవురోజులు. సూర్యనారాయణరావుగారు మద్రాసు చేరునపుడు నన్ను దఱచుగా ఇంటికి వచ్చుచుండవల దనియు, మద్రాసులో ఓరియంటల్ లైబ్రరీలో గ్రంథములను విశ్రాంతి సమయము లలో చదువుచు, వైదుష్యమును వృద్ధిపఱచుకొనుచు నుండ వలసిన దనియు, ఇప్పుడే వివాహము చేసికొని సంసారపు బాదరబందీలో పడవల దనియు, యూరపులో అనేకులు ఆజీవితము అవివాహితులుగానే ఉండి గొప్ప విజ్ఞానము గడించి, ధనము గడించి, ఆ ధనమును సంఘోపకారమునకై సమర్పింతు రనియు, కొందఱేని లోకసేవకై యవివాహితు లుగా నెలకొను టావశ్యక మనియు నాకు హెచ్చరికగా జెప్పుచుండుట కలదు.

అప్పుడు నా రాక వారి కతృప్తి గొల్పెను. చల్లని నూతి నీట నిర్వురము హాయిగా స్నానము చేసి భోజనమునకుఁ గూర్చుంటిమి. చెమటలు దిగజారు చున్నవి. సూర్యనారాయణరావుగారి ధర్మపత్ని శ్రీ పార్వ

తమ్మగారు విసనకఱ్ఱతో విసరుచు చెమటరోఁత దొలగించుచు హాయిగూర్చుచుండిరి. భోజనసమయమున మరల వారు నాకథ నుపక్రమించిరి. 'ఇంటికి రాకుండ మద్రాసులోనే ఉండు మంటిని గదా ! నీ విప్పు డేల రావలెను? పెండ్లి ప్రయత్న మేమేని సాగెనా ? పలుతూరులు నిన్ను పెండ్లాడ నాత్రపడ వలదంటిని కదా ? యూరపులో ననేకులు ప్రౌఢవయస్సు వచ్చి, విద్యాధనార్జనము చేసి యటుపైఁ బెండ్లాడుట, కొందఱు పెండ్లాడకే తమ విద్యాధనములను లోకసేవకై వినియోగించుట జరగుచుండు నంటిని గదా! బీదఱికముతో నలగులపడుచు నొకపడుచును బెండ్లాడి యామెను గూడ దారిద్ర్యక్షోభమున పాల్పఱచుట కా పెండ్లాడుట ? విద్యా విశేషములను, ధనమును గడించి తలిదండ్రులను సుఖపఱిచి చాలినంత ధనము సేకరింప గల్గినచో, సౌకర్య మున్నచో నటుతర్వాత పెండ్లాడిన నాడదగును గాని యిప్పు డేమి పెండ్లి ? విద్యావివేకములు లేనియాడుపడుచులను బెండ్లాడి యేడాదికి, రెండేండ్లకు బిడ్డలు పుట్టుచుండుట, ఈదురో దేవుడా అనుచున్నట్లు చాలినంతగా గృహాది సౌకర్యము, శిశు పోషణ సౌకర్యము లేక పోగా చాలీచాలని జీవితా యతితో నిరుత్సాహనిహతములై బాధపడుచున్న కుటుంబ ముల నెన్నింటిని జూచుట లేదు ? అందులో నీవును జేరి దిగ నాసిల్ల నభిలషింతువా ? అని ఇంక నిత్యాదివిధముల తీవ్ర భాషతో వారు నన్ను మందలింపసాగిరి. నేను దల వాల్చు కొని తినుచున్న యన్నపు ముద్ద మ్రింగుడు పడక మాటాడ

నేరక సిగ్గుతో చిదికి వదవదలాడుచుంటిని. శ్రీ పార్వతమ్మగా రందుకొనిరి. 'ఇటు వినండీ! యూరపు దేశమువారి బ్రహ్మచర్యము మాట యెత్తకండి. ఆ బ్రహ్మచర్యము మనవారి కెందుకు గాని, వీరిని బాగుగా ధనార్జనము చేసిన తర్వాత, ప్రౌఢవయస్సు వచ్చిన తర్వాత పెండ్లాడు మనుచుంటిరే! మన దేశపు సర్వైశ్వర్యమును జుఱ్ఱుకొనుచున్నారు గనుక యూరపువారు ఏ విద్యచేత నైన నెంత ధనము నైన నార్జింపఁ గల్గుచున్నారు. కట్టుబట్ట, కుట్టుసూది కూడ వారే తయారు చేయుచు మన దేశమువారి కమ్ముచు ధనప్రవాహము తమ దేశముమీఁద పాఱుచుండఁబట్టి లోకోపకృతి చేయగల్గుచున్నారు. నిజమే! అంత ధన మార్జించుటకు మన దేశమువారికి సౌకర్యము లేవీ? ప్రౌఢవయస్సు వచ్చిన తర్వాత పెండ్లాడుట యూరపువారికి చెల్లవచ్చును గాని మన వారికి చెల్లనేరదు. ఆ దేశమున యేఁబది యఱువది యేండ్ల వరుని బ్రహ్మచర్యమును, ముప్పది నలువది యేండ్ల వధువు కన్యాత్వమును మనకు విశ్వసింపరానివి. చల్లని యూరపు దేశములో నవి చెల్లు నేమో నే నెఱుఁగను. మన దేశము వారి కావయస్సు యించుమించుగా వార్ధక కాలము. ధనార్జనము చేయునే కాక! అప్పుడు వివాహ మాడుట మన దేశమువారికి గతజలసేతుబంధనమే!

మొన్న వింటిరి గదా! యధికవిద్యావతిని బెండ్లాడు భర్తల గోడును! హైద్రాబాదులో నొక గొప్ప డాక్టరు విద్యావతిని బెండ్లాడి యామె తఱచుగా యూరపు మొదలగు

ఖండాంతరములకు వెళ్లి వచ్చుచు నెలలు, వత్సరములు దేశాంతరములం దుండుటయు, తన యార్జన మెల్ల నామె యాత్రావ్యయములకై పంపవలసి వచ్చుచుండుటయు, తన బంగళాలో గోడలు బూజుపట్టి చిత్రరచన లెన్నో సంస్కారము లేక తార్మారై చెడుచుండుటయు, దనకు గార్హస్థ్య సౌఖ్యము దుర్లభముగా నుండుటయు నొక మిత్రునితో జెప్పి వాపోవఁగా నా మిత్రుడు మీతో చెప్పట నీ నడుమ మీరు వినియుంటిరి గదా! ఏ యెండ కా గొడు గన్నట్టుండ వలెనే కాని తనకు మించిన. విద్యావతిని బెండ్లాడుటలో చిక్కులే కాని సేమ ముండుట యసాధారణము.

చూడండి! ఆరంభముననే తనకు దగినపడుచును బెండ్లాడి రోడ్డు రిపేరు చేయుచున్న యుప్పరివాడు పగలెల్ల మట్టిపనిచేయు చున్నాడు. సంజకడ ఉడుకునీరు కాచి, యిల్లాలు వీఁపు దోమి స్నానము చేయించగా భర్త సుఖస్నాతుఁడై భార్యతో గంజి యన్నము, ఉప్పు పచ్చిమిరపకాయ నంజుకొనుచు కడుపార నారగించి, తమకు గలిగినచిన్నబిడ్డ నక్కడి చెట్టుకొమ్మకు వ్రేల గట్టినచీరయుయ్యెలలో నూగించి, చల్లగాలిలో నాబిడ్డ సుఖనిద్ర పడయుగాఁ జెట్టుక్రింద సుఖశయితు లగుట చూచు చుంటిమి గదా! వారిదాంపత్యమున హృద్యత గోచరించుట లేదా?

ఏకైకవ్యక్తిగా మీరు మిగిలినమీకుటుంబమున నన్నుఁ బెండ్లాడుటచే వంశవృద్ధి గలిగి మీరు సుఖించుచుండుట గుర్తు నకు వచ్చుట లేదా? నే నుండుటచే గదా మీ కిట్టి సుఖభోజ

నము దొరకుట? వంటవానిని గుదుర్చుకొని వానివంటతో భోజనము జరుపుకొనుటలోని యిక్కట్టులను గుర్తించుచునే యుంటిమి గదా? మీకు ఆరోగ్యకరములు, ప్రియములు నయినకూరగాయలను నేను దెప్పించి మీకు ప్రియ మయిన తీరున వంట చేయించుచుండుటచేతఁ గాదా మీయారోగ్యము సరిగా నుండుట, ప్రియముగా భోజనము సాగుట. ఇంటికి వచ్చినమీకు కోర్టులోని పరిశ్రమవుఁ బరిహారము మావినోదముతో జరగుట యగుచున్నది గదా! ఇంతేల? ఈ యెండ యున్మాదములో చెమటలు దిగజారుచుండఁగా నే నుండి విసనకఱ్ఱతో విసరుచుండుటచేఁ గాదా శ్రమ మెఱుఁగకుండ మీరు హాయిగా నారగింపఁగల్గుట? నేఁటి యీవంటకములు వంటాతఁడే చేసినను నేను దగ్గఱ నుండి మీకు ప్రియ మయిన కూరలు తెప్పించి తఱిగి యిచ్చి మీకు నచ్చినవిధానమున మీ కెంత కావలెనో అంతగా ఉప్పుకారములు వేయించి వండించుట చేతఁ గాదా నవి యాస్వాద్యములుగా మీ కుండుట!

మనశాస్త్రులుగా రిక్కడ నున్నప్పుడు గొంత కొంత సంస్కృతాంధ్రముల పరిచితి హెచ్చి తఱచుగా భారతాదులు చదువుచుండుటచే నందలిపద్యము లివి నానోటికి వచ్చి యున్నవి. చిత్తగించండి!

అధికదుఃఖరోగార్తున కాపథంబు
సురుచిరంబుగ భార్యయ చూపె యెందు
నొనర భార్యాసమేతుఁడై యున్నవాని
కెంత లయ్యును నాపద లెఱుకపడవు,

అలసినెడ డస్సినెడ నా
కలి దృష్ణయు నైనయెడలఁ గడుఁగొని ధరణీ
తలనాథ! పురుషునకు ని
మ్ముల భార్యయ పాచుఁ జిత్తమునదుఃఖంబుల్.

[నన్నయ నలోపాఖ్యానము.]

పార్వతమ్మగా రింత పలుకగా, నాకు ముద్ద మ్రింగుడుపడ సాగగా సూర్యనారాయణరావుగారు నిరుత్తరు లయిరి. నన్నుఁ జూచి 'శీఘ్రముగా నింటికి బోయి వివాహ మాడుదువులే! నీవాలకము చూడఁగా పెండ్లిప్రయత్నముననే యింటికి వెళ్లుటగా నున్నట్టున్నది. శుభమస్తు' అనిరి.

## ౧౧

## వివాహము

ఇరువదిరెండవయేట నాకు పెండ్లి జరగినది. మాయూరికి కాలుమైళ్ళదూరమున నున్నగంటసాల నాయత్తవారియూరు. ఆయూరే నామేనమామగారి యూరును. తొంబదియేండ్లకు పై పడినవయస్సువారు, మామేనమామగారు శ్రీ పిసిపాటి వేంకట్రాదిగా రిప్పటికి నారోగ్యముతో నున్నారు. వారికి నేడ్గురుపుత్రులే కలిగిరి కాని పుత్రికాసంతానము లేదయ్యెను. మాతోడిసంబంధము తర్వాత లేకపోవు నన్నకొఱంతతో వారి జ్ఞాతు లగుమామామామగారిని నాకు పిల్ల నిమ్మని వారు కోరిరి. వారికుమారుఁ, డప్పటికి రెండేండ్లకుముందు స్వర్గస్థుఁ డయిన వాఁడు, శ్రీసోమనాథశాస్త్రులుగారికడను, శ్రీవెంకటశాస్త్రిగారి కడను నాతో సహాధ్యాయుఁడుగా నున్నవాఁడు, వెంకటరామ శాస్త్రి జీవించియున్నప్పుడు వారిమీఁది యాదరము వెల్లడించు చుండుటచేతను, మామేనమామగారి కోరికచేతను, భూవసతి లేదన్నకొఱంతను దలఁచి సందేహించుచున్నను మాసంబంధ మున కెట్టకేలకు మామామామగా రంగీకరించిరి. వారు ప్రశాంత చిత్తులు. సద్వర్తనులు. అమాయకులు. మాతండ్రిగారివలెనే కడిపెడుబిడ్డలు గలవారు.

వివాహ మయినది. మామాతృశ్రీ గారి మీఁది భక్తిచేతను, వారి పుట్టినయూ రని, వారియింటి పేరివా రని నే నెంతో తనివితో నీసంబంధమును ప్రేమించి

తిని. వివాహ మయినతోడ్తో మద్రాసు వచ్చి వేసితిని. అప్పుడు నానివాసము మైలాపూరులో. తిరువల్లిక్కేణి హైస్కూలుకు ప్రతిదినము రాకపోకలు. తొమ్మిదిగంటలకు హోటలులో భోజనము చేసి తిర్వలిక్కేణికి నడచి వెళ్లి సాయంకాలము తిరిగి నడచి వచ్చి రాత్రి భోజనము చేయుట. దీనిచే నాహారము చాలక కాంబోలును నీరసముగానే ఉండెడివాడను. నీరసమే తప్ప వ్యాధి యేదియును లేదు. అప్పుడప్పుడు కృష్ణామండలమందలి స్వగ్రామమునకు వెళ్ళి అక్కడ కమ్మని నెయ్యి పెరుగులతోడి భోజనము చేసినప్పుడు శరీరమునకు మంచి బలోత్సాహములు లభించుచుండెడివి! సంవత్సరమున కొకతూరి తప్పకుండ నింటికి వెళ్లుచు నట్టిబలోత్సాహముల నార్జించుకొని వచ్చి వానిని మద్రాసులో వ్యయించుచుండినట్లు తోచుచుండెడిది. ఈప్రయోజనమునకై వివాహానంతరము వేసంగిలో నే నింటికి వెళ్లితిని.

---

# ౧౨

## బండిపాటు

మాయూరి కాఱుమైళ్ళ దూరమున అవనిగడ్డ యని గ్రామము గలదు. అది తాలూకా ప్రధాన స్థానము. మాయన్నగా రక్కడ పోస్టుమాస్టరు. వారి కుటుంబమును జూచుటకై నే నాయూరికి వెళ్ళి తిరిగి వచ్చుచుంటిని. మాయూరివారే, మహనీయులు, గొప్ప వేదవేదాంగవేత్తలు, నాపై నమితవాత్సల్యము గలవారు, వృద్ధులు యడవల్లి అప్పావధానులుగారు కడు వృద్ధ యయిన వారియత్తగారితో బండిమీఁద అవనిగడ్డనుండియే మాయూరికి విచ్చేయుచు నన్నుఁ గూడ బండిలోఁ గూర్చుండ నిర్బంధించిరి. నేనేవో మద్రాసుపుస్తకశాలలోని గ్రంథములఁగూర్చి ముచ్చటించుచు వారిని వినోదపఱచుచుంటిని. బండి యొకటిన్నర మైలు సాగి వచ్చెను.

అవనిగడ్డకు మాయూరికి నడుమ కృష్ణానది కలదు. అది వేసగి కనుక పాటిఱేవు గలదే. బండి దానిలో నుండి సాగి పోవచ్చును. కాని గట్టునుండి యేటిలోనికి కొన్నినిలువులలోతు దిగవలెను. బండి యట్లు దిగుచుండెను. బండి తోలుచున్నరైతు (మాయూరివాఁడే) చుట్ట కాల్చుకొనుట కంతకు ముందే బండి దిగెను. గట్టున నుండి పల్లమునకు బండి గాడిలోనుండి వడిగా దిగజాఱునాసమయ

మునకు సరిగా నాతఁడు మూత్రోత్సర్గమునకుఁ బోయి వెనుక
బడెను. బండిచక్ర మొకటి బండిగాడిపల్లపుజాలులో నుండఁగా
మఱొకచక్రము గట్టుమీఁది కెక్కెను. ఉపక్రమమున నా
యెగుడుదిగుడు కొంచెముగానే యుండెను. కాని రెండుమూఁడు
గజములు సాగునప్పటి కొడ్డగెడవుగా నయ్యెను. ఎడ్లు వడిగా
దిగి పోవుచుండెను. బండి కడయంచున నేను గూర్చుంటిని.
ఇఁక నొకక్షణములో నాజీవిత మటో యిటో ఏదో అగు
దశ దాపురించినది సుమా యనుకొనుట నే నెఱుఁగుదును.
ఈయెఱుక బండితుదిపట్టున నుండి యెడ్ల దిగుడు దూఁకుడును,
చక్రముల యొడ్డగెడవును-వెలుపలికి చూడ్కి పాఱుచున్నది
గాన - నేను గుర్తించితిని గాని బండి లోతట్టున గూడులో
నొదిగి యున్నయాయిర్వురు నంతగా గుర్తింప రయిరి. ఇహ
లోకప్రజ్ఞ యీ శరీరమున నుండుటో, ఊడుటో - ఈ
లోకముతో సంబంధము తీరనున్న దేమో అన్నతలఁపు నాలో
కలిగినక్షణమే యెఱుఁగుదును గాని తర్వాత న న్నెఱుఁగను.
నా యునికి నెఱుఁగను.

ఈ స్థితిలో కొన్ని క్షణములో నిమిషము లొకటి
రెండో కడచి యుండఁబోలును! 'చండాలుడా! లక్షరూపా
యల విలువ చేసే మనిషిని చంపి వేస్తివిరా! చండా
లుడా!' అన్న యవధానులుగారి యేడ్పుటఱపుతో ప్రజ్ఞ
గాంచితిని; 'బ్రతికి ఉన్నానండీ బాబూ! యేడ్వకండి' అంటిని.
అప్పావధానులుగారు నాయెదుట నిరపాయముగా నిలిచి
యుండిరి. నా కైహికప్రజ్ఞ కలిగినందుకు, అప్పావధానులు

గారు నిరపాయులుగా నున్నందుకు తనిసి 'సోమిదేవమ్మగా (వారి యత్తగారు) రేమైరండీ' అంటిని. 'బ్రతికున్నావా నాయనా' అనుచు నామె పర్వెత్తి వచ్చెను. 'మా కిద్దఱికీ మొండి ఘటాలకి ఏమీా దెబ్బ తగులలేదు. నాయనా! నీచెయ్యి యిదేమిటి?' అని ఆమె యేడ్వసాగెను. అప్పుడు నేను నా చేతులను జూచుకొంటిని. కాని అందాఁక నేను బాధ నెఱుఁగను. నా దక్షిణబాహుమూలము నా కడుపుమీాఁద వ్రేలాడుచుండెను. ఆ వికృతి చూడఁగా నాకు వాంతి, మైకము, కంపము కలుగఁజొచ్చెను. ఇంకేమేమి యంగవికృతి కలిగెనో, మందేమగునో అన్నకంగారుతో అవధానులుగారి నిట్లు ప్రార్థించితిని. 'నాపూర్వకర్మానుభవ మేదో నే ననుభవించుచున్నాను. నాస్థితి యేమగునో! మా తల్లిదండ్రులకు నెమ్మదిగా నా స్థితి తెలుపండి. ఈ బండివానికి ఏమాత్రము క్లేశము కలుగరాదు. నా ప్రాణ మున్నా, పోయినా వీనిని నన్నుగా భావించి కాపాడండి! కాని నిందాదులు చేయకండి. డప్పి, డప్పి' యనుచు మైమఱుపాటు చెందితిని.

కొంతసేపటికి చల్లని మంచినీరు, మజ్జిగ దగ్గఱి క్రొత్తపేట బ్రాహ్మలు తెచ్చి యీాయఁగా, చన్నీటి గుడ్డతో మొగము తుడిచి, ప్రజ్ఞ రప్పించి యిచ్చిరి. మాయూరి కరణముగారు, మా నాయనగారి బాల్యమిత్రము శ్రీ కొడాలి వెంకయ్యగా రింతలో నక్కడికి బండిమీాఁద వచ్చిరి. న న్నాదరించి తన బండిమీాఁద నెక్కించి నన్ను వెనుకకు అవనిగడ్డకే- ఆస్పత్రి కలదు గాన, మా యన్నగారు కలరు గాన-త్రిప్పి

పంపి నా యొక మిత్రుని తోడిచ్చి, బోల్తా కొట్టిన బండిని లేవ నెత్తి, దానిమీఁద నా బండిలోని వారిని గూడ జేర్చుకొని కళ్లేపల్లికి వెళ్లిరి. బండి నెమ్మదిగా నడచినను జారిపోయి వ్రేలాడుచేతితో వికారగ్రస్తుఁడ నయి యున్నన న్నవనిగడ్డ చేర్చిరి.

నాఁటిరాత్రి - ఆస్పత్రి అసిస్టెంటు ఊర లేఁడు గాన కంపౌండరే ఒక సాహెబు నా చేతిని సరిదిద్దఁ జొచ్చెను. క్లోరో ఫారం ఇయ్యలేదు. చంకక్రింద గుడ్డ మడత బెట్టి దిండుగా నుంచి ఇంకొక తుండుగుడ్డ చంకక్రింద దూర్చి యొకరు తల దగ్గఱనుండి లాగుట, ఇంకొకరు నా చేతిని కాళ్ల దిగువనుండి లాగుట సాగించిరి. జబ్బమజ్జులు చిఱుగుచున్న ట్లయ్యెను. గగ్గోలు పెట్టితిని. అయినను విడువక లాగిరి. డమ్మని ప్రమోఁత ప్రమోఁగెను. చేయి స్వస్థానము చేరె నని చెప్పి కంపౌండరు కట్టు కట్టెను. మర్నాఁడు ఆస్పత్రి అసిస్టెంటు వచ్చెను. నాకు చేయి రుబ్బురోలువలె వాచెను. తీవ్రజ్వరము వచ్చెను. నాల్గయిదు రోజు లుంటిని. వాపు తీసినది గాని చేయి లేవదు. ఆస్పత్రి అసిస్టెంటు ఉద్యోగమునకు, జీవితమునకుఁ గూడ తుది దశలో నున్నవాఁడు (కొలఁది రోజులకే రిటైరగుట, స్వర్గస్థుడగుట జరగెను. అతిమూత్రవ్యాధిగ్రస్తుడు) నన్ను బాధించుట తప్ప సరిదిద్దలేక పోయెను.

ఇంటికి వచ్చి, అక్కడనుండి బందరు వచ్చి శ్రీ వల్లూరి సూర్యనారాయణరావుగారిని తోడఁ బిలుచుకొని ఆస్పత్రికి వెళ్లితిని. సుబ్బయ్యర్ అను సర్జన్ ఉండెను. సూర్య

నారాయణరావుగారి మాట విని వెంటనే క్లోరోఫారం ఇచ్చి చేయి సరిదిద్ది కట్టు కట్టెను. మర్నాడట నుండి ధన తృష్ణతో నన్ను పీడింపసాగెను.

వెంటనే మద్రాసు వచ్చి నాకు పరిచితు లయిన డాక్టరు నంజుండరావుగారికిచూపితిని. వారు 'ఇప్పటికే చేతిసంధి బంధములు చాల శిథిల మయి యున్నవి. డాక్టర్ల కిక చూప వద్దు. ఘృతదధిప్లుతముగా భోజనము చేయుచు జబ్బకు కొబ్బరి నూనె, వెన్న, నేయి వగైరా స్నేహద్రవ్యములు రాచి, చన్నీటి కొళాయిక్రింద ధారగా నీరు పడునట్లు హెచ్చు సేపు కూర్చుంటివేని క్రమక్రమముగా చక్కబడగల' దని చెప్పిరి. అట్లే చేయుచుంటిని. కాని బోర్డుమీఁద సీమసున్న ముతో నేదేని వ్రాయుటకు రెండవచేతి తోడ్పాటుతో గాని చేతి నెత్తి పట్టి యుంచలేక పోవుచుంటిని. మంచినీటి చెంబును కొన్ని గజముల దూరమేని మోసి తేఁ జాలకుంటిని. క్రమక్రమముగా నంజుండరావుగారు చెప్పినట్టు చేయుచుండుటచే కొంత సుగుణము కలుగుటో, అసౌకర్య సహనమున కలవాటు పడుటో యయ్యెను. కాని యది యేలో నానాఁటికి మనసు నిరుత్సాహగ్రస్తము కాఁజొచ్చెను.

స్వజనము నా స్థితికి వగచుచు 'పెండ్లాడిన తర్వాత వీనిస్థితి వికృతి చెందుచున్నది. ఈ వివాహము వీనికి శుభ ప్రదముగా లేదు' అని పరోక్షముగాను, సనసన్నగా ప్రత్యక్షముగాను గూడ మాటాడఁజొచ్చెను. నా కది దుశ్శ్రవ

మయ్యెను. 'ఇది దైవనిర్ణీతము. ఇందు మంచినే గుర్తించ వలెను గాని చెడుగులను వెదకి పట్టుచు మనసును చిదుక కొట్టుకొనరా దని నే నెదురాడితిని. అభము శుభము నెఱుఁగని పదియేండ్ల బాలికనుగూర్చి గర్హణ నాకు చీకాకు గొల్పెను. అమాయిక యయిన యా బాలికయెడ నా కమితానురాగ మేర్పడెను. ఆ బాలికవల్ల నేను మేలే పొందఁగల్గుదు నని విశ్వసించితిని. ఇది నా గుండెలలో మాత్రమే తొణకిసలాడుచుండిన తలఁపు.

---

# ౧౩

## శకునపరిగణనము

అజ్ఞాననిహత మై యుండుటచే దేశమంతట నిట్టి యపభ్రంశపు తలఁపులు నిండారి యున్నవి. పెద్దపెద్దలు, కొమ్ములు దిరిగిన విద్వాంసులు, మహోన్నతపదవులం దున్నవారు గూడ నింటనుండి యేదేని పనిమీఁద బయటికి వెడలునపు డెదురుగా నెవ్వరు వచ్చుచున్నారో యని పరిశీలింతురు. కుగ్రామములలో నట్టి పరిశీలనము తగు నేమో, అర్థవంత మగు నేమో కాని వేలకొలఁది ప్రజలు గలనగరములలో నట్టి పరిశీలనము చీకాకు గొల్పును. సమకాలముననే వీథులలో 'పంచశుభం పంచాశుభమ్' అన్నట్లు కలసికట్టుగానో, ముందువెనుకలుగానో సభర్తృకలు, అభర్తృకలు, ఒంటి బ్రాహ్మణులు, పలువురు బ్రాహ్మణులు తారసిల్లుచునే యుందురు. ఇందు పౌర్వాపర్యములు పర్యాలోచించుచుం దురు. మఱియు ఫలాని వితంతువు, ఫలాని బ్రాహ్మణుఁడు ఎదురుగా వచ్చినప్పుడు కార్యము నిర్వక్రముగా నిర్వహణము చెందు నని వారు విశ్వసించుశకునశాస్త్రమున కపవాదముగా విశ్వసించుట కలదు. వా రట్లు వచ్చినపుడు మంచి జరగుట కేవో కారణములు, యుక్తులు నసందర్భముగా నుపాంశువుగా గణించుట కలదు.

తాము ప్రయాణ మగువేళకు బ్రాహ్మణుఁ డేని, ఆతఁడు, కుమారుఁడో, అన్నో, తమ్ముఁడో

అయినను నెదురుగా వచ్చినచో వ్యంగ్యముగా మొగము చిట్లించుకొని గర్హించుటో, వాచ్యముగానే తెగ డుటో జరగుచుండును. తన యింటిలోని వారే అయినను, పరాయివారే అయినను వితంతువులు వచ్చినచో గర్హించు టయు, ప్రయాణము నిలుపుటయు జరగుచుండును. మఱీవింత-ప్రయాణ మయినవ్యక్తి వితంతువే అయినను గూడ తనకు వితంతు వెదురుగా వచ్చిన గర్హించును. ఈ శకునపరీక్షల వల్ల ప్రయాణముల నాపుకొనువారును, ననివార్యముగా పయన మయినను నిరుత్సాహనిహతిచే సరిగా సాగించు కొనలేక ఎదురు వచ్చిన వారిని గర్హించుటచే వారితోను, వారి కుటుంబముతోను దీర్ఘవైరము తెచ్చుకొనువారును నెందఱో ఉన్నారు. రైలు ప్రయాణములకు శకున ముహూర్త పరిగణ నము చేయుచు అనుకూలశకునముహూర్తాదులకై కొంతసే పాగి పోవుటో, చాల ముందుగానే పయన మగుటో చేయువా రున్నారు.

మన మంచిచెడ్డలకు మనమే ప్రవర్తకుల మనీ, మన సత్కార్యసత్సంకల్పబలముచే మనమంచిని మనమే సాధించుకొనఁ గల్గుదుము గా కనీ లోఁతయిన పట్టుదలతో వర్తించువా రిట్టి చిలిపి చీకాకులకు పాల్పడరు. మంచి శకు నముల కెన్నింటికో దుష్ఫలితములు గలుగుచుండుట, దుశ్శ కునముల కెన్నింటికో సత్ఫలితములు గల్గుట గుర్తించు చున్నను గూడ శాస్త్రము ప్రమాణ మని ప్రామాణ్య నిశ్చయము లేకున్నను దానినే విశ్వసించుచుండవలె నని

దాని కేవో శ్లోకము లుదాహరించుచు సమర్థించుకొను చుండుట యజ్ఞానపుఁ బిరికితన మనవలదా? గర్భవతులు గ్రహణములఁ జూడరా దనుట, ఆదివారమునాఁ డుసిరికపచ్చడి తినరా దనుట, రాత్రులందు లవణము పేరు-ఉప్పు - అన్న తెలుఁగు పేరే - పేర్కొనరా దనుట (లవణము - బుట్టలో నిది - చెప్పరానిది ఇత్యాదివిధములఁ దెలుపవచ్చును.) మొద లయిన విట్టివే.

మన తలఁపులలో, పలుకులలో, పనులలో మంచిచెడుగులు పెనవేసికొని సాగుచున్నవి. చెడుగు లేని యచ్చ మంచి తనము మానవత కింకను నందలేదు. జన్మము లెత్తఁగా నెత్తఁగా సత్త్వము హెచ్చి నీళ్లను దొలఁగించుకొని మేళ్లను పెంపొందించుకొనవలయు నన్నకోర్కి పుటములు పడగా పడగా బంగారుకు వన్నె హెచ్చినట్టు మానవునిలో హెచ్చఁ జొచ్చెను. సద్భావప్రాబల్యము కలిగినప్పుడు ప్రపంచమునాలు గంచుల ప్రజాసంఘము నెల్ల పాలుజూడఁ గల్గినప్పుడు దేశజాతి కులాశ్రయము లయిననిరర్థకాచారములు తొలఁగి పోగలవు.

స్త్రీయు లందఱు నానాఁడు నావివాహమునుగూర్చి వివాహిత యగుకన్యనుగూర్చి యతృప్తి చెందిరి గాని, కొంత నాకు గూడ వెఱపు గల్గుస్థితివలె నేర్పడెను గాని కాలము కొంత గడచినతరువాత నందఱనిశ్చయములును దల్లక్రిందులై పోయినవి. అవి ముందు ముందు తెలియఁగలవు. అట్టి శుభ పరివర్తనము కలుగుటకు వివాహ మయినతర్వాత సంవత్సరము లెనిమిది గడవవలసెను.

## ౧౪

## సాహిత్యజీవనము - అరకుడుపు

నేను మద్రాసు వచ్చినతర్వాత మైలాపూరులో మా బావగారితో కలసియే యుంటిని గాని భోజనాదికము పూట కూటియింట చేయుచుంటిని. ఆనాళ్ళలో మైలాపూరు కపాలీశ్వరుని గుడిదగ్గఱ రంగమ్మ యను పుణ్యాంగన హోటలు పెట్టుకొనియుండెను. ఆమె కొక్కడే కొడుకు. ఆతడు వ్యర్థుడు. ఆయమ్మ భోజనమునకు వచ్చువారికి వారియిండ్లలోకంటె హాయిగా ననుకూలముగా నుండునట్లు వంట చేసి మంచి భోజనము పెట్టెడిది. ఆమె శ్రీ రెంటాల వెంకటసుబ్బారావు గారి దూరపుబంధువు. ఆమెభర్త చాలా శ్రోత్రియుఁడు, పుణ్యాత్ముఁడు నని సుబ్బారావుగారు చెప్పుచుండెడివారు. ఆమెను శ్రీ సుబ్బారావుగారు కొంతకాల మింట నుంచుకొని పోషించి రఁట! కాని వృద్ధురాలు, స్వతంత్రజీవనార్థిని యామె యట నుండ నొల్లక వేర్వాసి వచ్చి హోటలు పెట్టినది. ఆమె పుణ్యస్మరణ మిప్పుడు నాకు ముదము గొల్పుచున్నది. నామీఁద నామెకు కడువాత్సల్యము. ఆహోటలుకు వచ్చెడివా రందఱు నామెను మాతృశ్రీనిగా గారవించుచుండెడివారు. కొందఱు హోటలు పెట్టుట నీచవృత్తి యందురు గాని యే వృత్తి యయినను నిర్వంచనముగా ద్రోహము లేకుండ సాగించుచో నది పుణ్యాపాదకమే కాఁగలదు.

ప్రాచ్యలిఖితపుస్తకశాలకు పదే పదే సందు దొరకినప్పు డెల్ల వెళ్లుచు అక్కడి గ్రంథములు, అముద్రితములు పరిశీలించుచు, లోకల్ రికార్డుల నెల్ల చదువుచు, అపూర్వాంశముల గుర్తించుచు, గుర్తించినవానిని మిత్రుల కుత్తరముల ద్వారా తెలుపుచు తన్మయుఁడనై విద్యావ్యాసంగము చేయుచుంటిని. ప్రాచ్యలిఖితపుస్తకశాలాధ్యక్షు లొకతూరి లైబ్రరీకి విచ్చేసి లైబ్రేరియన్ ద్వారా నావిషయములు తెలిసికొనిరి. తెలుఁగుపుస్తకములకు కేటలాగు వ్రాయుచున్నగుమాస్తా సెలవు పెట్టఁగా తోడ్తో నాస్థానమున నన్ను నియోగించిరి. అదిటెంపొరరీపోస్టు. అందుచే ఆగుమాస్తా తొలఁగెను. అతనిపై ఆఫీసువారి కతృప్తి. ఆతడు తొలఁగినపిదప ఆపోస్టును స్థిరముగావించి యందు నన్ను నియోగించిరి.

ఆనాళ్ళలో పావులూరి మల్లనకవినిగూర్చి నామూలమున చర్చ రేగెను. శ్రీ వీరేశలింగముపంతులుగారు కవుల చరిత్రలో వ్రాసినతీరు సరిగా దని, పావులూరిమల్లన నన్నయనాఁటి మల్లన మనుమఁ డని నేను లైబ్రరీలోని వ్రాఁతపుస్తకములఁ బరిశీలించి పత్రికలద్వారా నిరూపింప యత్నించితిని. అప్పటి మద్రాసు తెలుఁగుపత్రిక శశిలేఖ. వీరేశలింగము పంతులుగారితరపున నిలిచి అనేకులు నాపై చెలరేగిరి. వీరావేశముతో చిలుకూరి వీరభద్రరావుగారు లైబ్రరీపుస్తకములను నేను పసికుంకను జేరి దుర్బుద్ధితో మార్చివేయుచుంటినని, నేను వ్రాసినట్లు వ్రాఁతప్రతులలో లే దని, గవర్నమెంటువారు న న్నక్కడ నుంచరా దని బాహాటముగా వ్యాసములు

వ్రాయసాగిరి. ఇంకెంత రెండటో అటు తిరిగి నన్ను కటువుగా మండలింపసాగిరి. శ్రీ వీరేశలింగముపంతులుగారి పేరుప్రతిష్ఠ లట్టివి గనుక, వారియాంధ్రసాహిత్యసేవ యంత మహనీయ మయినది గనుక వారెల్లరు నట్లుద్రిక్తు లయిరి. ఏవో కొన్ని పొరపాట్లుండిన నుండవచ్చును గాక అని సరిదిద్ద నొల్లక పోయిరి. వారందఱు సత్యమేది యని పరిశీలింపక వ్రాసిన వారే. ఒక్క వీరభద్రరావుగారే సత్యము స్పష్టముగా గుర్తింపఁదగియున్నను, లైబ్రరీపుస్తకములు నేనేమి తార్మాఱు చేయకున్నను స్వార్థాబుద్ధితో సత్యదూరముగా వ్రాఁత సాగించిరి.

ఆనాళ్లలో ప్రాచ్యలిఖితపుస్తకశాలలో మహావీరా చార్యుని గణితసారసంగ్రహమును ప్రొఫెసరు రంగాచార్యులు గారు ముద్రించుచుండిరి. మల్లన గణితము దానికిఁ దెలుఁ గగుట నేను గుర్తించి రంగాచార్యులుగారి కెఱిఁగించితిని. అప్పుడు వీరభద్రరావుగారి వ్రాఁతలను గూడ వారికి దెలిపి తిని. అప్పుడు మావివాదము నెల్ల హైకోర్టుకేసురికార్డులను పరిశీలించునట్లు పరిశీలించుచు శ్రీ వేపా రామేశముగారు నావాదము సత్యమయిన దని, ప్రతివాదము శ్రుతి మించి యసంబద్ధముగా,సత్యదూరముగా నున్నదని గుర్తించి, నానౌక రికి కీడు దేఁజూచుచున్నవారి దురుద్రేకమునకు రోసి శ్రీ బయ్యానరసింహేశ్వరశర్మగారితో నొకనాఁడు ముచ్చటించిరి. రంగాచార్యులుగారు నా కథయము చెప్పిరి. ట్రాన్స్లేటరు

ఆఫీసువారు నామీఁది నిందను దొరతనమువారికి తెలుపు నంతటి స్థితికి వచ్చెను.

ఇంత జరిగినతర్వాత డొక్కచెదరి యుండాఁక నాకు ప్రతికూలముగా నున్నవా రొకరు లైబ్రరీ వ్రాఁతప్రతులపాఠముల నెల్ల శశిలేఖ పత్రికలో ప్రకటించిరి. అవి నాప్రకటించినతీరునే నిరూపించెను. మఱియు కాకినాడలో శార్వర్ల శ్రీనివాసరావుగా రనువారు పావులూరి గణితపు తాలూకు ప్రతుల సంపాదించి యందలిపాఠములను శ్రీ పోలవరం జమీందారుగారు, దురుసేటి శేషగిరిరావుగారు వగైరాల సంతకములతో ప్రకటించిరి. అవి యెల్ల నేఁ జెప్పినట్లే యుండెను. అంతతో నావివాద మడఁగారెను.

ఒకనాఁడు-"నార్తరన్ సర్కార్సు అసోసియేషన్" మీటింగు (యూనివర్సిటీ కాన్వకేషన్ తర్వాత) జరగుచుండఁగా నే నక్కడికి కేగితిని, అచ్చటికి వచ్చియుండిన వీరభద్రరావుగారు నాయెడ వర్తించినతీరునకు పశ్చాత్తాపము వెల్లడించిరి. మిత్రుల మయితిమి. ఆనాఁటిసభలో నాపద్యములు పదింటిదాఁక జదువుటయ్యెను. ఆయేడే శ్రీ శొంఠిరామమూర్తిగారు గొప్పగా పరీక్షలో కడతేరి యింగ్లండునకు వెళ్లు యత్నములో నుండిరి. నాపద్య మొకటి—

ఆంధ్రు లత్యంతదేహబలాఢ్యు లనెడు
కీర్తి హెచ్చెను మనరామమూర్తివలన
ఆంధ్రు లత్యంతబుద్ధిబలాఢ్యు లనెడు
కీర్తి హెచ్చెను మనరామమూర్తివలన.

వీరభద్రరావుగారు నాఁడట్లు పశ్చాత్తాపము వెల్ల
డించిరే కాని కొన్నేళ్ళతర్వాత మరల నాయెడ వికటముగానే
వర్తిల్లసాగిరి. శ్రీనాథునిగూర్చి, ఇంకేవేవో విషయముల
గూర్చి సత్యదూరము లయినవే కాక ధూర్తములు నయిన
రచనముల నాయెడ జరపిరి. వాని కెన్నఁడు గాని వారికి నేను
బదులు వ్రాయఁ దలఁపలేదు. శ్రీ వీరేశలింగముపంతులుగారు
పరమపూజ్యులు, మహనీయులు నయ్యు నహమిక, మమకా
రము నధికముగాఁ గలవా రని తర్వాత తలఁపనయ్యెను.

నిరుపమాన మహామహిమోపేతులు పురుషోత్తములు
గంధిగారు పేర్వెలసినపిదప మానవమర్యాదయే యసాధారణ
యోగ్యత నందుకొనఁగల్గెను. వారి శీలజ్యోతిముం దంతకు
ముందు పేర్వెలసినపెద్దల ప్రకాస్తు లెన్నో వెలవెల లాడ
వలసిన వయ్యెను.

శ్రీ లక్ష్మణరావుగారు వీరేశలింగముపంతులుగారి
నొకనాఁడు ప్రాచ్యలిఖితపుస్తకశాలకు గొనివచ్చి-వా రప్పుడు
కవులచరిత్రను సంస్కరించి ప్రకటింపఁ బూనియున్నారు గాన-
వారి కస్మదాదుల సహాయము లభింపఁజేయుటకై జతనము
సాగించుటలో నన్నెఱుక పఱిచిరి. పావులూరి మల్లన చరిత్ర
విషయములు వీరేశలింగముగారిదగ్గఱ, నాదగ్గఱ చర్చించి
తత్త్వము నిర్ణయింప నభిలషించిరి. అన్నివ్రాఁతప్రతులను
జూపి నావాద మెఱిఁగించితిని. వీరేశలింగముగారికి వేఱువిధ
ముగా, పూర్వము తాము వ్రాసినతీరుగా సమర్థింప నయితి
గాదయ్యెను. లక్ష్మణరావుగారు జాగ్రత్తగా నెల్లవిషయము

మరల ననువదించి వివరించి 'మీ రీక నిట్లు మార్చుకోవలసి నదే. మీరు తొలుత వ్రాసినదియు, మిమ్ము సమర్థింపబూని యితరులు వ్రాసినదియు సరికాదని స్పష్టపడినది' అనిరి. పంతులుగారు 'నాదగ్గఱ వ్రాఁతప్రతి యేదో ఉండుటచేత నట్లు వ్రాయుటయ్యెను. రాజమహేంద్రము వెళ్ళి నాదగ్గఱి గ్రంథములఁబట్టి మరల పర్యాలోచించి నిర్ణయింతును' అనిరి. లక్ష్మణరావుగారు 'ఇన్ని ప్రతులలో నున్నదానికి విరుద్ధముగా మీ వ్రాఁతప్రతి యుండదు. ఉండినచో సరిగా సమర్థముగా మీ వాదము నిర్వహించుకోవలసి యుండును' అనిరి. 'పంతులుగారి పట్టుదలను పరిభావించుచు వీరేశలింగముగారికి మన మందఱము సహాయముచేయుదము. వారిచేత నే కవులచరిత్ర సంస్కరణము జరపింతము' అని లక్ష్మణరావుగారు చెప్పిరి. నాచేత నయినంత తోడ్పాటు జరపుదు నంటిని. వా రిర్వురు నింటికి వెళ్ళిరి.

అటనుండి వీరేశలింగముపంతులుగారు బెంగుళూరు కొలఁదిదినములకే వెళ్ళిరి. కవులచరిత్ర ప్రథమభాగమున మాత్రము చేయవలసినసంస్కరణములు నే నెఱిఁగినంత బెంగుళూరికి వ్రాసి పంపితిని. అది యొక పెద్దకట్ట. పంతులుగారు వాని నుపయోగించుకొనిరి. కాని వాని నాయాపట్టు లందు పేర్కొననే లేదు సరికదా! గ్రంథపీఠికలో-'శాస్త్రిగారును... తమగ్రంథాలయములో నున్నపుస్తకభాగములను పద్యములను నేను కోరినవానిని వ్రాసి నా కెంతో తోడు పడిరి' అని వ్రాసిరి. వారి కేయేవిషయములు కావలసి

యుండునో వానిని నేనే తెలిపి, లిస్టు వ్రాసి, సంస్కరింపవలసిన
చేర్చవలసిన విధానములు, పద్యములు వ్రాసి పంపఁగా ఆ
విషయము నిట్లా స్మరించుట? ఈ సంస్మరణమున ఫలాని ఫలాని
పద్యములను, గ్రంథములను వ్రాసి పంపవలసినదిగా వారు కోరగా
నస్మదాదులము వ్రాసి పంపినట్టు లర్థమగును. నే నన్నవాస్త
వార్థమును దేవచ్చును. ఇంతే కాక తమకు చిరమిత్రు లయిన
శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారిని గూడఁ జెనకిరి. ప్రబంధ
రత్నావళినిగూర్చి యకారణముగా వారి కవులచరిత్రపీఠిక
లోనే మరల నన్నును జెనకిరి. వాని నెల్ల వివరించుట రోఁత.
నేను జాబులు వ్రాయఁగా జాలిజాలిగా వానికి బదుళ్లు వ్రాసిరి.
ఆజాబుల నిటీవల నేను చింపివేయబోగా తాము జాగ్రత్తగా
నుంచుకొందు మని నామిత్రులు గయికొనిరి.

ఇంత యెందుకు వ్రాసితి ననఁగా నాకు వాఙ్మయరంగ
మున క్రీడావినోద మనుభవింపవలె నని కొండంతకోరిక చెల
రేగుచున్నను, ఆదినుండి కూడ దాని కభ్యంతరములు, ప్రతి
షేధములు తఱచుగా నడ్డు దగులుచు నిరుత్సాహము గొల్పు
చున్న వని తెల్పుటకు. ఆనాళ్ళలో ప్రతివాదోత్సాహము నాలో
కొంత దూకులాడుచునే యుండెడిది. అయిన నేమి? స్వర్ణ
కారుఁడు సువర్ణరజతములను గరఁగించుటకై తనముందు
నిప్పులకుంపటిని నడుమ నంగారములు చేర్చి, దానిపై కుండ
మూకుటిని నెలకొల్పి, కుంపటినిండ నుముక నించి యుంచు
కొనును. వలసినప్పు డంగారముల గొట్టముతో నూఁది యగ్ని
ప్రజ్వాలనము కలిగించుకొనును. ఆయగ్ని కుండమూకుటిమూఁ

తకు లోబడియే మండ నిచ్చును గాని పైకి ఉముకలోని కెగఁబ్రాకనియ్యడు. అది నలువైపుల నుముకలోనికివ్యాపింపజొచ్చి నప్పుడు చుట్టును నీరు పోసి చల్లార్చును. ఆదినుండి నాస్థితి యించుమించుగా నట్లే సాగినది. బ్రదుకు సాగించుకొనుటకు వాఙ్మయసేవ సాధనముగా నా కేర్పడినది గాన, అందులో అరకుడుపు సాగునట్లు పని చేయుటకే నాయంతర్యామి నన్ను మెసల నిచ్చినది గాని యంత కెక్కువగా పని చేయుటకు గాని, యంత కెక్కువగా సాధించుటకు గాని నాకు చోటియ్యకే పోయెను.

---

# ౧౫

## టైఫాయిడ్

మైలాపూరునుండి ఎగ్మూరు మ్యూజియం బిల్డింగ్సులో నున్న ప్రాచ్యలిఖితపుస్తకశాలకు రాకపోకలు సేయుట, యెడ తెఱపి లేకుండ నక్కడి సంస్కృతాంధ్రగ్రంథములను జదువుట, చదివినగ్రంథములలోని ముఖ్యవిషయములకు నోట్సు వ్రాసికొనుట, కొన్నింటిని పత్రికలకు వ్రాయుచుండుట చేయుచుంటిని. రేయుంబవళ్లు విశ్రాంతి యెఱుఁగకుండ శ్రీ రామేశముగారు గ్రంథములు చదువుచుండుటను జూచుచుంటిని. గాన నేను నట్లు సాగింపఁ గోరిక. పూర్వసుకృతముచేత వారికి సుకరముగా నుండెను గాని నా కది యసాధ్యముగానే ఉండెను. పగలు చదివినగ్రంథముల యర్థములు రాత్రులందు గోచరించుచుండెడివి. నిద్ర తగ్గెను. నిద్ర పట్టనప్పు డెల్ల లేచి మరల జదువుచుండెడివాఁడను. దౌర్బల్యము నిరుత్సాహము పెరుగఁజొచ్చెను. ఇంటికి పోఁదలఁచి ఒక నెల సెలవు తీసికొంటిని.

సెలవు తీసికొన్నమర్నాడే నాకు తీవ్రజ్వరము వచ్చెను. డాక్టరు మందిచ్చుచుండెను|గాని జ్వరము హెచ్చుచునే యుండెను. నాల్గయిదునాళ్లయినతర్వాత నాతఁడు స్వగ్రామమున కీతని పంపివేయుఁడని మాబావగారితో చెప్పెను. నేను కదల లేనిస్థితిలో నుంటిని. మిత్రు లయిన పండితగోపాలాచార్యులు గారికి కబురంపితిని. వారు వచ్చి చూచి 'నేను సుదూరమున నుంటిని. ఇక్కడి వైద్యులదగ్గఱనే మందు గొనుటమంచిదేమో!'

అనిరి. అందాఁక ఇంగ్లీషువైద్యము నే నెఱుఁగను. మా నాయన గారాయుర్వేదవైద్యులు. వారే ఎప్పుడయిన జ్వరాదులు వచ్చినపుడు లిచ్చువారు. నాకందాక నంత తీవ్రానారోగ్యము లెప్పుడును రాలేదు. 'ఆయుర్వేదవైద్యము పరిచితము గాన, మీరు మిత్రులు గాన మీరే మందియ్యండి' అంటిని. వారట్లే సమ్మతించి వైద్యము చేయుచుండిరి. ప్రతిదినము ఆచారప్పన్ వీధినుండి మైలాపూరు శాలైలీవీధికి కొన్నిమైళ్ళు కోచిమీద వచ్చి పోవుచుండిరి.

విరేచనముల కని యొకనాఁ డావగింజంత మాత్ర యిచ్చిరి వారు. పదిరోజులనుండి నా కాహారమే సరిగా లేదయ్యెను. ఆమాత్రతో నానాఁడు నాకు నాల్గయిదు విరేచనము లయ్యెను. దొడ్డిలోనుండి యింటిలోనికి వచ్చుట యెఱుఁగుదును. స్మృతి తప్పి పడిపోతిని. కొంతకు స్మృతి వచ్చినట్లయ్యెను. నాడి చూచుకొంటిని. నిమిషమునకు రెండువందల దాపుగా కొట్టుకొనుసంఖ్య యుండెను. గుండె యెగసి పోవుచుండెను. దగ్గఱగా నున్న రామేశంగారిని పిలుచుకొని వచ్చిరి. వారు నాడి చూచి అపాయస్థితిలో నున్నట్లు గుర్తించి వెంటనే డాక్టరు నంజుండరావుగారికి చీటి వ్రాసి మనిషిని బంపిరి. నాస్థితి గందరగోళముగా నుండెను. అప్పుడే కాచినపాలు రెండళాకులు గబగబ త్రాగివేసితిని. పదినిమిషములకు ప్రాణ మందుకొనుచున్నట్లు తోఁచెను. అంతలో నంజుండరావుగారు వచ్చి పరీక్షించిరి. 'తీవ్ర మయిన టైఫాయిడ్ జ్వరము. వెంటనే యీ క్రిందిమందులు తెచ్చి యియ్యండి' అని చీటి

వ్రాసి యిచ్చిరి. గుడ్వీర్‌కంపెనీవారు మందు లిచ్చిరి. ఆ మందులు త్రాగినపదినిమిషములకే ప్రాణము సరిగా చేరుకొనెను. జ్వరము 22 దినములకు తగ్గినది. ఈనడుమ కొన్ని యొడుదుడుకు స్థితులును గలిగినవి. ఏమి కలిగినను వా రిచ్చిన మందులు వెంటవెంటనే నాకు గుండెనిబ్బరము కలిగించుచు వచ్చెను.

ఒకనాఁడు విరేచనము లగుట కేదో కొంచెము మందిచ్చి మామూలుమందులు పుచ్చుకొనవల దనిరి. ఆనాఁడు నాకు నిస్త్రాణ హెచ్చెను. డాక్టరు రాఁగానే 'దినము త్రాగే మందు నేఁడు త్రాగవ ద్దంటి రట! అవి త్రాఁగగానే నాకు పుష్టి కలిగెడిది. నే డట్లు లేదు' అంటిని. ఆయన నావీపు చఱచి, నవ్వి 'మరల వానిని తీసికొనుడు' అనిరి. జ్వరము తీసినతర్వాత అవి చికెన్‌బ్రాతు బ్రాందిలో కలిపిన దొకటి, ద్రాక్షాసవమువంటి దింకొకటి యగుట తెలియవచ్చెను. ఆతర్వాత రోఁత గొంటిని. కాని యప్పటిదాఁక నా కవి యమృతకల్పములుగా దోఁచెను.

ఆజ్వరతీవ్రతలో నాజీవితమునుగూర్చి సంశయ మేర్పడి మా బావగారు జాబు వ్రాయఁగా నామిత్రులు శ్రీ కాకర్ల కుమారస్వామిశాస్త్రిగారు, మామామగారు, మాతలిదండ్రులు, అన్నగారు మద్రాసు వచ్చిరి. ఆతీవ్రానారోగ్యపు నాళ్ళలో తమకుమార్తె రజస్వల యయ్యె నని మామామగారు జాబు వ్రాసిరి. ఆస్థితి మావారికి మఱింత వ్యాకులత గొల్పెను. ఎట్లో జ్వరము తగ్గినది. ఆరోగ్యవంతుఁడ నయితిని.

నాస్థితి విని విచారించి నంజుండరావుగారు రెణ్ణెల్లు లీవుపెట్టి యింటికి పోవలసిన దనియు, ఇతరవ్యాధు లేవి లేవు గాన వడి వడిగా ఆరోగ్యము కోలుకొనగల దనియు, ఆటైఫాయిడ్ జ్వరము తగ్గినతర్వాత నూటతొంబదిమందికి సహజముగా సంపూర్ణారోగ్యము పెంపొందు జ్వరమునకు పూర్వ ముండిన యనారోగ్యవాసనలుకూడ తొలగి విజృంభణముతో నుండ గల్గుదు రనియు, సంపూర్ణారోగ్యము బలము పడసి మూణ్ణెల్ల తర్వాత గార్హస్థ్యసుఖస్థితిని బడయుదువు గా కనియు, ఆరెణ్ణెల్ల తర్వాత మద్రాసుకు సకుటుంబముగా వచ్చివేయుదువు గా కనియు ననిరి.

---

## ౧౬

## వేంకటేశ్వరస్వామి దర్శనము

అప్పటి నాజీవితాశలు రెండు. మాతల్లిదండ్రు లెప్పుడో మ్రొక్కుకొన్న శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శించుట యొకటి. నాకు పసితనము నాఁటనుండియు దేవాలయముల కరుగుట గాని, అక్కడ స్వామిదర్శనము లభించునని నమ్ముట కాని, అక్కడివిగ్రహముల కర్చనాదికము జరుపుట కాని యిచ్చగొల్పనిముచ్చట. తిరువళిక్కేణిలో గాని మైలాపూరులో గాని దేవళములలోనికి స్వామిదర్శనార్థమై యెన్నఁడు గాని నేనై వెళ్ళి యెఱుఁగను. కాని యప్పుడప్పు డేవో నామనోభావములను పద్యములతో తిరువళిక్కేణి పార్థసారథిస్వామి స్తుతిగా వెల్లడించుట కలదు. ఇట్టివానికి నాకు తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనమున ముచ్చట యంత తీవ్రముగా నేల కలిగెనో నాఁడు గుర్తింపగుదుర లేదు. 'కలౌ వేంకటనాయకః' అన్నశ్లోకాంశము నన్ను క్రమ్ముకొన్నది.

మే మందఱము మ్రొక్కు చెల్లించుకొనుటకు అనఁగా చిరంజీవి మాతమ్మునికి శంకరున కుపనయనము స్వామిసన్నిధిని చేయుటకు బయలుదేరితిమి. మద్రాసునుండి బయలుదేరి తిరుపతికి వచ్చుటలో నిజముగా నాకు స్వామిసన్నిధికే వచ్చుచున్నంత యుత్సాహము. అఖిలాండనాయకుఁ డగువాని, విశ్వమును, విష్ణువును, వషట్కారుని, భూతభవ్యభవత్ప్రభువును కన్నులార కాంతును గదా! ధన్యుఁడ నగుదును గదా! అదుగో

ఇదుగో చేరబోవుచున్నాను అని మురియఁజొచ్చితిని. అప్పుడే తీవ్రానారోగ్యవిముక్తుఁడ నయితిని గాన దౌర్బల్యము ప్రబలముగా నున్నను నీయుత్సాహము నన్నుద్బోధింపఁగా స్వామిపై నేవో పద్యములు పయనములో రచింపఁదొడఁగితిని. తిరుచానూరిలో నుపనయనము జరపితిమి. స్టేషనునుండి యెండలో నాయూరు చేరుటలో మాయన్నగారి కుమార్తెకు పసిబిడ్డకు తీవ్రజ్వరము వచ్చెను. జ్వరము తగ్గుదాఁక నే నదే చేయుదునని కూర్చుండి పద్యములతో స్వామిస్తుతి చేయఁ జొచ్చితిని. జ్వరము కొన్నిగంటలలో తగ్గిపోయెను. పద్యములు చాల రచించితిని. వానిలో నొకటి రెండు :—

చుట్టని మేను కాలెఁ గను మూడ్కి నికారను దోచె నన్నకుం
గుట్టది యాఱుమాసములకూన యిదెక్కడి వేకిపోకొ మా
మొజ్జల నాలకింపుము నమోనమ! యప్పన నీకు నప్పనా
చిట్టిన చీదకుండ సుఖసిద్ధికిఁ దార్చుమి బిడ్డఁ దేర్చుమీ !

జ్వరము తగ్గినపై

అంకిలి లేనిభక్తి మనసారఁ దలంచి నమస్కరించి మా
సంకట మార్పవే యన వెసన్ సుఖ మిచ్చి యనుగ్రహించి తో
కింకరకల్పకంబ! పరికించితి నీమహనీయతన్ 'కలా
వెంకటనాయకో' యనుసువిశ్రుతసూక్తియథార్థభావమున్.

ఆనందముతో నందఱము గొండ లెక్కితిమి. వృద్ధులు గాన మానాయనగా రంతకు ముందు పలుతూరులు స్వామి దర్శనము చేసినవారు గాన దిగువతిరుపతిలోనే కొలఁదికాలము క్రిందటనే కట్టిన 'వుప్పుతోట' సత్రములో నుండిరి. స్వామి దర్శనమునకై యువ్విళ్లూరుచు వెళ్లితిని. కాని యక్కడ నా

కెంత తంటాలు పడినను స్వామిమూర్తిదర్శనము లభింపలేదు. మద్రాసునుండి మహంతుగారికి, వారిదగ్గఱనుండి కొండమీఁది యుద్యోగులకు జాబు గొని వెళ్లితిమి. కాన యక్కడ వలయు సౌకర్యములు లభించెను. మావారందఱు కొంత యలజడి, త్రొక్కటమును జెందినను స్వామిదర్శనము సరిగాఁ జేసికొని తనిసిరి. నేను చాలసేపు స్వామిమూర్తిని చూడ యత్నించి విఫలమనోరథుఁడ నయితిని. ఎంత యత్నించినను చెదరి చెదరి చీకటి గానవచ్చెను గాని నా కక్కడ స్వామిమూర్తి గోచరింపదయ్యెను. చాల నిరుత్సాహము చెందితిని. దుష్టుఁడ నని దురపిల్లితిని. పాపిష్ఠుఁడ నని పలవించితిని. ఏమియుం దోఁచక యేడ్చితిని. అనారోగ్యదౌర్బల్యముచే నక్కడిమూర్తిదర్శనమునకు కనులు మిఱుమిట్లు గొనియుండు నని, స్వామికి నాకు నడుమ దివ్వెవెలుఁ గుండుటచే నది యడ్డు వచ్చి మూర్తిని గానరానీయ దయ్యె నని, నాపాపకర్మముచే దర్శనము లభింపలేదని పరిపరియోచనలు, వాని కేవో యపవాదములు తోఁచ సాగెను. ఏమి తోఁచినను స్వామి గోచరింపఁడయ్యెనే కదా యన్నయారాటము నన్ను వీడలేదు.

ఈసందర్భ మీగ్రంథము రచించునాఁటి కించుమించుగా నల్వదియేండ్లకు పూర్వము జరిగినది. 1910వ సంవత్సరము నాఁటి దీవృత్తాంతము. తర్వాత 1930నుండి తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామినిగూర్చి కొంత యెఱుక నాకుఁ గలుగసాగెను. 1949నాఁటి కింక నెన్నో విషయములు గోచరించెను. వాని నాయాసందర్భములలో సక్రమముగా వివరింతును.

# ౧౭

## తొలి కలయిక

నాకు టైఫాయిడ్ తగ్గి యారోగ్యము లభించునాఁటికి జీవితవాంఛలు రెండు గల వంటిని. తొలిది శ్రీ తిరుపతి వేంకటేశ్వరస్వామిదర్శనము. అది తొలుత నగమ్యగోచరముగా నుండుట, యీనాఁటికిఁ జాలవిషయములు దెలియనగుట రేఖామాత్రముగాఁ జెప్పితిని గదా! రెండవది వివాహ మాడితిని గనుక అచుంబితప్రక్రియ యగుస్త్రీసుఖము ననుభవింప గోరుట. అది యేదో వేంకటేశ్వరదర్శనమువలె నపూర్వాద్భుతాతిలోకానందము గొల్పునదిగా నుండఁగల దనుకొనుచు నువ్విళ్లూరుచుంటిని. ఈరెండు నెఱవేరినచో నాజీవితప్రయోజనము లభించినట్టే యనుకొంటిని.

తిరుపతినుండి యింటికి వెళ్ళినతోడ్తో నారోగ్యవృద్ధి క్షణక్షణవిజృంభణము గాఁజొచ్చినది. మాతలిదండ్రులు వగైరాలు మద్రాసునుండి వచ్చుదాఁక ఇంచుమించుగా పదునైదు నాళ్లు నామిత్రులు శ్రీ సుసర్ల కుమారస్వామిశాస్త్రిగారి యింటనే యుంటిని. వారును, వారి కుటుంబిని శ్రీమతి రామమ్మగారును నన్ను బిడ్డనుగాఁ గాపాడిరి. ఆకలి నా కమితముగా రేగుచుండెను. ఎక్కువగా భోజనము చేసెడివాఁడను. దృష్టి తగులు నని రామమ్మగారు నాకు చాటుగా నెవ్వరు చూడకుండునట్లు భోజనము పెట్టుచుండెడివారు. ఆదంపతులు నేఁడు లేరు. వారి పుణ్యగతికై తలఁపునకు వచ్చినపు డెల్ల తపించుచుందును. కుమారస్వామిశాస్త్రిగారిని నేను నాభృక్తిరహిత

తారకరాజయోగానుష్ఠానమున తర్వాత 1917వ సంవత్సరమున చేర్చితిని. కాని వారు దుర్బల మయినచిత్తవృత్తి కలవారు గాన యిందు శ్రద్ధాళువులు కారయిరి. దుస్సహవాసముల మరగి సంపదారోగ్యములను సంపూర్ణముగాఁ జెడగొట్టుకొనిరి. వారిభార్యగారు ముందుగాను, 1928 ప్రాంతముల గాబోలు వారును చనిపోయిరి.

కుమారస్వామిశాస్త్రిగారు చనిపోయిన పదవనాఁడు నేను ధ్యానము చేసికొనుచుండఁగా నాకన్నులయెదుట స్పష్టముగా గోచరమై చిఱునవ్వు నవ్వుచు 'నీమంచిసహవాసమును దూరస్థుఁడనుగా నుండుటచే కోల్పోయి నీమాట వినక దుస్సహవాసముల జిక్కి చెడితిని. శారీరకవాంఛలు నన్నట్టుగా నాకట్టుకొని పెడమార్గమును బట్టించినవి. చక్కబఱుప సాధ్యము కానితుచ్ఛశరీరము తొలఁగెను. ఇఁక నీగోష్ఠిలో నేను సుప్రతిష్ఠితుఁడనుగా నుందును'అని లజ్జాగర్భితముగాపలికి నాతో ధ్యానమగ్నుఁ డగుట కానవచ్చెను. శీలము పవిత్రము గాకున్నను, ఉపకారప్రకృతి యాతనికడ నసాధారణమైనదిగా నుండెడిది. ఆర్తతలో నున్నవారి కెందఱకో ఆతఁ డుపకరించెడివాఁడు. తనకల్మి నందుకు గోల్పోయెను. ప్రధానముగా నాయెడ నాతఁడు నెఱపినసౌహార్దవాత్సల్యములకే, అనుగుణముననే శాశ్వతముగా నాజీవు డుద్గతి నొందుగా కని తపించుచుందును.

వారియింట పదిహేనురోజుల కెక్కువకాలమే అప్పుడుంటిని. అంతలో మా తల్లిదండ్రులు వగైరా లింటికి వచ్చిరి.

మూడు నాలుగు నెలలకు నే నంతకు ముం దెన్నఁడు నెఱుఁగని యారోగ్యము పొందితిని. నా తలఁపును గుర్తించినవా రగుటచే మా తలిదండ్రులు, నక్కగారును పునస్సంధాన ముహూర్తము నిర్ణయించుటకు మా యత్తవారిని గోరిరి. ఇంకను గొంతకాలము గడవఁదగు ననుకొన్నను మా కష్ట సుఖముల నాలించి మా మామగారు ముహూర్త నిర్ణయ మున కంగీకరించిరి. కొలఁది రోజులు ముందుగా మా సోదరికి గూడ పునస్సంధాన ముహూర్త మేర్పఱిచిరి.

అంతదాఁక బులపాటము చెందుచున్ననాకు ముహూర్తనిర్ణ యమునాటనుండి చాలమనోదుఃఖము రేగెను. నావ్యాకులతను గుర్తించిరే కాని కారణ మేదో యెవ్వరు నెఱుఁగరు. తొలుత నేను నెఱుఁగను. కారణ మెఱుఁగరాకుండ వ్యాకులత పెరుగ సాగెను. వివాహము నాఁటినుండియు నా జీవితము క్లేశముల పా లగుచుండుట, దానికి కారణము పెండ్లాడిన పిల్ల జాత కము పొంతనములు సరిపడినది కాకపోవుట యని మావారు చీకాకు చెందుట యని వెదకి వెదకి కొంత గుర్తించితిని. నా వివాహమునాఁడు వధువు జాతకము చూపింప గోరఁగా మా మామగారు నేను జాతకము వ్రాయలే దని చెప్పివేసిరి. కాన దాని గుణదోషములు గుర్తింప వీలుపడ దయ్యెను. అసలు నాకు జాతకపరిశీలనముమీఁద విశ్వాసమును లేదయ్యెను. 'యస్యాం మనశ్చక్షుషో ర్నిబంధ స్తస్యా మృద్ధిః' అన్న ధర్మ సూత్రము నాకు నచ్చి నేను మనసార ప్రేమించి యీ పిల్లను పెండ్లాడితిని గాన నా కప్పుడు కొంచెత తోఁపలేదు.

అప్పటివఱకు ఆ వధువు నాకు ధర్మపత్నిగా నాతో సంసారయాత్ర సాగింప నున్నది సుమా యన్న తలఁపే కాని యింత కెక్కువ యోచనలు లేవు. ఇఁకమీఁద నా వధువు మా యింటికి రానున్న దని, వివాహప్రయోజన మిఁక మీఁదనే అనుభవింప నుంటి మని, నా హృదయము నే నెఱుఁగుదు ననుకొనుచుంటిని గాన, ఆమె హృదయము నా కర్పించి నాహృదయము నప్పన గొనుటో, తన హృదయమును నా కర్పింపక నా హృదయమును హరించుటో యేది చేయునోయనీ, అంతదాఁక నన్నత్యంతము ప్రేమించుచున్న మాతలిదండ్రుల కాపిల్ల ప్రేమపాత్ర మగునో కాదో అనీ, ఆ పిల్ల వారి నెంత యేడ్పించునో అనీ, నాయన్నదమ్ములకు, అక్కచెల్లెండ్రకు, నాకుఁ గలసౌమనస్య మిఁక ముం దేమి కానున్నదో కదా అనీ వెఱపు, క్షణక్షణమునకు స్పష్టాతిస్పష్టముగా విచారము పెరుగసాగెను. మఱియు మా తలిదండ్రుల చాటుననే యింత దాఁక నా జీవితము సాగుచుండెను. సర్వభారము వారు మోయుచుండఁగా నిర్భయుఁడనై నే నుంటిని. నా దృష్టిని వారు వ్రాలి యస్తమింప బోవుచున్నట్టును, నే నొక వంశవృక్షమును వెలయించి యుచ్చస్థాన మాక్రమింప బోవుచున్నట్టును దోచసాగెను. నే నంత నిర్వహింప గల్గుదునా? మా తలిదండ్రు లున్నంతదాఁక వారి చాటువాఁడ నగుటే శ్రేయము గాదా! నేను వెలయింపఁ బోవువంశవృక్షము మా తలిదండ్రులు వెలయించిన వంశవృక్షముతో పొందిపొసఁగి లోబడి యుండవలదా! ఏ మగునో! నా జీవిత

మార్గము మంచికో, చెడుగుకో దారి త్రొక్క నారంభించు సంఘటన దాపురించినది. ఎందఱ కుటుంబములో యిట్టి పట్టుల నపమార్గములఁ బట్టినవి కానవచ్చినవి. ఇంక నెందఱ కుటుంబములో సన్మార్గమున బట్టినవి కానవచ్చినవి. ఏవంవిధమయిన చింతలో, అలజడిలో కొట్టుకాడుచున్న నా ముఖమున నశాంతిలక్షణములు ప్రవ్యక్తముగా గోచరించుచుండెను. వానిని జూచి మా తల్లిదండ్రులు, నక్కగారు త్రొక్కట పడఁజొచ్చిరి.

సంతోషము గాని సంతాపము గాని యంతరంగమును కలవరపఱచుచున్నప్పుడు దానిచేష్ట యకృత్రిమముగా, స్పష్టముగా నున్న దున్నట్లు కొందఱ ముఖమున గోచరించును. కొందఱు లోని సంతోషము దాఁచి యుంచుకొని ముఖమున, సంతోషమును దోపనీయకున్న మానె గాని, యేవో ప్రయోజనము లర్థించి పైగా విచారమునే వెలయించుకొనఁ గల్గుదురు. ఎంత దుఃఖకారణము కల్గినను దాని బలమును వివేకముచే తగ్గించుకొని దానిని లోన గూడ భావింపకుండుట మంచిది గాని లోన కుములుచు బైటికి నవ్వు దెచ్చుకొనుట రోఁతయే. ఆ నవ్వు వెడనవ్వగునె కాని తియ్యని నవ్వుగా తెరలు వాఱదు. స్మితప్రయత్నమే కాని దాని సత్ఫలితము కలుగదు.

తాను ప్రేమించువా రెవ్వరు గాని తప్పు చేసినట్టు తాను భావించునప్పుడు వారిని సరిదిద్దఁ గోరునపు డాయా వ్యక్తుల వివేకపరిపాకము ననుసరించి కోపసూచనలు

చేయుట, గర్హించుట, తిట్టుట, కొట్టుట గూడ జరగుచుండును. అందులో నంతరంగమున నవ్యక్తముగా, స్థాయిగా అనురాగమే కుదుర్కొని యుండును. అట్టిచో చివ్వున కోపము రేగును. కోపసూచన మొదలుగా కొట్టుట దాఁక వివేకపరిపాకానుసారముగా నొక చేష్ట జరగుచుండ అంతరంగమున కేసి చూడఁగా నక్కడ అనురాగరేఖలు నవ్వుచుండుట, అవి తన్నే కోపించుట, తిట్టుట, కొట్టుట, జరపినట్లయి యిఁక నిట్టి చేష్టలు చేయకుమా యని మందలించుట అంతరాత్మావేక్షణానుభూతి కలవారికి గోచరించును. రేగిన యా కోపోద్రేక మా మానవుని యంతరంగము తనలో హాయిగా నున్నయనురాగము శరీరాణువులం దంతటను నిండారుటకు చేయుజతనములో తనకు విరుద్ధ మయిన, తనతో లోనుండ గూడని కోపపుబండాలము నదను చూచి బైటికి వెడల గొట్టు నప్పుడు చెలరేగి బయట బడినదిగా గుర్తింపనగును. శరీరమును జుట్టియుండు నావృతి దాఁక నది మెట్టనిపొగలతో చెలరేగి దిద్దుబాటు చెందవలసినవారిని దాఁకి వారి యానుకూల్య ప్రాతికూల్య, సౌమనస్య వైమనస్య, ప్రాబల్య దౌర్బల్యాద్యనుగుణముగా దాను చేయఁ గలమంచిని జేసి యుపరత మగును. ఈ విధముగా నప్పు డప్పుడు లో నిల్వయున్న కోపపు సరకులో నెంతో కొంత అసత్పదార్థ మగుటచే నిలువ వీలులేనిది కాన కర్చుపడి పోగా పోగా లో స్థాయిగా నున్నప్రేమ సత్పదార్థము గాన శాశ్వతమై పెంపొందుచుండును. దీని నాత్మావేక్షణ

పరులు గుర్తింపఁ గల్గుచుందురు. అంతరంగమున స్థాయిగా నను రాగము, ప్రేమ ఉన్నసందర్భములనుగూర్చి వ్రాసిన దిది.

ఆత్మాన్వేషణపరులు లోనికి బోఁగా పోఁగా ఇఁక పోవ నెడము లేకుండ కడపటి హద్దుగా గుర్తింప నగు నెలవు ప్రేమైకమయముగానే ఉండును. ప్రేమ సత్పదార్థము. కాన నిత్యము. ఆ స్థలమున ప్రేమేతర (ద్వేష) వాసన కూడ నుండదు. అద్దానిని జేరుకొనుటకై లోనికి బోను పోను, ప్రేమేతరపదార్థము పలుచబడుచు సన్నసన్నగా దిగనాసిల్లుచుండును. ప్రేమపదార్థము చిక్కనగుచు దాని విజృంభణము అంతరంగముననే కాక బహిరంగమునఁ గూడ 'అంతర్బహిశ్చ' క్రమక్రమముగా నిండార్చును. అసలు తత్త్వాన్వేషి సముద్రమథనకథగా సత్సంకల్పవు మందర పర్వతమును శరీరసముద్రమున దింపి శరీరము మథింపగా లోనుండి మంచిచెడ్డలు రేగుచుండును. చెడుగులను దొలఁగఁద్రోసికొనుచు మంచిని గుర్తించి స్వీకరించి యనుభవించుచు బోవఁగాఁ దుదకు అమృతలాభము కలుగును. ఇందు మూలాధారము కూర్మ మగును.

అప్పుడే గార్హస్థ్యము నందిన మా బావగారిని నా దుఃఖకారణము విచారింపఁగోరి రఁట! ఒకనాఁడు నిద్రలేచి యూరి నంటియున్న మా పొలమున కరిగి అక్కడి మా మంచినీటి బావికడ కాలకృత్యముల దీర్చుకొని స్నానోన్ము

ఖుఁడ నగుచు తాటిచెట్టు చాటున కరిగి దుఃఖించుచున్న నన్ను వెనుకతట్టున నుండి వచ్చి పట్టుకొని మా బావగారు దుఃఖకారణము ప్రశ్నించిరి. ఏమి లే దంటిని. ఉన్నను, అది చెప్పినను మీరు దాని విలువ గుర్తింప లే రంటిని. ఆతఁ డేదో గొప్పదోషము నాలో నున్న దనుకొని తీవ్రముగా చకితుఁ డయి పదింబదిగా ప్రశ్నింపఁదొడఁగెను. నా కేదో సౌభాగ్యతాలోపభీతి కలదని యాతఁ డనుమానపడుచున్నట్టు తోఁచెను. ఇఁక దాపరాదని యున్న దున్నట్టు చెప్పితిని. మా తలిదండ్రుల పతనము గోచరించుచున్నట్టున్న దన్నమాట మా తలిదండ్రులతో చెప్పరా దని యాన వెట్టితిని. అంతా విని యాతఁ 'డయ్యో యిదా నీ యేడుపు !' అని పగలబడి నవ్వఁ జొచ్చెను. లోకసాధారణ మయినభావములను నీతలనే విఱిగిపడినవానిగా భావించి యఘోరించెద వేల ? యని తెగడెను. తర్వాత మా తలిదండ్రులతో నుచిత మగునంతవఱకు చెప్పి వారిని తేర్చెను. రాగవిరాగములు రెండును నాలో నప్పుడు రేగినవి.

ముహూర్తము జరగినది. తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనము వంటిదే యిది కూడ నయ్యెను. వాత్స్యాయన కామసూత్రాది గ్రంథము లేవేవో చదివి యుంటినే కాని అది పుస్తకవిద్యయే కాని యనుభూతి లేనిది. నాకు వర్ణసచివుఁడు మా బావ మర్నాడు శుష్కేష్టితంత్రముగా

నాకు తెలియఁజెప్పినపై కృతార్థుఁడ నయితిని. ఇంజనీయరింగు, వైద్యము మొదలగు ననేకవిద్యలలో పుస్తకపఠనమాత్ర పండితు లెందఱో ఉద్యోగు లయి కార్యనిర్వాహణమున నప్రాజ్ఞులై మెలమెల్లగా చేతిక్రింది చిన్ని యుద్యోగుల యుద్బోధముతో చతురు లగుట చూచుచున్నాము గదా!

## ౧౮

## ఆవేదన

రెండు మూఁడు నెల లింటికడనుండి నేను మాతమ్ములతో మద్రాసు చేరితిని. కొన్నాళ్లు మాబావగారింటను, గొన్నాళ్లు హోటలులోను భుజించుచుంటిమి. ఇంటికి వెళ్లి యిల్లాలిని వెంటగొని వచ్చితిని. అంతకు పూర్వము నేను చెందినవెఱపు మఱపునఁ బడెను. గార్హస్థ్యముతో ప్రాచ్యలిఖితపుస్తకశాలాగ్రంథపఠనోత్సాహముతో కాలము గడచుచుండెను. అప్పటికి చాటుపద్యములు చాలా చేర్చి చాటుపద్యమణిమంజరి యనుపేర గ్రంథముగా సంధానించితిని. వానిని ముద్రించి ప్రకటించుటలో శ్రీ రెంటాల వెంకటసుబ్బారావుగారు నాకు చాలా సహాయము చేసిరి. వేయి రిప్లైకార్డులమీఁద (కార్డు కానివెల) నోటీసు, పుస్తక మపేక్షించువారు వ్రాయుటకు పై అడ్రసుతో అప్లికేషనుఫారము అచ్చు వేయించి అడ్రసులతో పోస్టు చేయించిరి. వెంటవెంటనే వేయిపుస్తకములు నమ్ముడు పోయెను. ఇట్లు నేను పుస్తకవ్యాపారము చేయుదు నని దుఃఖించినపుస్తకవ్యాపారులున్నారు. దీనితర్వాత ప్రబంధరత్నావళి, భాసనాటకములు కొన్ని ప్రకటింపఁబూనితిని. కాని ఇవి యెల్ల 'నీవు వ్యాపారము చేయనేల ? మా కిచ్చిన మే మమ్మి సొమ్మిత్తుము గదా' యని కోరుపుస్తకవ్యాపారులకు, అప్పటికి నేను మరల అనారోగ్యగ్రస్తుఁడ నగుట, తర్వాత దేశాటనము చేయవలసినవాఁడ

నగుట యేర్పడుటచే అమ్మివేసితిని. ఆపుస్తకవిక్రయమువల్ల వచ్చునాయతిచే సుఖముగానే జీవితయాత్ర గడపుచుంటిని. తమ్ము లిర్వురలో ఒకరు స్టాన్లీ రాయపురం మెడికల్ స్కూలులోను, ఇంకొకరు ఆయుర్వేదకళాశాలలోను తర్వాత చదివిరి గాని యప్పటికి కెలెట్ హైస్కూలులో చదువుచు నాదగ్గఱనే ఉండిరి. సుఖముగా జీవితయాత్ర సాగుచుండెను.

శ్రీ రామేశంగారికి నటేశన్, రామయ్యరు ఇత్యాది గ్రంథవిక్రేతలు మిత్రులు. వారు విక్రయమునకు తెప్పించు గ్రంథముల నన్నింటిని వారము వారము చదివి యిచ్చుటకు వా రింటికి దెచ్చుకొని పుస్తకము లేమాత్రము చెడకుండ చదివి వారి కిచ్చివేయుచుండెడివారు. ఆగ్రంథవిషయముల గూర్చి మిత్రుల కందరికి తెలియజెప్పుచుండెడివారు. వారు గ్రంథములను జదువుట పుస్తక విక్రేతల కధికలాభాపాదక మగుచుండెడిది. వారి గ్రంథపఠనోత్సాహము నాకును జక్కలి గింత గొల్పినది. లైబ్రరినుండి ముద్రితగ్రంథముల దెచ్చుకొను చుండెడివాఁడను. ఒకటే చదువు! అప్పటి నావయ స్సిరువది యాఱు.

అప్పుడు *తెలుఁగుదేశమున పెక్కుచోట్ల కలరా వ్యాపించియున్నది. మద్రాసులోను కలరా ఉన్నది. బందరులో మాబావగారి తల్లి కలరా వచ్చి మృతి చెందెను. మద్రాసు నుండి మాబావగారు, మాతోబుట్టువు ఆమెగారి యౌర్ధ్వ దైహికమునకు బందరు వెళ్లిరి. వారు తిరిగి వచ్చునప్పు డక్కడ నుండి కొన్ని మొక్కజొన్నకండెలు తెచ్చిరి. వారిరాక తెలిసి

ఆఫీసునుండి యింటికి వచ్చినతర్వాత వారి యింటికి వెళ్ళి అక్కడి కష్టసుఖములు విచారించి వచ్చితిని. వచ్చునప్పుడు మావారీయఁగా మొక్కజొన్నకండెలు తెచ్చితిని. రాత్రి మే మందఱము వానిని భుజించితిమి. నిద్రలో రాత్రి రెండుగంటల వేళ నాకు మెలఁకువ, శరీర మంతా అలజడి. కలరా వ్యాధి కృమి ఆ మొక్కజొన్న కంకెలతో అంటి వచ్చి నాలో చొచ్చినట్లు, నాకు కలరా వచ్చినట్లు భావన. బహిర్భూమికి వెళ్లవలసెను. రాత్రి గనుక నే నున్నచోటు (తిరువళిక్కేణి సాతానివీధి తుదిమేడ) కొబ్బరితోటలు గలది గనుక యిల్లు విడిచి బైటికే వెళ్లితిని. వట్టిగాలియే అమితముగా వెళ్లెను గాని విరేచనము కాలేదు. ఇంటికి వచ్చి యీజిచైరులో కూర్చుంటిని. ఒడలెల్ల కంపించి పోవుచుండెను. నాల్గు మూఁడు గజముల దూరమున - బందరులో కలరాతో చనిపోయిన మాబావగారితల్లిగారు అఱువదియేండ్ల వృద్ధ ఘూర్ము దుఃఖితాగ్రహావిష్టాననముతో ప్రత్యక్ష మగుచుండెను. చీకాకు కలిగెను.

అంతకు ముం దట్టి దుర్దర్శనము నే నెన్నఁడు నెఱుఁగను. నిద్ర రాక చీకాకుతో నే ఆ రాత్రి గడపితిని. ప్రొద్దుట శరీర మంతయు కీలుకీలు విఱిచినట్లు నొప్పి. పదిగంటలవేళ ఆఫీసుకు పోవలెను గాన భోజనము చేయబోయితిని. ఒకముద్ద మ్రింగితినో లేదో ఒడలెల్ల అదరి చల్లబడి పోయి మృత్యుముఖమున నున్నట్లయితిని. తమ్ములు స్కూలుకు వెళ్లిరి. నేఁడు హైకోర్టుజడ్జిగా నున్న చింతకుంటరాఘవరావుగారు నేను నొక

యింటనే యుంటిమి. డాక్టరు నారాయణస్వామినాయనిగారిని రాఘవరావుగారే పిలుచుకొని వచ్చిరి. ఆయన వచ్చి పరీక్షించి విరేచనములకు మందిచ్చి జబ్బేమి లేదని వెడలి పోయెను.

అప్పటికే మొదటిమహాసంగ్రామ మారంభ మయి సాగుచున్నది. ఆయుద్ధమునుగూర్చి క్షోభ నాలో తీవ్రముగా సాగజొచ్చినది నాయనారోగ్యము దుర్భరముగా నుండెను. డాక్టరు నంజుండరావుగారు మందిచ్చుచుండిరి. అట్లు నాల్గయిదురోజులు గడచినతర్వాత నొకనాఁడు నాదేహ మెల్ల చిమ్మచీకట్లు క్రమ్ముచున్న ట్లయి ఒడలెల్ల ధారలుగా చెమటలు దిగజారి లోననుండి తీవ్రబలము, ప్రజ్ఞ పొంగారుచున్నట్టయ్యెను. నంజుండరావుగారు నరములకు, గుండెకు బలము కలుగుటకు మందిచ్చుచున్నారు గాన దానికార్య మది యనుకొంటిని. ఆనాఁడు తీవ్రోత్సాహముతో నుంటిని. నంజుండరావుగారు కొన్నాళ్లు సెలవు పెట్టి స్వగ్రామమునఁ గొన్నాళ్లుండి రమ్మనిరి. నెల కాఁబోలు సెలవు పెట్టితిని. ఇంటికి నేనొక్కఁడనే పయన మయితిని. తమ్ములు, భార్య మద్రాసులోనే యుండిరి. .

బందరులో గురువర్యులగు శ్రీ వెంకటశాస్త్రిగారికి కాబోలు నేదో బంగారువస్తువు వారు సొమ్ము పంపగా చేయించుచుంటిని. దానిని తీసికొని వచ్చుటకై ఆఫీసునుండి సాయంకాల మాఱుగంటలవేళ కొనులోని కరిగితిని. చెన్నకేశవస్వామి గుడిప్రాంతముల నున్నది యాసెట్టిగారియిల్లు.

నేను వెళ్లి సామ్మిచ్చి వస్తువును దీసికొని, మీసోదరుఁ డేడీ యని యాసెట్టిగారి నడుగగా నేఁటికి పదునైదురోజులక్రిందట ఆతఁడు శ్రీ కన్యకాపరమేశ్వరి దేవాలయమునకు రాత్రి పది గంటలవేళ వెళ్లి యక్కడ పూజోత్సవాదులు దర్శించు చుండగా ఎమ్డెన్ గుండు దెబ్బ వినవచ్చెను. ఒక గుండులోని తునుక కన్యకాపరమేశ్వరి దేవాలయావరణలో పడెను. దాని వెల్తురు చూచినతోడనే గుండె పగిలి నెత్తురు వాంతి చేసి కొని చనిపోయెను అని సవిస్తరముగా నాసెట్టిగారు చెప్పిరి.

అది వినఁగానే నాకు మరల శరీర మెల్ల నదరిపోయి చల్లబడి మృత్యుకల్ప మయినస్థితి కల్గెను. నా వికృతి నా సెట్టిగారి కెఱుఁగనీయక వెంటనే యటనుండి వెడలి గోవిం దప్పనాయుని వీధిమొగనే యొంటరిగా కాపుర మున్న శ్రీపురాణం సూర్యనారాయణశాస్త్రిగారి తోడ్పాటుకై వారి యింటికి వెళ్లితిని. చాల నీరసించి యెట్లో చేరగల్గితిని. ఉద యము పదిగంటలకు చేసినభోజనము. అంతకు ముం దాకలి కూడ తీవ్రముగా నుండెను. అప్పటికి హోటలు, కాఫీ వగైరాల యలవాటు నాకు లేదు. వడిగా ట్రాము మీఁద నన్నిల్లు చేర్పఁగోరితిని. ఆయన కాశీ విజయనగర నివాసాభ్యస్త మయిన 'భంగు' పాన పారాయణుఁడు. అది నూఱి త్రాగి కాని కదలఁజాల ననెను. అవస్థపడుచు గూర్చుంటిని. భంగు తయారు చేసికొని త్రాగి నాతో బయలుదేరి నన్ను మా యింటికి చేర్చిరి.

ఎమ్డెన్ గుండ్ల దెబ్బలు నాఁటికి పదిపదునైదునాళ్లకు ముందు రాత్రివేళ షారిన్ కార్నరులో తగులుట, ముందుగా ఎమ్డెన్ నౌకవారు మదరాసు నగరముపై తీవ్ర మయిన టార్చిలైటు ప్రసరింపఁజేయుట నా యనారోగ్యారంభావస్థలో నుండి యెఱుఁగఁజాల నయితిని. మర్నాఁడూరెల్లఁ జెప్పుకొనుట వింటిని. అంతదాఁక ఇండియానుండి కృత్రిమయత్నములతో యుద్ధభటులను గొనిపోవుట, కసాయివారికి మేకల నర్పించి నట్లు యుద్ధభూమిలో వీరిని బలియిచ్చుట, దేశదౌర్భాగ్యము వినిగూర్చి విచారమే కాని యిండియాలోనే యుద్ధవిక్రుతులు గానవచ్చుట యెవ్వరు గాని ఊహింపనివిషయము. యుద్ధచింత నన్నల్లకల్లోలములలో ముంచివేసినది. నాఁడు బాలయ్యసెట్టిగారి యింట ఫిరంగిగుండ్లముక్క లూరెల్లఁ బడుట, దాని చూచి నిండుజీవి యాకస్మికముగా చనిపోవుట విన్నపై యుద్ధమున నిండుజీవులు గుండుదెబ్బలు, ఈటె పోట్లు వగైరాలు తగిలినప్పుడు చెందుమరణయాతన నా దేహముననే గోచరించుచున్నట్లు తోఁపసాగినది. క్షణక్షణమును నాకు మరణయాతనయే. ప్రతిదేశలేశములోను, ప్రతికాలలేశములోను నాకు మృత్యుభయమే. చచ్చిన చావూ కాక బ్రదికిన బ్రదుకూ కాక చావుబ్రతుకుల సందులో ఊగులాట యయ్యెను.

---

౧౯

# అనారోగ్యము

అప్పటికి ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నాకు మంచి వేతనాభివృద్ధి యేర్పడెను. మదరాసు రాష్ట్రమంతటను ప్రాచీనగ్రంథములను సంపాదించుటకై కొంద ఱుద్యోగులను ప్రభుత్వమువారు నియమించిరి. అందు న న్నొక ముఖ్యునిగా నియోగించిరి. నే నందు ప్రవేశించితిని. కాని యీ యనారోగ్యముచే సెలవు పెట్టవలసినవాఁడ నయితిని. ఆ గ్రంథార్జన కార్యము పెక్కేండ్లు సాగునదే యయినను ఆ యుద్యోగములు టెంపొరరీగానే యేర్పాటు చేసిరి. ఆ టూరింగు పార్టి కార్యకలాపము తోడ్తో ప్రారంభింపవలసినదిగా నుండెను. నేను దీర్ఘానారోగ్యగ్రస్తుఁడ నగుచుంటిని. కావున నన్ను తొలఁగించి యీ యుద్యోగము నింకొకరి కిచ్చిరి. నేను పర్మనెంటు పోస్టుకే రివర్టయితిని. సెలవు గయికొంటిని గనుక యింటికి వెళ్లితిని. మూఁడేండ్లు బాధపడితిని.

మదరాసులో నుండఁగా మార్చి మార్చి నంజుండరావుగారు పెక్కుమందు లిచ్చిరి. ఎన్ని యిచ్చినను గుణము కనుపడదయ్యెను. ప్రత్యుత ఔషధము గయికొన్న యీ పూటనే అది యనారోగ్యము నధికపఱచునదిగా నగుచుండెను. 'ఔషధము లక్కెఱ వలదు. 'శానిటోజన్' మాత్రము ఆహారముగ తీసికొనుచుండు' మని నంజుండరావుగారు చెప్పిరి. ఇంటికి వచ్చిన తొల్తటి దినములలో నది కొన్నాళ్లు తీసికొనసాగితిని.

ఒకనాఁడు రాత్రి భోజనానంతరము శానిటోజను పాలతో తీసికొన్న కొంతసేపటికే శరీరమున నరము లెల్ల క్రమము తప్పి యెక్కువగా బిట్టు బిగించి యాడించి విడిచిన ఫిడేలు, వీణతంత్రులవలె కదల్చితే కదలితే త్రుటితము లయి పోవునట్టదరుపాటుతో సంకటపెట్టసాగెను. మంచము మీఁదనుండి యదలించి ఎగురఁగొట్టి క్రింద పడవేయుచున్నట్టు శాఁజొచ్చెను. ఆ రాత్రి యెల్ల నిద్ర లేక చాల బాధపడితిని. శానిటోజను మాని వేసి చల్లని భోజనము చేయుచుంటిని. రాత్రులందు క్రమముగా కొంతసేపు నిద్ర పట్టసాగెను.

అప్పటికే రెన్నెల్లో మూన్నెల్లో కయికొన్న సెలవు ముగిసెను. దినదినము ఆంధ్రపత్రిక చదువుటలో నందు చదివిన యుద్ధతీవ్రతలు నన్నల్లకల్లోలపఱచుట చెలరేగుచునే యుండెను. అయినను మా వాళ్లలో కొందఱు జ్వరమా, తలనొప్పా, ఆకలి లేకపోవుటా, ఏ జబ్బు లేదు. పిఱికితనముతో ఇంటఁ గూర్చున్నాఁడని నిందించుట నాకు దుస్సహముగా నుండెను. మా తల్లిదండ్రులు, అక్కగారు, భార్య ఏమియు ననఁజాలక దుఃఖించుచుండిరి. సాహసించి నేనొక్కఁడనే మద్రాసు వెళ్లి డ్యూటిలో చేరుదును గాకని బండిమీఁద బందరు వచ్చితిని. ఒక మిత్రునింట నానాఁ డుంటిని. గురువులగు శ్రీ వెంకటశాస్త్రిగారిని దర్శించితిని. వారితో, వారికి నాకు మిత్రుఁడును, డిగ్రీలు లేకున్నను ఆంగ్లవైద్యము చేయుచు ప్రఖ్యాతుఁడుగా నున్నవాఁడును నగునొకవైద్యుని జూడ నరిగితిమి. ఆతఁడు నంజుండరావుగారి మందుల ప్రిస్క్రిప్షన్‌లు

చూచి 'ఇవి చాలా తేలిక డోసులో నున్నవి' యని వానిలో ప్రధానౌషధ మొకటే నరములకు బలము గొల్పు నని, అది యొక సీసా పుచ్చుకొ మ్మని చెప్పెను. అప్పుడే దానిని గొని కయికొని మద్రాసు వచ్చితిని.

అది పుచ్చుకొన నారంభించి డ్యూటిలో జాయిన్ అయితిని. రెండుపూటలకే అది యొడలెల్ల మంట లెత్తించి నిద్ర పట్టనీయక నరముల బిఱ్ఱు బిగించి యుదరి పడున ట్లెగురఁ గొట్ట సాగించెను. 'భ్రష్టస్య కా వా గతిః' అన్నట్లు అది మాని నజుండరావుగారిని మరలఁ జూడజాలక ఇంకెవరెవరి దగ్గఱనో మంచి డాక్టర్ల దగ్గఱనే మందులు గయికొన నారంభించితిని. అవి మఱి మఱీ గగ్గోలు పఱిచెను. తిరువలిక్కేణిలో నాకు పరిచితుఁ డగు నొక డాక్టరు 'ఫాస్ఫరస్' ప్రధానముగాఁ గలమాత్రలు పది యిచ్చి 'ఈ పదీ నిస్సంశయముగా కడముట్ట దినమునకు రెండు చొప్పున పుచ్చుకొని మఱీ యగపడు' మని చెప్పి పంపెను. మద్రాసులోని మా వారు పుచ్చుకొని తీరవలసిన దని నిర్బంధించిరి. పుచ్చుకొన నారంభించి నప్పటినుండియు నోరు తడియారిపోవుట, రేయుంబవళ్లు సలే నిద్ర లేక పోవుట, ఒడలెల్ల నెఱ్ఱబాఱి మంటలెత్తుట, కడుపులో, ప్రేగులలో మంటలు మఱీ యెక్కువగుట యయ్యెను.

---

## ౨౦
## ఔషధసన్యాసము

అప్పుడు మరల నంజుండరావుగారిని చూచితిని. ఆయన తిట్టి చీవాట్లు పెట్టి నీవు బ్రదుకఁదలచుకొనిన నిక నెవ్వరి యొద్దను మందులు పుచ్చుకొనక స్వాస్థ్యము కలుగుట కేండ్లపాటయినను నూరికి వెళ్లి యింటిదగ్గఱనే యుండి పొమ్మని నిర్బంధించెను. ఏవేవో మందు లిచ్చెను గాని యవి కూడ పని చేయలేదు. తలమీఁద పాము పొల నూడినట్లు తోలుపొడ లూడ సాగెను. స్వగ్రామమునకు వచ్చివేసితిని. చల్లగా ఆహారము గొనుచుండగా నుండగా కొన్ని నెలల కా మంటలు కొంత తగ్గినవి. తొట్టె స్నానములు చేయ నారంభించితిని. కొన్నాళ్లకది కొంత యుపకారకముగా నున్నట్లుండెను.

అప్పుడే నానోట 'ఔషధసన్యాస' మన్న పలుకు పదింబదిగా తోఁపసాగెను. ఇక చచ్చినా సరే! ఏమయినా సరే! మందులు పుచ్చుకోరాదు అన్నసంకల్పము ప్రబలముగా తోఁచసాగెను. తెలియని శరీరాంతర తంత్రములను సరిగా నెఱుఁగక ఔషధీగుణములు నందు ననేకౌషధుల మిశ్రమయిన మందుల గుణములు సరిగా తెలియక మఱియు ఔషధమాత్రానిర్ణయము సరిగా నెఱుఁగక వ్యాధి నిదానము సరిగా నెఱుఁగక యరకొఱయెఱుకతో గ్రుడ్డియెద్దు చేనఁ బడ్డట్టు సాగుచున్న భేషజతంత్రముతో నిఁక చిక్కు-

లందరా దని నిశ్చయించుకొంటిని. ఇంత వ్యాధి యున్నను దినములు, వారములు, నెలలు, ఏండ్లు నిద్ర లేక బాధ పడుచు సర్వవికారములతో నున్నను నా మనస్సుమాత్రము తార్మారు కాక, ప్రజ్ఞ చెడక, జ్ఞాపకశక్తి చెదరక సరిగానే ఉండెను. కాని స్థిరముగా కూర్చుండి అరగంట నే పయిన చదువుట మొదలయిన మనఃపరిశ్రమ చేయఁజాల కుంటిని. పదిదినముల కొకతూరి తీవ్రముగా ఆముదము తీసికొనుట, అప్పుడు పచ్చనిపిత్తద్రవము చాలఁగా అధోమార్గమున వెడలుట, నాలుగు మూఁడు రోజులు కొంత శాంతిగా నుండుట, మరల కడుపులో మంటలు, తాపము, నిద్రలేమి ఇత్యాదులు చెలరేగుటగా నుండెడిది. చల్లని చప్పని యాహారమే, తొట్టె స్నానమే నాకుఁ గొంత శాంతికరముగా నుండెడిది. ఆ తొట్టె స్నానములు చేయుట మూలమున ఆముదము పుచ్చుకొనుట క్రమముగా మానివేసితిని.

ప్రతిదినము ఆంధ్రపత్రిక చదువుచునే యుంటిని. యుద్ధవార్తలు తెలిసికొనుచునే యుంటిని. దానిని చదువకుండ నుండలేను. నేఁటికి నంతే. చదివియు నుండలేను. చదివినచో యుద్ధమారణము లనుభూయమానములుగా నుండెడివి. చదువకున్నచో యుద్ధమున నేమి జరగుచున్నదో తెలియదాయెగా యన్నవ్యథ కల్గెడిది. పగలు పండ్రెండు గంటలే కాక రాత్రి పండ్రెండు గంటలుకూడ నిర్వ్యాపారముగా మెలఁకువతో, వ్యాకులతతో నింటిలో కొండఱకేని యతృప్తితో నితరులు గుర్తింపరానంత తీవ్రవ్యాధితో

సంక్షోభపడు టాయెను. కొన్నిరాత్రులందు సన్నని తెర గప్పినట్లు నిద్రపోకుండెడి దేమో కాని యది చిటికవేసినను కనులు తెఱచునంత తేలికగా నుండెడిది. దానిం జూచి మా వారు కొందఱు నిద్ర కొంత ఉన్నదనుచుండిరి.

అప్పటి నా తలంపులలో నొక్కటి. ఏ పుణ్యాత్ముండేని 'నీ విట్టి పాపకర్మము చేయుటచే నీ వ్యాధి యేర్పడినది. క్లోరోఫారం ఇయ్యకుండ ఖడ్గముతో నీ కుడిచేతిని తస్సని నఱికి వేయుదును. దానికి సమ్మతింతు వేని, ఆ బాధ కోర్వంగల్గుదు వేని, తర్వాత నీ కుడిచేతి లేవడి కిష్టపడుదు వేని, చేతినఱుకు మానందగినన్నాళ్లకు నీ వ్యాధి కూడ మాన్పింతును. చేతి నఱుకువల్ల నీ కషాయము రాదు, అంతట నీ కర్మ తీరును' అన్నచో తక్షణమే అందుకు సిద్ధపడగలను అనుకొనుచుండెడి వాఁడను. అంత తీవ్ర మయినది నాబాధ. ఇట్లితరులతోను చెప్పుచుండువాఁడను. క్షణక్షణము మరణయాతనయే. 'దిన దిన గండము' అనుకొనువాఁడను. ఆ పై మాట 'వెయ్యేండ్లాయుస్సు' లోలో నెక్కడో తోచుచుటే కాని గుండెలలో వాక్యాకృతికి దానిని దెచ్చుటకు నోట నుచ్చరించుటకు దుఃఖించెడివాఁడను! దినదినగండముతో వేయేండ్లాయుస్సెందుకు? వేయేండ్లు కాదు. వేయిగంట లయినను నెందుకు? అని బౌద్ధమతమువారు చెప్పుకొను పలుకులు "సర్వం దుఃఖం దుఃఖమ్" "సర్వం క్షణికం క్షణికమ్" 'సర్వం స్వలక్షణం స్వలక్షణమ్' అనువాని యర్థము సదా అనుభూతి కందుచుండెడిది. ఆ పలుకు నాల్కమీఁద మెదలుచుండెడిది.

చిన్ననాఁటనుండియు భవభూతి యుత్తరరామచరిత్ర మన్న నాకు పరమానందము. అందులోని పలుకులు, 'జగజ్జీర్ణారణ్యమ్... కుకూలానాం రాశౌ తదను హృదయం పచ్యత ఇవ' అన్నవి సదా నా తలఁపులో మెదలుచుండెడివి. 'జగజ్జీర్ణారణ్యమ్' అనుటకు గొప్పవివరము కానవచ్చెడిది. అరణ్యమేని, అందు ఛాయా ఫల పుష్ప వృక్షములు, లతా గుల్మములు, జలాశ్రయములు, పక్షికలకలములు, దృశ్యజంతు విహారములు, మనుష్యసంచారములు నుండును. ముండ్ల పొదలు, వ్యాఘ్రాది ఘాతుక జంతువులు, సర్ప, వృశ్చిక, వృకాదులున్నను నుండును గాని పుష్పఫలాదులకై యందు ప్రవేశించువారు – కంటకాద్యపాకరణ సాధనములఁ గొని నిర పాయముగా కార్యము నిర్వర్తించుకొని రాఁగలరు. జీర్ణా రణ్యమున ఛాయాఫలపుష్పవృక్షము లుండవు. జలా శయము లుండవు. లతాగుల్మము లుండవు. ఎండుటడవి. రక్కెస మట్టలు, చీకిరేనుపొదలు, పాములు, తేళ్లు, తోడేళ్లు మొదలగునవి మాత్రమే ఉండును. కర్మవశమున త్రోవ తప్పి యెవఁడే నందుఁ జేరెనా వాఁడక్కడ కడతేరవలసిన వాఁడే యగును. జగత్తొక జీర్ణారణ్యముగా, దుర్విధిచే నే నందు చేరినట్టుగా భావించెడివాఁడను.

## ౨౧

# వెలుఁగునీడలు

భవభూతిపునరుక్తమయిన యీశావాస్యోపనిషద్వాక్యము "అసుర్యానామ తే లోకా అంధేన తమసావృతాః, తాం స్తే ప్రేత్యాభిగచ్ఛన్తి యే కే చాత్మహనో జనాః" అన్నది యాత్మహత్యా సంకల్పజ్వాలలను జల్లార్చి వేయుచుండెడిది. కడు పసిప్రాయమున కనులు మూసికొని బోరగిల పడుకొని చూచుచుండినపుడు నేను నే నని నాలో గోచరించిన మినుకు మినుకు గ్రుడ్డివెలుఁగే దూరమున గోచరించి జీవితాశోచ్ఛ్వాస మాడించుచుండెడిది.

మందులు మానితిని గనుక మావారు మంత్రముల కేసి దృష్టి సారించిరి. వారిని వీరిని పిలిపించి మంత్రజపము చేయింప నుద్దేశింపఁగా నేను వారింపఁ జొచ్చితిని. ఆ మంత్రప్రయోక్తల యోగ్యతలు నే నెఱిఁగినవే. కనుక వారిని బిలిపింప నొల్లనయితిని. నా యనారోగ్యమును న న్నడిగి విద్వాంసుఁడు గదా యని నేను చెప్పఁగా విని వేదశ్రౌత విద్యా విశారదుఁ డొకఁడు 'ఏఁబది రూపాయలు తెచ్చుకొని నా కిచ్చితివేని నీకు మోహిని పట్టినది. దానిని తొలఁగింపగలను' ఇత్యాదిగా నేదో చెప్పెను. ధిక్కని తెగడితిని. అనుదినము సహస్రగాయత్రీమంత్రజపము చేయుచు నమాయకుఁడుగా నుండువృద్ధబ్రాహ్మణు నొకని - ఆయన కుమారుఁడు మాయూర స్కూలుమేష్టరుగా కొన్నాళ్లుండెను - బిలి

పింప నుద్దేశింపఁగా నేను వల్లె యుంటిని. వారిని గ్రామాంతరము నుండి పిలిపించిరి. నలువది దినములు మంత్రజపమాయన జరపెను. ఆయనవల్ల నా కేమాత్రము మేలు జరుగబోదని నేను బిగ్గ పలుకుచుండెడివాఁడను. వీనికిఁ బట్టిన గ్రహచారమో, గ్రహమో ఉపకారకము లయిన పద్ధతులపై వీనికి విశ్వాసము కుదురనీయ కున్న దని మావారు తెగడఁ జొచ్చిరి. 'నిజమే! నా కిట్టివారి ప్రజ్ఞమీఁద విశ్వాసము లేదు. అదే నా జబ్బు అనుచున్నవారు మీరో వారో కదా దానిని గుదుర్చవలసిన వారు. నాకు విశ్వాసము కొల్పుఁడు' అనువాఁడను. నలువది నాళ్లయిన తర్వాత జపఫలము నాకు ధారాదత్తము చేయుటకు గొప్ప బ్రాహ్మణసంతర్పణము జరపిరి. వృథా ధనవ్యయ మని నేను వగవఁ జొచ్చితిని. ఇట్టి చీకాకు లెన్నో పడితిని. వేనివల్ల గాని నాకు మేలు జరగ లేదు. తొట్టెస్నానము, ఉప్పుకారములు లేనిభుక్తి ఒకమాదిరిగా చేయుచునే యుంటిని.

మద్రాసులో నా స్థానమున నియుక్తులైనవిద్వాంసులు హఠాత్తుగా అంతరించిరి. చలిజ్వరము నూటయాఱు డిగ్రీలపై చిలుకు వచ్చి ఆ తర్వాత ఔషధము నిరుపయోగము కాఁగా పుణ్యలోకముల కరిగిరఁట! మా ఆఫీసు క్యూరేటరు శ్రీ కుప్పుస్వామి శాస్త్రిగారు నాకు డి. ఓ. వ్రాసిరి. 'నీవు వచ్చి ఉద్యోగములో చేరుట మంచిది. నీకు తొందర కలుగకుండ దేశాటనము చేయ నేర్పాటు చేయుదును. రావలసినది' అని. ఆ వత్సరమున ఆంధ్రసాహిత్య

పరిషత్తు సంవత్సరోత్సవము గుంటూర జరగెను. నేను చాల గౌరవించు వేదము వెంకటరాయశాస్త్రిగారి యాధ్యక్ష్యము. మిత్రులు శ్రీ రామకృష్ణకవిగారు నన్ను మద్రాసు రాఁగోరి జాబు వ్రాసిరి. గుంటూరఁ గలసికొందు నని బదులు వ్రాసి యట్లే గుంటూరు వెళ్లితిని. నేను మాటాడినది, చేసినది ఏమియు లేదు. అయినను ఆయుపన్యాసము వినికిడికి, ఎండలకు తాళఁజాలక పోయితిని. మిత్రులు కనుపర్తి మార్కండేయ శర్మగారియింట విడిసి, తొట్టెస్నానము చేసి కొంత స్వాస్థ్యము కూర్చుకొంటిని.

మిత్రుల ప్రోద్బలమున మద్రాసు వెళ్ల నిశ్చయించుకొంటిని. ఇంటికి వెళ్లి తగిన యేర్పాట్లతో నే నొక్కఁడనే బయలుదేఱితిని. ఆప్తులు, బంధువులు మంగళగిరి నరసింహస్వామి దర్శనము చేసి పొమ్మని నిర్బంధించిరి. భక్తిభరితముగా సంకీర్తనముల పాడఁగల బ్రాహ్మణుఁ డొకఁడు నాతో వచ్చెను. మంగళగిరి వెళ్లితిమి. అక్కడ బాలాంబగా రను మహనీయురాలు మా కాతిథ్య మిచ్చెను. పానకము మొదలగు నైవేద్యములు చేయించితిమి పానక మారగింపు చేయించునప్పుడు వెండి కవచములో నున్నమూర్తితీరును గూర్చి నాకు యోచన. దానిని వెల్లడింపఁగా దైవపరీక్ష వలదని యక్కడివారు నాకు హిత ముపదేశించిరి. స్వామి కేదో చెల్లింపఁ దలఁచుకొంటిని గాని చెల్లింపలేదు. అది శ్రీ బాలాంబగారికి సమర్పింపఁ గోరిక. ఈయబోగా నప్పు డామెగారు 'మాయింట నాతిథ్యము గొని మీ రేదో యిప్పు

డిచ్చుట పూటకూళ్లయింట నిచ్చిన ట్లగును. తర్వాత మీరు మీ గంతవ్యస్థలము చేరి యేదేని పంపుదురు గా' కనిరి.

మద్రాసు చేరితిని. ఆఫీసు డ్యూటీలో ప్రవేశించితిని. అప్పుడు మిత్రులు కొంద ఱుండుటచే సముద్రతీరమున బక్కింగ్‌హామ్ లాడ్జిలో నుంటిని. జనార్దన్ అను పుణ్యాత్ముఁడు హోటలు ప్రొప్రైటరు నాకు మిత్రుఁడు. ఆతని హోటలులో భోజనము. డ్యూటిలో ప్రవేశించిన పదిరోజులకే అయిదురోజులు కాషుయల్ లీవు పెట్టితిని. రాత్రులందు నిద్ర రాదు. కడుపులో మంట. శరీరమున తాపము. తీవ్రమయిన యశాంతి. అప్పుడు నా బాల్యమిత్రము శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు కూడ నాతో నుండిరి. వారి తోడ్పాటుతో డాక్టరు లక్ష్మీపతిగారింటి కేగితిని. ఆయన సరిగా వ్యాధిని గుర్తించి కాని మందిచ్చువారు కారు. ఎక్కువగా మందులు వాడక ఆహారవిహారాదులచేతనే శక్యమయినంతవఱకు వ్యాధినివారణ చేయఁ జూతురు. ఆయన కూడ నాకు చిరమిత్రము. నా వ్యాధిచరిత్ర మంతయు విని నరముల యుద్రేకము తగ్గుట కేదో మందు (బ్రోమైడు) ఇచ్చిరి. అది పుచ్చుకొనఁగా ఒక రాత్రి నెమ్మదిగా నున్నది గాని మర్నాడు శరీర మంతయు పట్లు విడిపోయిన ట్లయి లేవ లేని స్థితికి వచ్చితిని. ఆ మందు మాని వేసితిని.

ఇక నౌకరీ దుష్కర మని నిశ్చయించుకొంటిని. అప్పటికే క్యూరేటరుగా రిఁక నీతఁడు సెలవు కోరినచో డిస్మిస్ చేసి యింటికిఁ బొమ్మనవలసినదే అని రెణ్ణాళ్లకు ముందటి

సెలవు చీటిమీఁద వ్రాసిరి. వారందఱు నెంతో యోర్మితో నన్ను నెలకొల్పుకొనఁ జూచిరి. లాభము తోఁపదయ్యెను. నాకును దిక్కు దోఁపదయ్యెను. బలవంతమున శరీరమును, నరముల శక్తిని ఎగసన ద్రోసికొని స్నానము చేసి హోటలుకు వెళ్లితిని. నేఁటితో నౌకరికి నీళ్లు దోడుకొనవలసినదే! ఇట్టి స్థితితో ఇంటికి మరల వెళ్లుట బ్రదికియుండియుఁ జచ్చుట యగును. చేత నున్నసొమ్ముతో హరిద్వారమునకు టిక్కెట్టు తీసికొని (టిక్కెట్టుకే చాలినంత ధన మున్నది కాన) మార్గమున నుపవాసమే చేసి ఏదేని యాహార మెవ్వరి వలననేని యయాచితముగా లభించిన నారగించి మహాప్రస్థానకల్పముగాఁ బోయి గంగానదీ ప్రవాహములోఁ గలయుదునుగా కని నిశ్చయించుకొంటిని. ఆత్మహత్య యసుర్యనరకప్రాపక మన్న చింత రేగెఁ గాని పాండవాదుల మహాప్రస్థానము పాపాపాదకముగాఁ గాక పాపాపనోదకముగాఁ జెప్పబడుట గోచరించి సమాధి గూర్చెను.

క్యూరేటరుగారు డిస్మిస్ చేయునందాఁక నెందుకు? నేనే రిజిగ్నేషన్ చీటి పంపుదునుగా కని నిర్ణయించుకొని అట్టి చీటి వ్రాసి చేత నుంచుకొంటిని. తొమ్మిదిన్నర గంటలకు భోజనము చేసి నౌకరి చెల్లు చీటిని నాతోపాటు నౌకరిలో చేరినవాఁడు, నా యనారోగ్యమునకు నాకంటె దుఃఖించుచుండువాఁడు నగుగుమాస్తా యింటికి వెళ్లి యిచ్చివేయ నిశ్చయించుకొంటిని. హోటలుకు భోజనమునకు బోఁగా జనార్దనుఁడు జబ్బుగా నుంటి నని నాకై ప్రత్యేకముగా

కారము లేకుండ చాల రుచ్యముగా కూరలు, పచ్చళ్లు చేయించెను. అతఁడు మామూలుగానే చేయించె నేమో కాని నాకు మాత్రము నాఁటి భోజనము కొన్ని యేండ్లకు పూర్వ మెప్పుడయిన చేసియుందునో లేదో అన్నంత రుచ్యముగా నుండెను. కడుపార నారగించితిని. శరీరమున కుత్సాహము తోఁచెను. నరముల బలము చక్కబడిన ట్లయ్యెను. 'నేఁ డాఫీసుకు పోయి పని చేయఁగల్గుదునా? జబ్బు కుదురునా? నేఁ డీ యుత్సాహ మేమి? ఏమో! డ్యూటిలో నుండఁజాలను. హరిద్వారము వెళ్లవలసినదే! గంగలోఁ గలయుట మాట అక్కడ నిర్ణయించుకొందును గాక!' ఇత్యాది విధముల యోచనలతో అక్బరు సాహెబు వీధిలో వచ్చుచుంటిని.

---

## ౨౨

## వెలుఁగుబాట

రోడ్డుమీఁద అబ్బూరి జగన్నాథరావుగారను మిత్రుఁడగపడి నా చేయి పట్టుకొని 'మీరు ప్రభాకరశాస్త్రిగారేనా! ఇట్టుంటిరేమి!' అని యడిగెను. మూఁడేళ్లనుండి జబ్బుగా నుంటి నంటిని. ఏమి జబ్బు అనుచు నాతఁడు నన్నింటిలోనికిఁ గొనిపోయెను. శూన్యహృదయముతో నేను లోని కరిగితిని. అక్కడ శ్రీ గురుజాడ అప్పారావుగారి ద్వారా నాకు మిత్రు లయినవారు, అప్పారావుగారి బంధువు, మూఁడేండ్లకు ముందు అప్పుడప్పుడు నన్ను లైబ్రరీలోని యోగశాస్త్ర గ్రంథములగూర్చి యడుగుచుండువారు నగు శ్రీ పోతరాజు నరసింహము. ఎం. ఏ., ప్రెసిడెన్సి కాలేజి ఫిలాసఫీప్రొఫెసరు అగపడిరి. వారి ప్రశ్నపై సూక్ష్మముగా నా యనారోగ్యము తెల్పితిని. వారి భావమఱఁది యగు జగన్నాథరావు నన్ను 'మా భావగారు చేరినయోగగోష్ఠిలో చేరిన మీ యనారోగ్యము తొలఁగి పోఁగలదు గదా! ఏల చేరరాదు?' అనిరి. నరసింహముగారు 'ధ్రువనాడి' యను గ్రంథముఁ లైబ్రరీలోఁ గలదా యని ప్రశ్నింపసాగిరి. వారు చేరినయోగగోష్ఠిని గూర్చి, ధ్రువనాడిని గూర్చి నేను వారిని ప్రశ్నించితిని. నా జాతకము ధ్రువనాడిలో నుండునా యని యడిగితిని. వారు గంపెడువిషయములు చెప్పిరి. నన్ను వెంటనే కుంభకోణము వెళ్లి యోగగోష్ఠిలో చేరఁగోరిరి. వెళ్లుటకు సమ్మతించుచో జాబు వ్రాసి యిత్తు ననిరి.

హరిద్వారము గాక ఆరోగ్యద్వారము చేరఁబోవుచున్నట్లయ్యెను. 'నేను' అను నాబాహ్యప్రజ్ఞలో దిరిగినట్లును, దానికి నొకబాట పాయలిచ్చి యేర్పడుచున్నట్లును దోఁచెను. ఎడమ ప్రక్కనుండి తేలి తేలి చెడుగు పోవుచున్నట్లును, కుడిప్రక్క నుండి దూఁటి దూఁటి గుణ మేదో లోలో కుదుర్కొనుచున్నట్లును, రెండింటికి నడుమ నొకబాట యరటాకుసీనవలె సాగుచున్నట్లును దలఁపఁజొచ్చితిని. ఒకప్రక్క ఆఫీసుకు వెళ్లవలసిన తొందర. ఆసమయమున మా లైబ్రేరియనుకు మిత్రుఁడు, మానరసింహముగారికి మిత్రుఁడు నొక్కఁ డక్కడ నుండి నాగోడెల్ల విని 'రెండురోజులు సెల విప్పించుటకు నేను లైబ్రేరియన్‌తో చెప్పి యేర్పాటు చేసెదను. నీవు కుంభకోణము వెళ్లుము' అని క్రొత్తగా లీవుచీటి వ్రాయించి పుచ్చుకొని వెళ్లెను.

నేను సాయంకాలము రైలు పయనమునకు సన్నద్ధుఁడ నయితిని. నరసింహముగారు జాబు వ్రాసి యిచ్చిరి. రాత్రి యేడుగంటలకే నేను ఎగ్మూరుస్టేషనుకు వెళ్లితిని. అక్కడ మా లైబ్రరి యరవపండితుఁ డుండెను. అతఁడు నన్నుఁ జూచి చెయి పట్టుకొని 'నేఁడు ఆఫీసుకు రాక అయ్యో! ఇదియేమి? ఇక్కడ నగపడితిరి! ఎక్కడికి పోవుట ? మీయింట చేర్చెదను. రండు. మతిస్వాస్థ్యము తప్పి యిట్లగుచుంటిరా యేమి ?' యని పలవించెను. నేను దుఃఖించితిని. అతఁడు నాకడ నంతదాఁక చాల నడకువతో వర్తిల్లుచుండినవాఁడు. దయనీయముగా నున్నా

యప్పటిస్థితికి వగచి యట్లనెను. నేను చెప్పితిని. 'నాకు మనసు చెడలేదు. ఆరోగ్యముకై వెళ్లుచున్నాను. రెన్నాళ్ళలో మరల రాఁగలను. కంగారు పడవద్దు. నామీఁదియాదరమే మీచే నిట్లు పలికించినది. ఎఱుఁగుదును. వెఱవవలదు. లైబ్రేరియన్‌తో నే నిట్లు వెళ్లుచుండుట తెల్పుఁడు' అని. ఆతఁడు టిక్కెట్టు కొని తెచ్చిపెట్టి రైలెక్కుదాఁక నాతో ముచ్చటించుచుండెను.

---

## దివ్యదర్శనము

రైలు సాగెను. రైలువేగమును మించి నామనోవేగ ముండెను. మర్నాడుదయము ఎనిమిది గంటలకు కుంభకోణము స్టేషనులో దిగితిని. కాలకృత్యములు తీర్చుకొని మంచి మామిడిపండ్లు కొనుకొని నరసింహముగా రిచ్చినయడ్రెసుకు బండిమీఁద వెడలితిని. బండివాఁడాయింటిని బాగుగా నెఱిఁగినవాఁడు. త్రోవలో నాతఁడు అక్కడి గురుదేవుల ఘనతను వర్ణింప దొడఁగఁగా తదాకర్ణనోత్సాహముతో నే నంతలోనే చేరవలసినచోటికిఁ జేరితిని.

ఒక సన్న్యాసి కాషాయధారి రోడ్డుమీఁద బండి నిలువగానే చేరవచ్చి నా తెలుఁగుతీరు గుర్తించి 'యెవరు నాయనా నీవు? ఎక్కడనుండి రాక? ఎందుకోసము?' అని తిన్నని తెలుఁగు పలుకుబడితో ప్రశ్నించెను. నన్నాలింగనము చేసికొని బండి దించెను. ఆయన యాదుకొని నన్ను బండి దించినప్పటిపరితోషము నే నెన్నటికి మఱువఁజాలను. నాచేతి పండ్లబుట్ట పుచ్చుకొని వడిగా లోని కరిగి నావిషయములు శ్రీవారి కెఱింగించి నన్ను దర్శనమునకుఁ దోడ్కొని పోయెను.

లావు గాక సన్నము గాక, పొట్టి గాక మఱీ పొడుగు గాక నిమ్మపంటిచాయతో అరుణోదయకాంతులు కడలొత్తుచున్న శ్రీవారిని జూడగానే నాయొడలు పులక

నారలు కట్టుచీర, అశనంబులు కాయగసుళ్లు, కొండలుం
గాఱడవుల్ నివాసములు గాఁ దపియించి మహర్షు లెవ్వరిం
జేరుకొనం దలంచిరల చిన్మయతత్త్వము సర్వమానవో
ద్ధారము గోరికొన్నయవతారము సద్గురుమూర్తిఁ గొల్చెదన్!

C.V.V

రించెను. కేలుదోయి మోడ్చి నమస్కరించి జాబు సమర్పించు కొంటిని. చదివి, నవ్వి 'స్నానాదికము గావించి విశ్రాంతి గొను' మనిరి.

నాకు శ్రీవారిదర్శనము చేయించిన ఆస్వాములవారు నన్ను స్వజనముగా నాఁడే కాక వారు జీవించియున్నంతదాఁక ప్రేమించుచుండిరి. వారిపేరు సచ్చిదానందేంద్రసరస్వతీస్వామి. అప్పటికిఁ గొన్నేండ్లకు ముందు వారు బందరులో సన్న్యసించిరి. బ్రహ్మణ్యులు జంధ్యాల గౌరీనాథశాస్త్రిగారు వారి కుద్యోగమునుండి పెన్షను ఇప్పించి యాశ్రమ మిప్పించి రఁట! ఆకారణమున వారికి కృష్ణామండలమువా రన్న నధి కాదరము. వారిజన్మదేశము కాంచీమండలము. తెలుఁగు బ్రాహ్మణులు. సన్న్యసానంతరము వారు మహనీయు లని ప్రఖ్యాతి గన్నస్వాములవార్లను గొందఱను వెన్నడించి విసుగు గొని శాంతి లేక తిరుగాడుచు శ్రీవారిమహనీయతను విని వారికడకు వచ్చి ఆజీవితము అక్కడనే నెలకొనిపోయిరి. శ్రీకృష్ణునకు సాత్యకివోలె వారు శ్రీవారికి సదానువర్తనులై యుండిరి.

నే నప్పటికి తొట్టిస్నానము సరిగా చేయకున్నను కారము లేని, తిరుగబోత లేని కూరలతోనే భోజనము చేయు చుంటిని. శ్రీవారితో నాస్థితిని విన్నవింపఁగా 'ఇఁక నీయారోగ్య రక్షణభారము నేను వహించితిని. వెలవక నలువురితో పాటుగా మామూలు భోజనము చేయవచ్చును. దానివల్ల నీ కేమి చెఱువు రాదు'అనిరి. ఆవాలతెట్టె తేలుచున్నచాఱుతో,

నూనె తిరుగబోతకూరలతో నే నానాఁడు భోజనము చేసితిని. అంతకుముం దట్టి భోజనము చేసినచో కడుపులో మంట. నిద్ర రాదు. అశాంతి అధిక మయ్యెడిది. స్వాములవారు కంటిని రెప్పవలె నన్నుఁ గాచియుండి నాయనారోగ్యాదివిషయములు విచారింపసాగిరి. అన్నియుఁ జెప్పితిని. మర్నాటిరాత్రివఱకే నే నక్కడ నుండ వీలగుట తెల్పితిని.

## ఉపదేశము

* నాఁటిసాయంకాలము ఆఱుగంటలకు నాకు శ్రీవారి శిష్యతానుగ్రహము లభించెను. శిష్యతానుగ్రహము పడయుటకు సమకూర్చుకోవలసినవాని నన్నింటిని స్వాములవారి తోడ్పాటుతో సమకూర్చుకొంటిని. ఉపదేశవిధాన మెల్ల స్వాములవారు సూచించిరి. శ్రీవారికి సాష్టాంగముగా నమస్కరించి నాయభ్యర్థనము నివేదించుకొంటిని. ఉపదేశము చేసిరి. వెంటనే 'నీవు హాలులోనికి వెళ్లి ప్రేతాసనమున శయనించి, నమస్కరించి, ఉపదిష్టము నొక్కమారే యుచ్చరించి, కనులు మూసికొని, శరీరము లోతట్టున నేమేని జరుగును గనుక దానిని గుర్తించుచుండుము. మనస్సు బహిర్ముఖమై యెక్కడికేని పోయినచో పోనిమ్ము. నీవై యరికట్టవలదు. అదే తిరిగి రాఁగలదు. ఏమి జరుగునో సాక్షిమాత్రుఁడవై పరికింపఁదలంపు గొనుము. అంతే నీవు చేయవలసినది. కొన్నినిమిషములదాఁక కనులు తెఱవ ప్రయత్నింపకుము. ప్రయత్నించినను తెఱవ

* యోగములో చేరిన తేది 22-6-1916. మీఁడియము సంఖ్య 880.

వీలుపడదు. మరల మూసికొనియే పోవును. శరీరములో నప్పుడు జరగవలసిన దెల్ల జరగగానే కన్నులు తెఱపి యగును. అటుపై కనులు మూసికొని పండుకొనుట కష్టమని పించును. అందాఁక కనులు తెఱవను, లేవను కష్టమని పించును' అని స్వాములవారు దగ్గఱనుండి తెలియఁజెప్పిరి. అట్లే ఉపదిష్టము నొక్కమారే సార్థకముగా స్మరించి యుచ్చరించి కనులు మూసికొని పండుకొంటిని.

## ౨౮

## అనుభూతి

తోడ్తో నాలో నేదో గొప్పప్రజ్ఞ ప్రవేశించి యూగించి వైచుచున్నట్లు గోచరింపఁదొడగెను. ఉత్సాహవినోదములతో దానినే పరిశీలింపఁ దొడగితిని. 'ప్రజ్ఞ' యనియో 'శక్తి' యనియో ఇంకేమనియో నిర్దేశింపఁదగిన యపూర్వానుభూతి ప్రవేశము నాలో విజృంభింపఁ దొడఁగెను. అది యెక్కడ నారంభించినది, ఏమి జరపుచున్నది యని వెదకఁ దొడగితిని. అది శరీరచర్మము లోతట్టు దాఁక వ్యాపించుచున్నట్టు తొలుత నెక్కడ నుపక్రమించినదో గుర్తుపట్ట సాధ్యము కానట్టుండెను. శరీరములో నేదో గొప్పక్రొత్తఇంజన్ పని చేయుచున్న ట్లయ్యెను. నామన స్సానందోత్సాహములతో నలలు వాఱు చుండెను.

కొంతసేపటికి నెడమచేయి నావశము తప్పి నాసమ్మతి లేకయే పైకి లేచుచుండుట, కుడిచేయి కదలుచు బాహు మూలమున చాల బాధ గొల్పుచుండుట తెలియ నయ్యెను. అంతకంతకు కుడిబాహుమూలపు బాధ యధికము కాఁజొచ్చెను. సంకటపడ సాగితిని. అప్పటి కించుమించుగా పదునైదు నిమిషములకాలము గడచియుండును. స్వాములవారు నన్ను సంకటపడుచున్నా వేమని ప్రశ్నించిరి. కనులు తెఱవ వీలు పడక పోవుటచే మూసికొనియే బాహుమూలమున చాల బాధగా నుండుట తెల్పితిని. మఱికొన్ని నిమిషములకు కనులు

తెలిపి యుయ్యెను. శరీరమున సంచలనము తగ్గెను. అంతట మరల నమస్కరించి లేవవలసినదిగా దగ్గఱనే ఉన్న స్వాముల వారు తెల్పిరి. లేచితిని. నాచేతికి (డిస్లొకేషన్) బండినుండి పడుటవల్ల బాహుమూలాస్థిస్థానము తప్పి చాల సంకటపడుట తెల్పితిని.

వా రది యాబాహుస్థితి సరి యయినస్థానమునఁ జేర్చుటకై జరగుచున్న ప్రయత్న మనియు, బాహుమూలమున కాయస్వాస్థ్యము లేకున్నచో కుడిచేయి కూడ పైకి లేచి నమస్కారము చేసెడి దనియు, ధ్యానావసానమున వాని యంతట నవిగా రెండుచేతులు లేచి నమస్కరించుట యీ యోగవిధానమున నపూర్వాద్భుతానుభూతి యనియు, నట్లు కూడుట యోగశక్తి చేకూడుట కొక చిహ్న మనియు తెల్పిరి. జరగినవిషయమును శ్రీ గురుదేవులకు నివేదింప వలసిన దనిరి. నేను శ్రీవారి సన్నిధి కరిగి జరగిన దంతయుఁ దెల్పికొంటిని. వారు చిఱునవ్వు మోమున వెలార్చి తనివితో నుండు మని యాదేశించిరి.

అట్లు ధ్యానము జరగిన తర్వాత నొక్క గంటసేపటికే నా దక్షిణహస్తమూలము చాల వాచి బాధ గొల్పెను. టక్కు టక్కు టక్కు మనుచు ఱెక్కగూటిలో నేదో కదలిక శబ్దము వినవచ్చుచుండెను. వాపు, బాధ ఎంత యెక్కువగా నున్నను నా కది యాహ్లాదమునే కొల్పసాగెను. మూఁడు నాల్గేండ్లనుండి యీ చేతితో సరిగా పనులు చేయఁజాలక బాధ పడుచుంటిని. ఆ నాఁడు చేతి యెముకను క్లోరోఫార

మిచ్చి సరిదిద్దిన డాక్టరు తర్వాత కొన్నాళ్లదాఁక నా చేతిని మెలిపెట్టి నలిపి చెఱపి ధనాశతో నన్నుఁ జాల పీడించినాఁడు గాన యది చక్కబడకే యుండెను. ఆ జబ్బ గూటికండలు గజిబిజి యయి పోయెను. అవి యెల్ల నిప్పుడు చక్కబడు చున్నవి గాఁ బోలు నన్నసంతోషము నా కా చావుబాధను సుసహాపఱిచెను. నా చేతివాపును జూచి యక్కడి వా 'రది యేదో రెక్టిఫికేషన్ జరగుచున్నది. వెఱవకు' మని తోడు పలుకసాగిరి. ఎన్నేండ్లనుండియో నిద్రలేక కొట్టుకాడుచుండు వాఁడను. నే నా నాఁటిరాత్రి కొంత హాయిగా నిద్రపోయితిని.

మర్నా డుదయమున లేచి కాలకృత్యములు దీర్చుకొని యోగానుభూతికి సిద్ధముగా నుంటిని. పూర్వదినపు సాయంకాలమున నా యూరిలోనివా రనేకులు యోగసాధనమునకు వచ్చిరి. వా రెల్ల నా యుదయమునను వచ్చి యుండిరి. పూర్వదినము సాయంకాలమున జరగినట్లు నాకు నాఁ డుదయమున జరగెను. అప్పు డక్కడ నున్నవారిలో రాధాకృష్ణపిళ్ల యని, మహదేవయ్యరు అని యిద్దఱు ప్రధానశిష్యు లుండిరి. వారు నా విషయమును శ్రీవారికి విన్నవించిరి. అప్పుడు నా విషయము 'టెస్టు' తీయవలసినదిగా వారు వారి కాజ్ఞాపించిరి.

ఆ విచిత్రవిషయ మెట్టిదో యానాఁడే నేను దొలుత తెలిసికొంటిని. నన్ను దగ్గఱ కూర్చుండు మనిరి. రాధాకృష్ణపిళ్లగారు గురుదేవులకు నమస్కరించి కనులు మూసికొని యొక నిమిష మాఁగి ఇంగ్లీషుతో గ్రంథము పఠించుచున్న

ట్టేదో చెప్పసాగిరి. మహాదేవయ్యగారు దానిని వడివడిగా వ్రాయసాగిరి. ఇద్దఱును యఫ్. యే చదివినవారు. ప్రజ్ఞాశాలులు. పిళ్లగారు వడిగానే చెప్పసాగిరి. అయ్యరు గారు వడిగా వ్రాయసాగిరి. ఉదయము సరిగా తొమ్మిది గంటల పదునేడు నిమిషముల వేళ కది వ్రాయ నారంభించిరి. పిళ్లగారు కనులు మూసికొన్నప్పుడు అంతరదృష్టికి కనుపడినవి, అంతరశ్రుతికి వినబడినవి చెప్పఁ దొడఁగిరి. అప్పుడు నా శరీరాంతర్భాగమునఁ గలస్వాస్థ్యాస్వాస్థ్యములు, నా మనోభావములు, నా యనారోగ్య కారణములు, తన్నివారణోపాయములు, అప్పటికి జరగిన పూర్వ జన్మములు మొదలగునవి కలవు. అది యెల్ల ముగిసిన పిదప దానిని శ్రీ వారి చెంతకుఁ గొనిపోయి వినిపించిరి. వారి సమ్మతిమీఁద దానిని రికార్డు చేసిరి. ఆ కాలమున యోగాభ్యాసమునకు వచ్చి శిష్యతను బొందువారి కందఱకు నట్టి టెస్టు తీయుట జరగుచుండెడిది. నన్నుఁ గూర్చి వచ్చిన రికార్డును కాపి కోరితిని. శ్రీవారి సమ్మతితో దానిని నా కిచ్చిరి. అది నా దగ్గఱ నున్నది.

---

## ౨౭

## దివ్యబోధ

ఆ నాఁటిరాత్రి మెయిలులో నేను తిరిగి మద్రాసు వచ్చివేయవలసి యున్నది. కాన నా విషయమునుగూర్చి శ్రీవారితో సంభాషించుటకు నడను కోరితిని. నా యభ్యర్థనమును మహాదేవయ్యగారు శ్రీవారికి నివేదించిరి. భోజనానంతరము సంభాషింప శ్రీవారనుమతించిరి. అప్పుడు వారు యోగవిషయములనుగూర్చి వారి యర్ధాంగిద్వారా యేవేవో యపూర్వాంశములను సేకరించుచుండిరి. భోజనానంతరమున నేఁ జేర నరిగి సాష్టాంగనమస్కారము చేసి యిట్లు విన్నవించుకొంటిని. 'మూఁడేండ్లనుండి యమబాధ పడుచున్నాను. నిద్ర లేదు. శాంతి లేదు. ఆకలి, జీర్ణించుకొను శక్తి సరిగా లేవు. ఇక్కడికి రాక తలఁపునకు నందఁబోవు ననఁగా నా యెఱుకకు దెలియకుండనే సరిగా భోజనము చేయ గల్గితిని. మీ యోగమాహాత్మ్యమును శ్రీ నరసింహాము గారి ద్వారా విన్నంతనే నాలో నేదో దివ్య సౌఖ్య సాధమునకు బాట గోచరించుచున్నట్లయినది. ప్రశాంతముగా రాఁగలిగితిని. రైలులో కొంత నిద్ర పట్టినది. ఇక్కడికి వచ్చి కడచిన రాత్రి సుఖముగా నిద్రించితిని. నూనె తిరుగబోత, ఆవాలు, సాంబారు, రసము, పల్చని మజ్జిగ యివి నా కింతకు ముందు కడుపులో మంటలు గొల్పెడివి. ఇప్పు డవి వికటింప లేదు. మీరు నిర్భయముగా అందఱితో పాటు భుజింపవచ్చు

ననఁగా నట్లు చేసితిని. పూర్వము తీవ్ర మయినమందులు పుచ్చుకొంటిని. తదాది కడుపు ఉడికి పోవుచున్న ట్టుండును. నేఁ డది లేదు. 'శరీర మాద్యం ఖలు ధర్మసాధనం' అని, 'బ్రదికి ఉంటే బలుసాకు ఏఱుకొని తినవచ్చు' నని ఉన్నది గాన నే నిక్కడ మీ సేవకుఁడనుగానే యుండఁ గోరుచున్నాను. ఇక్కడనుండియే జీవిక నేదేని సమకూర్చుకొందును. అను గ్రహింపు' డంటిని.

వారు నీ కిప్పుడు 'జీత మెంత?' అని యడిగిరి. ఏఁబది రూపాయ లంటిని. 'దీనితో నీవు నీ కుటుంబమును పోషించుకోవచ్చును. ఉన్నజీవికను మానుకొని యిక్కడ నుండ నేల?

బండి నడచుచుండఁగానే రిపేరు సాగవలెను. బండి ఊడఁదీసి చేయుచో బండివాని జీవిక చెడును. అట్టిది నా యోగమార్గము. సాగుచున్నప్రవృత్తికి భంగము కలుగ రాదు. ఇది నివృత్తిమార్గము కాదు. రాజయోగమార్గము. గార్హస్థ్యము ఉండవలెను. సన్న్యాసి కారాదు. సౌఖ్య ముండవలెను. ఆహారాదులు సరిగా ససిగా కయికొనుచుండ వలెను.

ఇట్టిచో నీవు నీ యుద్యోగమున నుండు టావశ్యకము. నీ యుద్యోగము నీ జీవికకే కాక లోకమునకుఁ గూడ నుప కారకము. ఆరోగ్యవంతుఁడవై నీ యుద్యోగమున నుండి తిన్నగా సాగించుకొనుచుండుము. నీ విక్కడ నుండఁ గోరుట

నా సన్నిధిలాభము కొఱకే గదా! నేను సదా నీలో నుందును. నీకు వలసిన సహాయము నీలోనుండి జరపుచునే యుందును. ఇక్కడ నీకే తీరున శరీరమున సంస్కారము జరుగుట గుర్తుకు వచ్చెనో, ఆ తీరుననే యెక్కడ నున్నను అనుభూతి గుర్తుకు రాఁగలదు. ఉదయము జరపిన యోగసాధనము శరీరమున సాయంకాలముదాఁక పని చేయుచునే యుండును. ఎప్పుడెప్పు డెంతెంత జరగవలెనో అంతంత జరగును.

నీలోని సంస్కారము జరపునది ప్రజ్ఞాకలిత మయిన చైతన్యము గాని జడశక్తి కాదు. అది యెలక్ట్రిసిటీవలె పని చేయునది గాదు. ఎలక్ట్రిసిటీ హద్దు దాటి అక్రమముగా నుపయోగించినచో కీడు తేఁగలదు. నీలో నిప్పుడు క్రొత్తగా ప్రవేశించినప్రజ్ఞ నీ వధికముగా నుపయోగించుకోఁ గోరినను అది యట్లు పనిచేయదు. ఎంత చేయవలెనో అంతే చేయును. కావలె నన్నను నీ వావశ్యకత కెక్కువగా కనులు మూసికొని యుండఁజాలవు. లోపల నావశ్యక మయిన పని జరగుచుండఁగా కనులు తెఱవను జాలవు. ఏదేని యాకస్మికముగా కార్యాంతరము కలుగుటో, ఎవరేని వచ్చి పలుకరించుటో జరిగినను అప్పుడు విక్షేపము జరగు నని వెఱవనక్కఱ లేదు. 'ఇట్లు తొందర కలిగినది. దాని ననుభవింపవలసియున్నది' అని ప్రార్థనాపూర్వకముగా నంతరాత్మకు విన్నవించుకొని యా కార్యము ముగించుకొనవచ్చును. అది ముగిసినంతనే జరగవలసినయోగసాధన జరగఁగలదు.

ప్రయాణములో, రైలులో, బండిలో, నడకలో ఇంకేమేని వ్యవహారములలో వర్తిల్లవలసి వచ్చినప్పుడు సరి యయిన వేళ తప్పిపోకుండ ఒక క్షణమాత్రము మనసున స్మరించినఁ జాలును. కార్యాంతరములు తీఱి విశ్రాంతి దొరకి నప్పుడు జరగవలసినసాధన మెల్ల జరగఁగలదు.

వివేకమును సత్యమును ధర్మమును గుర్తించుకొనుచు నంతరాత్మ నారాధించుచు లోలోఁ జొచ్చుకొలఁదిని నీకు వల సినయుద్బోధములు లభింపఁగలవు. అట్టి యుద్బోధములను నీవు నీలో నెక్కడనుండి యెట్లు పడయుచుంటివో క్రమక్రమ ముగా తెలిసికొనఁగలవు. ముందు నీ దృష్టి ఆరోగ్యలాభ మున ప్రసరించుచున్నది. అది లేక నీ వేమి గాని పడయఁ జాలవు. ముందు నీ కారోగ్యమే. తర్వాతనే యోగసాధన ఫలము దొరకఁ గలదు. గాఢముగా విశ్వసించితివేని, నీకు యోగఫలము లభింపఁగల దని నే ననుట లేదు. నీ కా విశ్వా సమును గొల్పవలసినవాఁడను నేనే. నీవు పరమార్థకుతూహ లిగా నుండినఁ జాలును. యోగసాధనము నాకలి గొన్న రిత్తకడుపుతో నుండి చేయరాదు. ఏదే నాహారము గొన్న పిదపనే చేయవలెను. మద్రాసులో నీ యోగమార్గమున నడచుచున్నమిత్రులు పలువు రున్నారు. తఱచుగా వారిని గలసికొనుచుండుము. వీలు కలిగినప్పు డిక్కడికి వచ్చుచుం డుము. ప్రధానముగా డిసెంబరు తుదివారమునను, మే తుది వారమునను ఇక్కడ గోష్ఠి జరగును. అప్పుడు తప్పక రమ్ము.

అనిరి. నా కనులవెంట ధారలుగా నీరు కారెను. ఈ శ్లోకము రచించితిని.

'దుర్వ్యాధిభిస్సన్నే శరణం ప్రపన్నే
మయి ప్రసాదా దయి మాస్మ ఖైషీః
త్రాతా హ మస్మీతి దదా వభీతిం
య స్తం గురుం మస్తకతో నమామి'

ఇట్టి సంభాషణతో నైదారు నిమిషములు గడచెను.

ఆ దినములలో వారు ముఖ్య మయినతత్త్వార్థములను సహస్రారము, పిట్యూటరీ, అక్కడి దివ్య శక్తులు, వాని ప్రసారము మొదలగు వానినిగూర్చి శిష్యులకు బోధించుట, దివ్యదృష్టితో వానిని ముఖ్యశిష్యులు పరికించున ట్లనుగ్రహించుట, ఇంక నందలి విషయవిశేషములను మాతృశ్రీ ద్వారా తా మపూర్వముగా సేకరించుట జరగుచుండెను. కాన నా కంతకంటె నధికముగా, ప్రత్యేకముగా వారితో సంభాషింప ననువుపడ దయ్యెను.

## ౨౬

## చేకూడుట

మరల సంజవేళ కక్కడివారు శిష్యులు పలువురు విచ్చేసిరి. భగవద్ఘట్ట మనుపేరి కావేరీతీరఘట్టముననే శ్రీ వారి సన్నివేశమున కెదురుగా వెలయుచున్న యోగశాలలో ఎల్లరును గూడి యోగసాధన చేయుట జరగుచుండెను. చాలగా వాచి యున్న నాచేయి నాఁటి సంజ ప్రార్థనమున నెంతో చక్కబడెను. వాపు తీపు తగ్గెను. నాలో లోలోపల నెక్కడో చిఱువెల్గు గోచరించు చున్నట్లును దానికి నేను జేరబోవుచున్నట్లును స్వప్నప్రాయముగా లీలగాఁ గొంత గోచరింపఁ దొడగెను. శరీరమున బ్యాటరీ పెట్టి నరముల నెల్ల నూగించి వేసినట్లు గొప్ప యూపు కలిగెను. చేతులు వాని యంతట నవియే లేచి నమస్కరించెను. కాని కుడిచేత నింకను బాధ గోచరించుచుండెను. టక్కు టక్కుమని జబ్బయెముకయదరు తెలియుచుండెను.

శరీరమున నింత తీవ్రసంచలన మేమిటి? ఇది యెక్కడనుండి యారంభమై జరగుచున్నది? ఇంతదాఁక నెన్ని శ్లోకములో, ఎన్ని మంత్రములో, ఎన్ని ధ్యానములో, ఎన్ని క్షేత్రములో, ఎన్ని దేవతాదర్శనములో, ఎందఱ యాశ్రయములో జరపితిని గాని యట్టి విశేష మెక్కడ గాని యెప్పుడు గాని జరగుట యెఱుఁగనైతినే! ఒకతూరి ప్రార్థనమాత్రముచే నింత జరగుట యేమిది? అస్తి నాస్తి విచికిత్సాస్పదముగా నున్న

పరతత్త్వము అస్తి యని స్పష్టముగా ననుభవింప నగుచున్న ట్లున్న దే! దీని లోఁ తేదో తెలిసికొనవలెను గదా! త్రోవ దొరకినది గదా! నా ప్రార్థనమును లోన నెవరో విను చున్నట్లు - సమాధానము చెప్పుచున్నట్లు - అనుగ్రహించు చున్నట్లు అగుచున్న దేమి వింత? నా జబ్బు నాకు చాల ఉపకారమే చేసెనా యేమి? ఇక నా జబ్బు కుదిరినట్టే తోఁచు చున్న దే! ఏమి యానందము! ఏమియు లేకున్నచో నాచేయి యింత వాచుటేమి? నావశము తప్పి చేతులు లేచి నమస్క-రించు టేమి? చే కూడుట యేమి? 'చేకూడుట' అన్నపదము కల్పించినవా రెవరు? ఈ రెండు చేతులు లేచి కలసి నమస్క-రించుటను సూచించునదిగా నేర్పడినదా యేమి చేకూడు, కైకూడు పదకల్పనము? నే నారోగ్యవంతుఁడ నగుచో మా వా రెంత సంతోషింతురు! మా వారి నందఱను నిందుఁ జేర్పఁ గల్గుదునా యేమి? ఇత్యాది భావము లాధ్యానసమయ మున మెఱపులు మెఱసినట్లు నాలోఁ జెలరేగ సాగెను. ఆనాఁటిస్థితి నా కొక జన్మ మబ్బిన ట్లుండెను. ధ్యానావసాన సమయమున నా యుత్సాహ మక్కడి మిత్రులకుఁ దెలిపితిని. అక్కడివారు వారి వారి యనుభూతివిశేషములఁ గొన్నింటిఁ జెప్పిరి.

# ౧౭

## శ్రీ మాస్టరుగారు

అప్పుడు శ్రీవారిజీవితచరిత్రము తెలిసికొనఁగోరి యక్కడి వారి నడిగితిని. పూర్వ మెప్పుడో శ్రీకృష్ణదేవరాయల పాలన కాలమునఁ గాఁబోలు తెలుఁగుదేశముననుండి తంజావూరి రాజ్యసంరక్షణకై విచ్చేసినవారిలో వీరిపూర్వులు ముఖ్యులనియు, కుంభకోణమున భగవద్ఘట్టమునఁ జాలయిండ్లు వీరి పూర్వులవే యనియు, వీరిపూర్వు లొకరు కావేరీతీరమున కుంభకోణముననే భక్తిపురి యనునగ్రహారము వెలయించి రనియు, వీరు బాల్యమున చాల ఐశ్వర్యవంతు లనియు, నప్పటికిని జాలినంతసంపత్తి కలవారే అనియు, ఇంటిపేరు కంచుపాటివా రనియు, శ్రీవెంకాస్వామిగా రని శ్రీవారినామధేయ మనియుఁ దెలిసికొంటిని. అప్పుడు వారికి సంస్కృతము తెలియునా యని యడిగితిని. సాంఖ్య యోగ వేదాంతాది శాస్త్రములు సంస్కృతముననే కలవు గాన యాసంస్కృతము రాక యాయాశాస్త్రవిషయములు తెలియఁగా దన్న తలఁపుతో నే నట్లడుగుట. వారికి సంస్కృతము రా దనియు చిన్ననాఁ డాయాశాస్త్రాంశముల నాంగ్లభాషతోఁ జదివి వాని సారార్థ మెల్ల గ్రహించి రనియు, సంప్రదాయముతో శాస్త్రములఁ జదివినవారికంటె నెంతో యపూర్వార్థము లెఱుఁగుదు రనియు, నతిలోకానుభూతు లెన్నో యనుభవించి రనియు, శాస్త్రపండితులతోడివారినిగా వీరిని దలఁపరా దనియు, క్రమ

ముగా నెల్లవిషయములు నీకే తెలియఁగల వనియు నక్కడి వారు చెప్పిరి.

ఇంగ్లీషుభాషలో నుపదేశార్థము లుండు టేమి? పవిత్ర మయినసంస్కృతము కలదు గదా! అది రాక యిట్లు చేయుటా? శ్రీవారు మహనీయు లగుట దర్శనమాత్రము చేతనే యెఱుక కందుచున్నది. నిజమే కాని వారికి మీస ముండు టేమి? ప్రాచీనమహనీయుల సంప్రదాయమునకు విరుద్ధము గదా! యని నాలో నేవేవో కొంతసేపు చీకాకులు కూడ కలిగినవి. కొంతసేపటికి వాని కన్నింటికిని సమాధానములును తోఁచినవి. తర్వాత గొన్నాళ్ళకు విచారింపఁగా నాసమాధానములను శ్రీవారే పలుతూరులు చెప్పుచుండినట్లు తెలియవచ్చెను—

'యస్య నాస్తి స్వయం ప్రజ్ఞా శాస్త్రం తస్య కరోతి కిమ్
లోచనాభ్యాం విహీనస్య దర్పణః కిం కరిష్యతి'

అన్నట్లు స్వయంప్రజ్ఞ కలవారే శాస్త్రనిర్మాతలు. అట్టివారికి ప్రాచీనశాస్త్రాదిపఠనము తమప్రజ్ఞకుఁ గలయపూర్వతను గుర్తించుట కుపయోగపడును గాని ప్రజ్ఞోద్బోధము స్వయము సమకూడవలసిన దే. ప్రాచీనశాస్త్రములు దానికి జనకములు కాఁజాలవు.

"శాస్త్రాణాం విషయ స్తావ ద్యావ న్మందరసా జనాః
ప్రవృత్తే రసశాస్త్రే తు న చ శాస్త్రం న చ క్రమః"
"త మేవ ధీరో విజ్ఞాయ ప్రజ్ఞాం కుర్వీత బ్రాహ్మణః
నానుధ్యాయా ద్బహూ ఞ్ఛబ్దా న్వాచో విగ్లాపనం హి తత్"
"విహాయ శాస్త్రజాలాని య త్సత్యం త దుపాస్యతామ్"

ఇత్యాదిసూక్తులు స్ఫురణకు వచ్చి భాషలో నే మున్నది? విషయము గదా ప్రధాన మయినది! ఏభాష యయిన నేమి? అందును జాతిమతదేశాదికృత మయిన పరిచ్ఛేదము లేకుండ సర్వసమానముగా సాగవలసినయిట్టి మహత్తరయోగపద్ధతికి - నేఁడు ప్రపంచవ్యాపకముగా నున్న యాంగ్లభాషయే సరిపడి యుండు నేమో! మఱియును సంస్కృతమున కట్టిపూజ్యత మహర్షులు తమయుద్బోధముల నందే వెలయించుటచేతను, ప్రాచీనతత్త్వశాస్త్రము లందే పెంపొందుటచేతను, ఉపనిషత్తులును, వేదములును నందే యుండుటచేతను వచ్చినది - అట్టివానిని నిపుడును వెలయింపఁ గలవా రుందురో వారు వాని నేభాషలో వెలయింతురో యాభాషకు నట్టిపూజ్యత తప్పక కలుగఁగలదు. ఆంగ్లభాషకుఁ గూడ నట్టియోగ్యత కల దని యంగీకరింపక తప్పదు. నేఁ డెందరో మహనీయు లాభాషద్వారమున ననేకాపూర్వ శాస్త్రార్థములు వెలయించుచున్నారు. దీనిని పరిగణింపక త్రోసి పుచ్చుట సాధ్యము కాదు. కనుక శ్రీవారి యోగోపదేశ భాషాదు లాంగ్లమున నుండుట కొఱఁత గాదు.

మఱియు వారియాకృతిమహనీయతకు మీసము లుంచుకొనుట, మొగమున బొట్టు పెట్టుకొనకుండుట కొఱఁత పఱుపఁ జాలవు. శైవవైష్ణవాది మతభేదములను బాటించు వారు గారు గాన వారు మొగమున తన్మతచిహ్నముల ధరింప కుండవచ్చును. వారు నెలకొల్పినది మహారాజయోగము గాన దీనికి బోడితల కాషాయవస్త్రములు మొదలగునవి యుండ

నక్కఱలేదు. మోసము లుండుట లేకపోవుటలో న్యూనాధికత లుండవు. ఈసమాధానములు తోఁచి నామనసులోని యప్పటి మకిలను దొలఁగించినవి.

కొంతకాల మయినతర్వాత నేను మరల కుంభకోణము వెళ్లి యుండఁగా శ్రీవారే నే నడుగకుండనే యీవిషయమును గూర్చి యిట్లనిరి. 'నాకు శిష్యులుగా నుండువా రెవరు గాని లోకమునకు విడ్డూరముగా తోఁచదగిన వేషభాషలతో నుండుట బాగు గాదు. నలుగురతోపాటుగానే యుండవలెను. ఈయోగమున నెవఁడు గాని ప్రత్యేకముగా కడతేరఁజాలఁడు. తాను, తనచుట్టుపట్టులవారు, తన యాప్తులు ననుక్రమమున ప్రేమ వ్యాపక మగుతీరు ననుసరించి తాను, తనచుట్టుపట్టులవారు,తనయాప్తులుననుక్రమముగా లోకము నంతను ప్రేమించి లోకము నంతను గడతేర్చువాఁడు కావలె. తనప్రేమ సర్వలోకవ్యాపకము కానంతవఱకు నెవ్వఁడు గాని కడతేరఁజాలఁడు. అఖండము, సర్వవ్యాపకము నగుతత్త్వమును బడయుటకు తాను నఖండుఁడు, సర్వవ్యాపకుఁడు కాక తప్పదు. దేశకులజాతిమతాది పరిచ్ఛేదములతో వేఱుపడి పోయి సర్వప్రజతో సామరస్యము కుదుర్చుకోలేనివాఁడు సంసారబంధమున కొట్టుకాడవలసినవాఁడే! బహిర్ముఖముగా సాగుచున్న బహుత్వమును సాగనిచ్చుచునే అంతర్ముఖముగాఁ దిరిగి అం దేకత్వమును గుర్తించి వర్తించుట యీయోగసాధనమున కొకఫలితము. మనపరిపూర్ణత భవిష్యత్తులో నున్నది గాని భూతము

కాలేదు. కనుక భూత మనుపీఠికపై నెలకొని భవిష్యత్తున పరమార్థ మనుభవింపవలసి యున్నది'.

శ్రీవారి దివ్యప్రజ్ఞలలో నొక్కటి యిది. ఎవ్వరు గాని లో నేదేని సందేహమో, వ్యాకులపాటో చెందుచు సన్నిధికి వచ్చినప్పుడు వారి నడుగకే, వా రడుగకే వింతగా దానికి సమాధానము యాదృచ్ఛికసంభాషణసందర్భమున వెల్లడించుట - ఒండె-ఆసమాధానము నడిగి తెలిసికొనఁ గోరి వారిసన్నిధికి వచ్చునంతలో నాపృచ్ఛకుల తీరులోనే యా సమాధాన మాప్రస్తుల కెఱుకపడకుండనో, అంతలోనే యెఱుక కందుచునో శ్రీవారు నోరెత్త నావశ్యకత లేకుండనే బాహిరపఱుట—

ఒకచిన్నదృష్టాంతము. ఇంజనీయరింగ్ డిపార్టుమెంటులో ఉద్యోగిగా నున్నయొక శిష్యుని ఢిల్లీలో హెచ్చుజీతముతో నుద్యోగించుటకు సమ్మతింతువా యని పైయధికారు లడిగిరి. నాఁటిసాయంకాలపు టపాలో దానికి బదులు వ్రాసి పంప వలెను. దీని నడిగి తెలిసికొనుటకే ఉదయ మాతఁడు మద్రాసునుండి వచ్చి వెంటనే తనవిషయమును శ్రీవారికి విన్నవించెను. 'సరే! టపావేళలోగా యోచించి బదులు చెప్పుదు' ననిరి. సాయంకాలము టపావేళ దాటిపో వచ్చినది. శ్రీవా రాతనిఁ బిలిచి బదులేమి గాని చెప్పరయిరి.

ఆతనియోచనలు తీవ్రముగా రేగెను. అనుకూల ప్రతికూలపక్షముల యుక్తులు గుప్పుగుప్పు మని లోనుండి వెల్వడఁ జొచ్చెను. త్రాసున తూపగా 'వెళ్లవలదు' అన్న

పక్షము బరు వెక్కువ గలదిగా గానవచ్చెను ఆత్రపాటుతో నదే సమాధానము జాబులో వ్రాసెను. 'శ్రీవారు బదులు పలుకరైరి గదా! ఇక నాలసింపరాదు. కనుక దీనినే పోస్టు చేయుదు' నని యాతఁడు యోగశాలనుండి బయల్వెడలెను.

శ్రీవారు తమయింటివాకిట నుండిరి. రమ్మని కనుసైగ చేసిరి. చేరఁబోగా 'చేతిలో ఏమిటది?' అనిరి. ఆతఁడు 'బదులు వ్రాసితిని. అనుకూలప్రతికూలపక్షములు యోచించి చర్చింపఁగా ప్రతికూలపక్షము బలవంతముగా తోఁచెను. తామేమి సెలవిచ్చిన నట్లు చేసెదను. టపావేళ దాటుచున్నది. కాన నాకు తోఁచినది వ్రాసితిని. తద్విరుద్ధముగా మీరు సెలవిచ్చిన నట్లు వెంటనే చేసెదను' అనెను. 'ఈజాబే పోస్టులో వేసి రమ్ము' అనిరి. ఆతఁడట్లే చేసెను.

తర్వాత సమయాంతరమున నిట్లు చెప్పిరి. 'మీ కేవి గాని సందేహములు తోఁచినచో తోఁచినవానికి బదుళ్లు యోచింపక వెంటనే వాని నట్లే నాకు వ్రాయుటో, అడుగుటో చేయవలదు. మీచేత నయినంతవఱకు వానిసమాధానములను మీరే కనుగొన యత్నింపుఁడు. ఎంతకును సమాధానము దొరకనివానినే నన్నడుగుఁడు. న్యాయమైన, సంగతమైన ప్రశ్న మెవరికి గాని తోఁచినచో, నాప్రశ్నపుఘనత ననుసరించి దానికి తగినంతయత్నము చేసినచో సరి యయిన సమాధానము దొరకఁగలదు. ఆయత్నము బహిర్ముఖ మగు ప్రాచీనగ్రంథాదులవల్ల తనకు విజ్ఞులుగా తోఁచునాప్తులవల్ల తెలియఁదగిన దగును. అంతర్ముఖ మగుచో ఆత్మోద్బోధ

రూపక మగును. ఈయోగ మట్టియాత్మోద్బోధమును గొల్పుటకే.

బహిర్ముఖముగా సమాధానము తెలియఁగోరుచో, 'అనంతశాస్త్రం బహువేదితవ్యం' ఆయాశాస్త్రములును, దత్కర్తలును బహుభేదములవారు. అం దెవరిది గ్రాహ్యమో తేల్చవలసినది మరల నాత్మోద్బోధమే. ఘట్టకుటీప్రభాత న్యాయమున నెల్లరు నెట్లు గాని యాత్మోద్బోధముల ననువర్తింపవలసినవారే, అనువర్తించువారే కాక తప్పదు. బహిర్ముఖముగా లభించువిజ్ఞానమును దోడు చేసికొని యాత్మోద్బోధముల నందుకొనఁ గల్గినచో పరమార్థముల సులువుగాఁ బడయ వీలుపడును.'

ఆ నాఁటి సాయంకాలమునకు నా చేతి వాపు చాల తగ్గినది. యోగసాధనానంతరము రామజపమువలె కొంత డడవు తదేకానుధ్యానము చేయఁ బూనితిని. ఒడలెల్ల మంట లెత్తిన ట్లయ్యెను. అది శ్రీవారితో చెప్పితిని. నియతసమయములలో తక్క నితరసమయములలో నా యనుష్ఠానము చేయరా దనియు, ఏదేని యావశ్యకత కల్గినచో నప్పుడొక క్షణము స్మరించినంత మాత్రమున దానికి జరగఁదగిన సౌకర్యము జరుగు ననియు, తదేకపారాయణ చేయుటకు పరతత్త్వము చెవిటిగా దనియు, నోటిమాటను చెవి విన్నట్టే మీ యభ్యర్థనముల నది వినఁగల దనియు, ఒకతూరి ప్రార్థించినంతనే సర్వసిద్ధముగా ననుగ్రహింపఁగా నది చూచుచుండగా మరల మరల నడుగు టేల యనియు ననిరి. టెలిఫోనులో ఒక

తూరి పిలువగా నవతలివారు సిద్ధముగా బదులు పలుకుచుండగా దానిని వినక యూరక పిలుపులే పిలుచువాని తీరువంటిది పదింబదిగా స్మరించుచుండుట యనిరి. ఈ యుపదేశపు యాథార్థ్య మటుతర్వాత పరసహస్రపర్యాయములు నాకును నా మిత్రులకును ననుభూతి కందినది.

1925 వ సం॥ ప్రాంతముల నొకమిత్రుఁడు నిరంతరము శ్రీవారిస్మరణమే రామనామజపమువలె జరపుట సాగించెను. కొన్నాళ్లకు శరీర మెల్ల నగ్నిజ్వాలవలె నయ్యెను. నిద్రలో నరములు బిగించినట్లయి త్రుళ్లిపడుట, క్రమముగా నిద్ర పట్టకుండుట యేర్పడెను. బంధువులు పలువైద్యములు చేయించిరి. రోగముసే మాన్పించిరి. ఏమియు లాభము లే దయ్యెను. జరపిన తప్పిదమునకు పశ్చాత్తాపము నెంది క్షమింప ప్రార్థించి సక్రమముగా నడచుకొన సాగించిన తరు వాత నారోగ్యము చక్కబడెను. ఆ మిత్రుఁడు నేఁడును క్షేమముగా యోగసాధనము చేయుచున్నాఁడు. అనధికార ముగా, అక్రమముగా సాధనములు సాగించిన వా రింక నెందఱో పశ్చాత్తప్తు లయి బాగుపడవలసినవా రైరి.

## ౨౮

# నవజీవనము

నాఁటి రాత్రి శ్రీవారి నిదేశముచొప్పున మద్రాసుకు హాయిగానే బయలుదేరితిని. కుంభకోణమున నుండి మాయవరము దాఁక రైలులో వచ్చితిని. పలువు రక్కడ దిగుచుండిరి. నేనును ఆ స్టేషనులో దిగి అక్కడ చాలసేపు రైలాగును గాన ప్లాట్‌ఫారంమీఁద కొంతదడవు నిటు నటు తడవాడితిని. రై లెక్కితిని. అది బయలుదేరెను. నేను తలుపు దగ్గరనే నిలుచుంటిని. నన్నెవరో బయటికి పడఁద్రోయుచున్నట్లయ్యెను. మరల తొంటిరీతి కంపము, నిరుత్సాహము తోఁచెను. తోడ్తో రైలు ద్వారము దగ్గఱ నున్న నాకు హరిద్వారము తలఁపునకు వచ్చెను. పాడుతలఁపు క్రిందికి దూకుదునా యనియుఁ దోఁచెను.

అల్లంతలో నన్నెవరో వెనుకకు నెట్టుచున్నట్లయ్యెను. ఇది నాలో జరుగుచున్న సదసద్వివాదముగా గోచరించెను. పూర్వముకంటె నిప్పుడు గొప్పజ్వాల లోపల వెలుఁగుచున్నట్లయ్యెను. పూర్వ మెక్కడో మిణుకు మిణుకుమను నాశాజ్యోతి యుండెడిది. నే నీ సంకల్ప వికల్పములతో నిటు నటు నూగుచుండగా లోఁ గూర్చున్న సహృదయుఁడొకఁడు భగవదావిష్టునట్లు తనప్రక్క చోటు చూపుచు 'అయ్యా తలుపు తెఱచి యున్నది. క్రింద పడగలరు! ఇటు వచ్చి కూర్చుండుఁడు' అనెను. వెంటనే వెళ్లి కూర్చుంటిని.

ఆతఁడు లేచి నాకు మఱీ చోటిచ్చెను. 'నేను తర్వాతి స్టేష నులో దిగిపోవుదును గాన యిఁక కూర్చుండను. మీరు సుఖ ముగా కూర్చుండుఁడు' అని నన్నుఁ గూర్చుండ బెట్టి తానే తలుపువేసి తలుపు దగ్గఱ నిలుచుండెను. ఆ న్నట్లు రక్షించిన వారు గురుదేవులే యగుట, వారి ప్రజ్ఞాంశము నాలో నుండుట కాలక్రమమున స్పష్టముగా గుర్తింప నయ్యెను.

మద్రాసుచేరుదాఁక నే నున్నచోటనుండి కదలక రైలు కంటె ముందుకు దూకుచున్న తలఁపుల వేగముతో నిద్రమేలఁ కువలతో శాంత్యశాంతులతో మద్రాసు వచ్చితిని. వెంటనే మిత్రులను గలసికొని జరిగిన సందర్భము లెల్లఁ దెలిపితిని. అవి వేసగి సెలవుల నాళ్లు గాన మా భావ, తోబుట్టులు మా గ్రామమునకు వెళ్లియుండిరి. మరల జనా ర్దనుని హోటలులో భోజనము చేయుచు ఆఫీసుకు వెళ్లి పని చేయ సాగితిని. ఆఫీసులో అందఱు నా యనారోగ్యము నెఱిఁగి యుండినమిత్రులే కాన నా కట్టె తొందర కలిగింప కుండిరి. నాఁటి దాఁక నా యనారోగ్యమునుగూర్చి వంత చెందుచు నే నెక్కువ కాలము జీవింపఁ బో ననుకొనుచున్న నా మిత్రుఁ డొకఁడు, ఆఫీసులో ఉద్యోగి కలరా వచ్చి యుదాటుగా చనిపోయి నాకు చాల చింతఁ గొల్పెను. సాయంకాల మయిదు గంటలదాఁకఁ బని చేసి బడలి యింటికి వచ్చి సాయంకాలానుష్ఠానమున బడలిక తొలఁగి మరల నుత్సాహినై రాత్రి గడపి ఉదయోపాసనమున మఱింత తేఱి ఆఫీసుకు వెళ్లుచు దినక్రమమున నారోగ్య

వృద్ధి బడయఁ జొచ్చితిని. దినదినము నరసింహము గారి యింటికి వెళ్లి వారితోఁ గలసి యుపాసనము జరపుచుంటిని.

ఆ నాళ్లలో మద్రాసులో శేషయ్యంగా రను నొక వైష్ణవుఁడు తంజావూరుజిల్లా వాస్తవ్యుఁడు 'ధ్రువనాడి' యను సంస్కృతగ్రంథమునుండి యనేకుల జాతకముల చదువు చుండెను. ఆ యాచార్యుఁడు తొలుత చాల ననారోగ్య గ్రస్తుఁడుగా నుండి శ్రీవారి శిష్యుఁడై కుంభకోణమున వసించి యారోగ్యవృద్ధి చెందెను. కాన మా గోష్ఠిలోని వాఁ డయ్యెను. ఆయన శ్రీవారి జాతకమును, మా గోష్ఠిలోని వా రయిన యితరుల జాతకములను జదువుచుండెను. కొంత తద్వైచిత్రి కనుకొనుచు వింత చెందుచుంటిని.

పదిరోజులు గడచి నేను గొంత తేరుకోఁగా నన్ను కృష్ణా జిల్లాలో గ్రంథార్జనమునకుఁ బొమ్మని మా పైయధి కారి శ్రీకుప్పుస్వామి శాస్త్రిగారు నామీఁది యనురాగము తోనే యాజ్ఞ యిచ్చిరి. వెంటనే నేనును, శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారును వెడలితిమి. కృష్ణ కాల్వల క్రొత్త నీటి స్నానపానములు మా కిద్దఱకును సరిపడలేదు. బందరు నుండి రోడ్డు సైడు కెనాల్ నీటిలో పడవమీఁద చల్లపల్లి వచ్చితిమి. కవిగారికి వేచిన జీడిపప్పన్న చాల ప్రీతి. బంద రులో నది మంచిది దొరకును గాన వారు దాని నధికముగా గొని తెచ్చిరి. పడవలో కబుర్లు చెప్పుకొనుచు నిద్దఱము దానిని తింటిమి. నేను మితముగా, వా రమితముగా! ఆ రాత్రి కవి గారికి వాంతులు, విరేచనములు, జ్వరము. కలరా అనుకొం

టిమి. సత్రములో నుంటిమి. ఆ రాత్రి యా సత్రములో మా బంధువు లొకరు మాకు సర్వోపచారములు చేసిరి. ఉదయము బజారులో టర్పంటైను, బ్రాంది మొదలగు నౌషధద్రవములకుఁ బోగా వర్తకు లెవ్వరు నియ్యరైరి. రామకృష్ణకవి గారు 'ఎం. ఏ' మద్రాసునుండి గ్రంథార్జనమునకై రాజా గారిని దర్శించుటకై వచ్చుట, వారితో నేను నుండుట యిత్యాదికము వెల్లడి యయ్యెను.

ఆ యూరికి వచ్చు పెద్దమనుష్యులకు, ఉద్యోగులకు వలసిన పదార్థములు రాజాగారే యియ్యవలెను గాని కోమట్లియ్యఁ గూడ దని యనుశాసనము. కవిగారు 'కాళ్లీడ్చుకొని పోవుచున్నవి. జీవితము నిల్చునట్లులేదు. కలరా గాంబోలును. బ్రాంది కావలెను. కాళ్లకు టర్పెంటైను రాయవలె' నందురు. అవి దొరకలేదు. రాజాగారిని దర్శింప మధ్యాహ్నము గాని వీలుపడలేదు. రాజాగారు భోజనానంతరము నిద్ర లేచిన తర్వాత నేఁ బంపినవార్త వారికిఁ దెలుప నవుపడెను. వలసినవానిని వారు పంపిరి. అప్పటికే కవిగారికి మా బంధువుల యుపచారములచే గుణముగా నున్నది. మందు లక్కఱ లేకే పోయెను. ఈ వార్త ఆఱుమైళ్లదూరమున నున్న మా గ్రామమునకు తెలియగా, మా తండ్రిగారు పంపగా మా పినతండ్రిగారు బండిలో మమ్ము తోడ్కొని పోయిరి.

చల్లపల్లిలోనే కవిగారి యుపచారములలో మునిఁగి యుండుట, వారితో నేను జీడిపప్పు తిని నీరు త్రాగి యుండుట

కారణములుగా తల తిరుగుట, వాంతులు, జ్వరము నాకు నారంభించెను. ఇంటికి చేరునప్పటికి నాకు 100 డిగ్రీల జ్వర మున్నది. నేను మందుఁ గొన ననుచుంటిని. కుంభకోణము టెల్లిగ్రాం ఇయ్యఁగోరితిని. వెంటనే మా వా రట్లు చేసిరి. కాని యది వారి కందుట నాఁటి రాత్రి యగునో, మర్నాడగునో, చాల తీవ్రజ్వరము గాన మందిచ్చి తీరవలసినదే యని నాకుఁ జాటుగా మా తల్లిదండ్రులు, నన్నగారు చర్చించుకొనుచుండిరి. అది వింటిని. పిల్చి యడిగితిని. 'మందు గొనవలసినదే' యనిరి. అంగీకరించితిని. సాయంకాలము ఆఱుగంటలవేళకు మం దిచ్చిరి. అప్పుడే ఆకాశముననుండి దభీలన క్రిందఁ బడుచున్నట్టు లయి యొడలెల్ల చెమ్మటనీరు చిమ్మఁ దొడఁగెను. పది నిమిషములలో జ్వర మెల్ల తగ్గెను. 'మం దిచ్చితిమి. తోడనే తగ్గెను' అని మావా రనుకొనిరి. 'ఇచ్చిన టెల్లిగ్రాం శ్రీ వారికి చేరినది. ట్రీట్మెంటు జరగి యుండును. తోడనే తగ్గినది' యని నేను దనిసితిని. మర్నాడు తేటగానే యుంటిని. మందు గొనుచుంటిని. మూఁడవనాఁడు మరల జ్వరము వచ్చెను. నాఁడు కుంభకోణమునుండి జాబు వచ్చెను. 'జ్వరము తగ్గియుండును. మందుగూడ పుచ్చుకొనవచ్చును' అని. మందు పుచ్చుకొనుటకు ధైర్యము వచ్చెను. పుచ్చుకొనుచుంటిని. సెలవు లేదు. శ్రీరామకృష్ణ కవిగారును జ్వరము మరల మరల వచ్చుచు తంటాలు గొల్పుచుండుటచే సెలవు తీసికొని మద్రాసుకు వెళ్లిపోయిరి.

నేను చిరకాలము సెలవులో నుండి డ్యూటీలో చేరి మరల సెలవు గొనుట దుఃఖకరముగా తోఁచుటచే నేమి చేయను జాలక చిక్కు పడుచుంటిని. ఇంటిదగ్గఱ నుండ నిష్టము లేదు. జ్వరము వచ్చుచునే యుండుటచే నూళ్ల వెంట నొంటరిగాఁ దిరుగఁజాలను. ఇట్టి యిక్కట్టులో నింటికి వచ్చిన వారము రోజులలోనే నాకు ఆఫీసునుండి టెల్లిగ్రాం వచ్చెను. 'తత్క్షణమే నీవు తంజావూరి లైబ్రరీ పరిశీలనమునకు వెళ్లవలసినది. అక్కడ చేరి పని చేయవలసినది' అని. అలిగి తన్నితే పఱుపుమీఁద పడ్డట్టు, రొట్టె విఱిగి నేతిమీఁద పడ్డట్టు నాకు పరమోత్సాహకర మయినది.

తోడ్తో బయలుదేరి మద్రాసు వచ్చి ఆఫీసుకు వెళ్లి లైబ్రేరియన్‌తో మాట్లాడి మద్రాసులో నాగక కుంభకోణమునకే వెళ్లిపోయితిని. అప్పటికి మాతోబుట్టువు కుటుంబము మద్రాసులో నుండెను. మాతమ్ముఁడు చి॥ చంద్రశేఖరము అక్కడ హైస్కూలులో చదువుచుండెను. వాని కక్కడ టైఫాయిడ్ జ్వరము వచ్చెను. శ్రీవారికి జాబు వ్రాసితిని. మద్రాసులో వారిశిష్యుఁడుగా నున్నమన్మిత్రు నొకని ట్రీట్ చేయవలసినదిగా జాబు వ్రాసిరి. ఆతఁడు వచ్చి ట్రీట్ చేసి యీజ్వరము తగ్గినతర్వాత నీకుఱ్ఱవానికి శ్రీవారిశిష్యత లభింపఁ జేయవలసిన దనియు, దానివల్ల నీతఁడు కొఱఁతలు దొలఁగి యారోగ్యము పడయఁగలఁ డనియు దివ్యదృష్టికి గోచరించిన దానిని దెలిపెను. నెలా పదిరోజులు జ్వరము వానిని బాధించి విడిచెను.

కుంభకోణమున శ్రీవారిని దర్శించి నాకథ యెల్లఁ జెప్పి కొంటిని. శ్రీవారు నన్ను ప్రతివారము సెలవుదినమున తంజావూరినుండి కుంభకోణము వచ్చుచుండు మనిరి. ఆకాలమున రైలుఛార్జీ అర్ధరూపాయ లోపుగా నుండెను. అట్లే చేయు చుంటిని. తంజావూరిలో నాకు త్యాగరాజయ్య రనుమిత్రుఁ డేర్పడెను. ఆయన శ్రీవారి శిష్యుఁడు. ఇరువురమును గలసి ప్రార్థనము చేసికొనుచుంటిమి. జ్వరము తగ్గి యారోగ్యవంతుఁ డయినమాత్రమ్మునఁడు వదినగారిని దోడ్కొని కుంభకోణమునకు వచ్చెను. వానిని శ్రీవారిశిష్యునిఁ గావించితిని.

చల్లపల్లిలో ఆరంభించినచలిజ్వరము ఎడనెడ నాకు వచ్చుచునే యుండెను. శరీరము చాల చిక్కిపోఁ జొచ్చెను. నేను కుంభకోణము వెళ్లినతోడనే తీవ్రముగా జ్వరము వచ్చెడిది. మజ్జిగ అన్నమే తినఁగల్గెడివాఁడను. రాత్రి ఒకటి రెండు గంటలవేళ తీవ్రముగా ఆకలి యయ్యెడిది. అప్పుడు ముందుగానే నాకై జాగ్రత్తపడి సచ్చిదానందస్వాములవారు ఊరుగాయ, మజ్జిగఅన్నము ఎత్తి దాచియుంచెడివారు ఆక లయినపుడు వారిని లేపి యది తిని నీరు ద్రావి నిద్రపోయెడి వాఁడను. ఉదయము జ్వరముతోనే తంజావూరికి వచ్చెడి వాఁడను-వచ్చినకొంతసేపటికి జ్వరము తగ్గిపోయెడిది. వారము రోజులు నెమ్మదిగా ఆఫీసుపని చేయఁగల్గెడువాఁడను. నాతో రామకృష్ణకవిగారు వగైరా లుండిరి. వారు మద్రాసు వెళ్లి నప్పుడు శ్రీకుప్పుస్వామిశాస్త్రిగారితో నే నేదో కుంభకోణము వెళ్లి యోగసాధన చేయుచుంటి ననియు, అక్కడికి వెళ్లిన

తోడనే జ్వరపడి జ్వరముతోనే ప్రతివారము వచ్చుచుండు ననియు చెప్పిరి. వారు కుపితు లయి యుండిరి.

1916 క్రిస్మస్ సెలవులు వచ్చినవి. నే నా సెలవురోజులలో కుంభకోణముననే శ్రీవారిసన్నిధి నుంటిని. 30 తేది దాఁక నాకు జ్వరమే. 31వ తేది నాకు విరేచనము లెడతెగకుండ కాఁజొచ్చినవి. నల్వది యేఁబది తూరు లయ్యెను. సగ్గుబియ్యపు జావను మిత్రులు మహాదేవయ్యగారు తెచ్చి యిచ్చిరి. త్రాగితిని గాని కదల శక్తి లేదు. నాఁ డుదయము నేను వెళ్లి తీరవలెను. శ్రీవారి కీయసందర్భము తెలిసెను. రామచంద్రయ్యరుగారు అనుముఖ్యశిష్యునిఁ బిలిచి ప్రభాకరునికి విగర్ సల్లై యగుటకు ట్రీట్చేయు మనిరి. ఆతఁడు పండుకొన్ననాదగ్గఱకు వచ్చి యట్లు చేసెను. అయిదునిమిషములలో పండుకొన్న నేను లేచి కూర్చుండి, కూర్చున్న నేను లేచి, లేచిననే నిటు నటు దిరిగి, తిరిగిననేను పర్వ్యాత్తఁ గలిగి యుత్సాహశక్తి పూరితుఁడ నయితిని. కొంతపర్వ్యాతోనే వెళ్లి శ్రీవారి పాదముల వ్రాలితిని. రైలు వేళగుచున్నది గాన వెంటనే స్టేషనుకు పొమ్మనిరి. 'ఇఁకనుండి యనారోగ్య ముండదు. వారము వారము రా నక్కఱ లేదు. రెండురోజులు సెలవు కలసి వచ్చిన రమ్ము. పగలు హాయిగా భోజనము చేయుము. ఉదయము, మధ్యాహ్నము లఘ్వాహారము గొనుము. జీర్ణశక్తి సరిగా నుండును. లివరు సరిపడినది. రాత్రిపూట మజ్జిగ కాక పాలు పోసికొని భుజింపుము' అనిరి. తంజావూరికి వచ్చి వేసితిని.

తదాది జ్వరము లేదు. జీర్ణశక్తి చక్కబడినది. ఆకలి యున్నది నాఁటనుండి సరిగా తెలియవచ్చెను. దినదినక్రమాభివృద్ధిగా నారోగ్యము కలుగఁజొచ్చెను. ఆనాళ్లనుండి నాకు అనారోగ్యవ్యథ తొలఁగి వింతవింత యనుభూతులు కలుగఁజొచ్చెను. ఒకనాఁ డుదయము రొట్టెపాలు (కాఫియలవాటు ముప్పదియైదేండ్లవయసుతర్వాతనే) తీసికొని ప్రాతరుపాసనము జరపుకొని ఆఫీసుకు వెళ్లితిని. (తంజావూరిలైబ్రరీ ఉదయము 8 గంటలనుండి సాయంకాల మయిదుగంటలదాఁక) అప్పుడు ప్రాతఃకాలముననే కొన్ని నియమితసమయములలో సాయంకాలముదాఁక నభ్యాసము లుండెడివి.

పదిగంటలవేళ నభ్యాసము జరపుకొని టేబిలుదగ్గఱ గ్రంథపరిశీలనము జరపుచుండఁగా నామూలాధారముననుండి ప్రబలముగా పిచికారితో కొట్టినట్టు ప్రజ్ఞాబలధారలు రేగఁజొచ్చినవి. ఉత్సాహానందములు పొంగి పొరలి శరీర మెల్ల వ్యాపింపఁజొచ్చినవి. ఆధారలు తలలోనికిఁ బోయినవి. అప్పటి నాయాహ్లాదము చెప్పఁ దరము కానిది. లోపల చిచ్చుబుడ్డి వెలిఁగించి దానిపై పలుచనికుండ మూసినట్లు తల యూగులాడఁజొచ్చినది. లోపల నేవో మెఱుఁగురేకలు తిరుగఁజొచ్చినవి. అప్పుడు పని కట్టిపెట్టి వినోదింపఁదొడగితిని. పదినిమిషములట్లుండెను. నాస్థితి యానందతాండవ మాడుచున్నట్లయ్యెను. నెమ్మదిగా నది వశంగత మయ్యెను. నాయొడ లానందమయ మయ్యెను. కొలఁదిదినములకే ఆలైబ్రరిపనిని వడిగా ముగించి వేసితిమి.

## ౨౯

## ఇల్లాలి యినిసియేషన్

మద్రాసు పయనము. నే నింటిసామాన్ల నన్నింటిని రైలులో మద్రాసు పంపి సకుటుంబముగా తంజావూరినుండి కుంభకోణమునకు వచ్చి నాయారోగ్యాదివిషయములను శ్రీవారి కెఱింగించితిని.

నాఁడు సాయంకాలపు యోగాభ్యాసము ముగిసిన తర్వాత నన్నుఁ బిలిచి శ్రీవారు 'నీ వీరాత్రి నేను సదా వర్తిల్లుచుండు యోగాలయపు గదిలో, నేను విశ్రమించుబల్లమీఁద నీభార్యతో శయనించుము. నే నిప్పుడు ఇంటనే శయనించుచుంటిని' అనిరి. నేను గడగడలాడి సిగ్గుతో అంగీకారసూచకముగా తల వాంచితిని. కాని నాకు తర్వాత చాల వెఱపు గల్గెను. అది గురుదేవులు శయనించుగది. అందు వారు విశ్రాంతి గొనుబల్ల! అందు నేను శయనించుటా? అందును సద్వితీయముగా! అని వణకితిని. ఈయాజ్ఞ నాలోనే జీర్ణించెను. వారితోనే భోజనము చేసితిని, వారియింటిలోని యాఁడువా రందఱు శయనించుచోటనే నాకుటుంబిని శయనించెను. నేను మఱికొందఱు మిత్రులతో వీధియరుగుమీఁద శయనించితిని. రేయెల్ల శ్రీవారి యాజ్ఞనుగూర్చి పర్యాలోచనమే! ఉదయము తెలతెలవాఱుచుండఁగా తలుపులు తెఱచిన తోడనే లోని కఱిగితిని.

శ్రీవారు ఇంటిలో విశాల మయినమండువాలో చంద్రనక్షత్రాదులు నీలాకాశము గోచరించుచుండఁగా చల్లని

గాలి వీచుచుండఁగా, నౌకగోల్డుమెడల్ మడతమంచము మీఁద పలుచని పడుకపైన శయనించి యుండిరి. పడుక మీఁదను, క్రిందను చల్లినమల్లెపూవు లున్నవి. పట్టుతలగడ గలదు. తెల్లనిపలుచనిపట్టుసెల్లా కప్పుకొని యుండిరి. మంచమునకు దోమతెరక ప్పుండెను. అదను ప్రతీక్షించుచు వారు కనులు దెఱచి లేవ నుంకించునంతలో నేను చేర నరిగి పాదములు స్పృశించి నమస్కరించితిని. 'రాత్రి యెక్కడ శయనించితి' వని యడిగిరి. ఇంటిలో స్త్రీలతో స్త్రీయు, వాకిటియరుగుమీఁద నేనును శయనించుట తెల్పితిని. చప్పరించి 'నామాట పాటింపక పోతివి గదా!' యనిరి. సిగ్గుతో తల వాంచితిని. 'సరే! కానిలే! ఏమివిశేషము ?' అనిరి.

'మీ దివ్యానుగ్రహమున నే నారోగ్యవంతుఁడ నయితిని. నా కీయోగమార్గమున ధన్యత చేకూరెను. నాకు శరీర మొసఁగినమాతల్లిదండ్రులు వృద్ధులు. ఎప్పు డేమి జరుగునో? వారికి మీశిష్యత ననుగ్రహింప వేఁడుచున్నాను. వా రిక్కడికి రాఁజాలరు' అంటిని. 'వారివయ సెంత ?' యనిరి. 'మాతండ్రి గారి వయసు డెబ్బది దాటినది' యంటిని. 'అంత వార్ధకమున నున్నవారినిగూర్చి యనుతపింతువే? చిరకాలము నీతో జీవితము గడపవలసిననీభార్యనుగూర్చి యడుగ వేమి?' యనిరి. 'చిన్నవయస్సులో నున్నయీయావిడ నాతో నెప్పుడు పట్టిన నప్పుడు మీదర్శనమునకు రాఁగల్గును. కాన యెప్పుడయిన మీశిష్యతానుగ్రహమున కర్హురాలు కాఁగలదు. చాల వార్ధకమున నున్నవా రని, ఎప్పు డేమగునో అని, వా రీశరీ

రముతోనే మీాశిష్యత పడయవలె నని నాయాశ!' యంటిని. 'సరే కాని నేఁడు ఎనిమిదిగంటలకు నీభార్యకు ఇఁకసియేషఁ జరుగును. అందుకు వలయుసన్నాహాములు జరపుము. అందుకై నీ వేమియు వస్తువులు తీసికొని రా నక్కఱ లేదు. రాధాకృష్ణునితోను, మహాదేవయ్యరుతోను చెప్పి ఫారము వగైరాలు ఫిలప్పు చేయించుము' అని శయ్య వీడి లోని కరిగిరి.

నే నడిగినదాని ననుగ్రహించిన శ్రీస్తర మీాయక యర్థింపవలసిన దే అయినను అప్పు డర్థింపనిదాని ననుగ్రహించుట జరిగెను గదా యని వింత చెందుచు నేనును వెలికి వచ్చి కాలకృత్యములు నిర్వర్తించుకొని, యంతలోనే యోగశాలకు విచ్చేసినమిత్రు లిర్వురకు శ్రీవారి యాజ్ఞను దెలిపితిని. వారు నవ్విరి. ఎనిమిదిగంటలకు సర్వము సిద్ధమయ్యెను. నాఁడు శ్రీవారియింట వారి మేనత్తగారు, వృద్ధురాలు చాల జబ్బుపడిరి. వారి యారోగ్యమునుగూర్చి శ్రీవారు తీవ్రప్రజ్ఞతో నుండిరి. ఎనిమిదిగంటలకు ఇఁకసియేషఁ జరగినది.

మాతృశ్రీగారు యోగసాధనోపక్రమమునకు ముందు ఇడ్డెనలు, కాఫీ, ఆహారము తీసికొనుటకై తెచ్చి దగ్గఱ నుంచిరి. అది తెలియక యీాశ్రోత్రయువిద యభ్యాసవిధానము నారంభించెను. అయిదునిమిషములలో శరీర మెల్లకొయ్యబాఱి కదల మెదల వీలులేకుండ బిగిసికొని పోయెను. దగ్గఱకు వచ్చి సచ్చిదానందస్వాములవా రాస్థితిని జూచి పిలిచిరి. కనులు తెఱవఁజాల దయ్యెను. వారు మాతృశ్రీగారిని

బిలుచుకొని వచ్చిరి. చూడఁగా నాహారపదార్థము లుంచినవి యుంచినట్లే యుండెను. వెంటనే లేపి, ఒడలు పిసికి, మెలుక తెచ్చి యాహారము గొనిపించిరి. మూఁడునాల్గిడ్డెనలు, చెంబెడుమంచినీరు, కాఫీ త్రాగి, శక్తి రాఁగా మరల యోగ సాధనముల సాగింపించిరి. పావుగంటసేపు ప్రబలముగా సాధన జరిగెను. అంత తీవ్రముగా నాఁడుండుటకు కారణము శ్రీవారి యానాఁటి ప్రజ్ఞాతీవ్రతయే యగుట నక్కడివారు తెల్పిరి. నాఁడు మహోత్సాహముతో దంపతుల ముంటిమి.

ఆసాయంకాలమే నేను మద్రాసు వెళ్ళవలెను. నా కోర్కి తీరలేదు. మరల శ్రీవారిని దర్శించి నాకోర్కి-మాతలిదండ్రులవిషయమును ప్రశ్నించితిని. శ్రీవారు నాయజ్ఞానమున కతృప్తి గొన్నట్టుండి యిట్లనిరి. ఇక వారి శరీరములను జిర కాలము రక్షింప ననువు పడదు. అయినను నీవు వెంటాడు చున్నావు గాన చెప్పుచున్నాను. 'నీవు యోగసిద్ధుఁడవైతేని- 'దశపూర్వేషాం దశాపరేషాం'- మీవంశ్యులకు నీయోగ వాసన లంటి వారు కడతేరఁగలరు. పదిసంవత్సరములు విడువక నాయాదేశముచొప్పున యోగాభ్యాసము చేయవలెను. అన్నివాంఛితములను నీవే నెఱవేర్చుకొనఁగల్గుదువు. ఇప్పటికి మీతల్లిదండ్రు లక్కడనే ఉండి యీనాయుపదేశించు విధానము నాచరింతురుగాక' అని తద్విధానము తెల్పిరి. నే నెంతో ఉప్పొంగితిని.

కాని యానాఁడు తెలతెలవాఱునపుడు వారిని దర్శించి నప్పుడు భాషించినతెలుఁగునకు, నే నొక్కడాని నడుగఁగా

దానికి బదులు ననుగ్రహింపక యనన్వితముగా జరపిన సందర్భమునకు, మధ్యాహ్నము మరల వెంటాడి మూర్ఖతతో ప్రశ్నింపఁగా చూచినచూడ్కికి, చెప్పినబదులుకు నేకాన్వయము మఱి పదేండ్లకు గాని నేను గుర్తింప యోగ్యత గలవాఁడ గాఁజాల నయితిని. పదుమూఁడేండ్ల కద్భుతముగా తద్రహస్య మెల్ల ననుభూతిపూర్వకముగా గోచరించెను. అది యీసందర్భము వచ్చినప్పుడు వివరింపఁగలను.

కుంభకోణముననుండియే మాతల్లిదండ్రులకు శ్రీవారి యాదేశము వ్రాసితిని. శ్రీవారిసన్నిధిని మాదంపతుల కెట్టి యనుభూతులు జరిగినవో సుదూరదేశమున నున్నను మా తల్లిదండ్రులకు నట్టియనుభూతులు జరిగినవి. తర్వాత వారు మద్రాసుకు నా కాయావిషయముల తెలిపిరి. నాఁడు రాత్రి మెయిలులో దంపతులము మేము మద్రాసు వచ్చి వేసితిమి.

— —

# 30

## నాడీగ్రంథములు

తంజావూరిలో పరిశీలించినగ్రంథముల విషయమున జరపవలసిన తర్వాతి కార్యములను జరపుటకు మద్రాసులో మేము కొంత పని చేయవలసియుండుటచే మూఁడు నాల్గు నెలలు మేము మద్రాసులోనే యుంటిమి. అప్పుడు మద్రాసు గవర్నరుగా పెంట్లండు దొరగా రుండిరి. ఆయన నెవరో ఇంగ్లండువారో, జర్మనీవారో ప్రేరేచి రఁట! 'తంజావూరి లైబ్రరీని మాకుఁ గొనిపెట్టవలసిన'దని. అందుకై ఆలైబ్రరి విలువ కట్టుటకు గ్రంథములపరిశీలనము జరపవలసెను. వు మ్మందుకు తంజావూరు పంపిరి.

ఈరహస్యము పైకి పొక్కినది. ప్రజలు గంరగోళము చేసిరి. గవర్నరుగారు తమతంత్రము కట్టిపెట్టిరి. ఒకవిధముగా మే మక్కడికి వెళ్లి జరపినపరిశీలనము వ్యర్థ మయినది. కాని యానాఁడు మేము వ్రాసినవిమర్శములు కొన్ని యటుతర్వాత తంజావూరి కేటలాగులు ప్రకటించువా రుపయోగించుకొనిరి. మేము విలువ కట్టుటకే వలయునంశములను బ్రధానముగా గూర్చితిమి కాని గ్రంథాంశపర్యాలోచనకుఁ గాదు. కాన మాలిస్టులలో ఆయావిషయములు పర్యాప్తముగా సేకరింప లేదు గాని పుస్తకముల నన్నింటిని సరిగా గుర్తించితిమి. గణించితిమి. గవర్నరుగారిపని వ్యర్థ మయినతర్వాత మా లిస్టుల నన్నింటిని తంజావూరిలైబ్రరి కిచ్చివేసితిమి. ఆలెక్క

కట్టుపనిలో నేను మద్రాసులో నుండి ఆరోగ్యవిషయమున, గ్రంథపరిశీలనవిషయమున, యోగసాధనవిషయమునఁ జాల నభ్యుదయము చెందితిని. ప్రతిదినము నేను మిత్రులతోఁ గలసి యోగాభ్యాసము చేయుచుంటిని.

ఆ నాళ్లలో ధ్రువనాడీ పరిశోధన మధికముగా జరగెను. అందు శ్రీ వారి జాతకము పరిశీలించుట జరగెను. ఇంక ననేకమిత్రుల జాతకముల పరిశీలనము జరగెను. ఆ యుత్సాహమున నా జాతకమును బరిశీలింపించుకొంటిని. ధ్రువనాడి సత్యాచార్య ప్రణీత మని యం దున్నది. సత్యాచార్యుఁడు పంచసిద్ధాంతి కాది గ్రంథకర్త యనియు, క్రీ. 4-వ శతాబ్ది వాఁ డనియు ప్రసిద్ధి గన్నవాఁడు. ఆతఁడే యేతద్గ్రంథకర్తయని కలదు గాని యిందలి భాషాశైలీ లక్షణాదులను జూడఁగా నది సత్య మనిపించదు.

ఈ నాడీగ్రంథములు సంస్కృత ద్రవిడ భాషలలో నరవదేశముననే యధికముగాఁ గలవు. ఆంధ్రదేశమునఁ గూడ నాంధ్రభాషలో వేములవాడ భీమన రచితముగా నొక నాడీ గ్రంథ మున్నది. కాని యది సీసమాలికగా వేములవాడ భీమకవి రచన మని విశ్వసింపఁ దగనిదిగానే యున్నది. దానిని ప్రాచ్యలిఖిత పుస్తకశాలకు నేనే సేకరించితిని. అది ప్రస్తుతకాలమున నుపయోగపడునది కాదు. ఇక సంస్కృత ద్రవిడ గ్రంథములలో ధ్రువనాడి యని, సత్యసంహిత యని, శుక్రనాడి యని, చంద్రకళానాడి యని నాల్గు గ్రంథముల నే నెఱుఁగుదును. అవి యెవరో ప్రాచీనమహర్షులు, తత్కల్పులు

రచించినవిగా నున్నవి. ధ్రువనాడీ సత్యసంహితలు సత్యాచార్య రచన లనఁగా నే నే మనుకొంటి ననఁగా సత్యాచార్యుని యంశమున నిటీవల జనించినవా రెవరో పూర్వానుస్మృతి కలిగి వానిని రచించి యుందు రని.

ఇక్కడ వక్తవ్యము చాలఁ గలదు. ఈతఁడు శివాంశమున జనించినాఁ డనీ (అప్పయ దీక్షితాదులు), ఈతఁడు గుడిగంట యంశమున జన్మించి (వేదాంత దేశికులు) నాఁ డనీ యిత్యాది విధములఁ బలువురను ప్రాచీనమహనీయులను గూర్చి ప్రామాణికులే నిర్ణయించి పలుకుచుండుట కలదు. ఆయా దేవతల ఖండావతారములుగా వారిని నిర్ణయించుట సంగతము. ఆయా మహామహులు లోకమున నేవేవో యపూర్వాద్భుతార్థములను వెలయించుటకై యవతరించుట కలదు. దేశకాలాదుల యసౌకర్యముబట్టి యాయా కార్యములను వా రప్పుడప్పుడే యాయా యవతారములలోనే నిర్వర్తింప వీలుపడక పోవచ్చును. శుద్ధసంకల్పులు గనుక వారు వా రాయా కార్యములను గొన్ని జన్మముల నెత్తి నిర్వర్తింపవలసిన వా రగుచుందురు. శంకర, జిన, బుద్ధాదుల కార్యము లట్లే యొక జన్మమున నిర్వాహము చెందవయ్యెను.

అతిప్రాచీను లయి జ్యోతిషమున నద్భుతగ్రంథములు రచించిన సత్యాచార్యాదులు మరల మరల జన్మించుచు లోకవృత్తమును గొన్ని కొన్ని పష్టులకు రచించుచు వచ్చుచుండి రని నా విశ్వాసము. తర్వాతి తర్వాతి జన్మముల

వారి వారి గ్రంథములకే నాడీగ్రంథము లని పేరు. అవి కొన్ని కొన్ని పష్టులకే రచితము లయి యుండు ననియు నా విశ్వాసము. వారు వా రాయా జన్మములలో జ్యోతిష ప్రజ్ఞకే పారమార్థ్యము గల్పించుకొనుటచే భాషాపాండిత్య మునకై యంతగా ప్రాకులాడ రయిరి. వారి గ్రంథములలోని భాష నిర్దుష్టము గాదు. ప్రౌఢమును గాదు. కొన్నిచోట్ల కొండలు కొండలు గ్రంథభాగములు ప్రౌఢములుగా లేక పోలేదు. రుచిగల, యర్థవిశేషములు గల జాతకభాగ ములఁ జెప్పుచో శ్లేషాద్యలంకారములతో నతిరసవంత మగు భాషతో నాయా గ్రంథభాగము లున్నవి. అందు శబ్ద జాలము క్రొత్తగా నేఁడు పుట్టుచున్నను మనుష్యులను గూర్చి వారి వర్తనముల గూర్చి పేళ్లగూర్చి కూడ నుండును. ఈ నాఁడు క్రొత్త వెలసిన, వెలయుచున్న రేడియో, రేడియం, ఎక్సురే, కాస్మిక్ రే, ఆటంబాంబు మొదలగువానినిగూర్చి కూడ నం దుండును

తద్గ్రంథకర్తల నాఁటి కీ విషయములు భవిష్యద్విష యములే యయినను నా గ్రంథములలో నాయా భాగములఁ జదివి వెల్లడించి నంతవఱకు భూతమును, దరువాతిది భవిష్య త్తును నగుట గానవచ్చును. ఆయా గ్రంథములు చదివిన నాఁటిదాఁక విషయములు, జాతకునకు చక్క సరిపడునవిగా నంతదాఁక తు, చ తప్పకుండ జరగినవిగా నుండుటచేదానిని బట్టి తర్వాతి గ్రంథభాగమును విశ్వసించి జాతకుఁడు గయి కొనును. తర్వాత నది తప్పిపో నారంభించును. క్రమముగా

నన్ని విషయములు విస్పష్టముగాఁ దప్పిపోవుచుండును. ధ్రువ నాడిలో నట్లు జాతకము తప్పిపోవునట్లు గుర్తించి యడుగఁగా నపుడు సరిపోయినదిగా నింకొక తాటియాకు దొరకును. అది పూర్వపుటాకుకంటె కొంత హెచ్చు భాగములు సరిపోయి నదిగా నుండును. కొన్నాళ్ల కిదియు తప్పిపోవును. ఇట్లు ఆ నాడి, తత్పాఠకుఁడు, జాతకుఁడు ఉన్నంతదాఁక చదువుచునే యున్నచో జాతకము సరిదిద్దుకొనుచునే యుండవచ్చును. కాని రేపిట్లు జరగఁగలదని సునిశ్చితముగా నే నాడి గ్రంథము గాని చెప్పుట నే నెఱుఁగను. ప్రత్యుత తద్విరుద్ధ ముగా జరగుటయు నెఱుఁగుదును.

పర్యాలోచించి చూడఁగా నొక్కొకప్పుడా గ్రంథ మాయా వేళల కనుకూలముగా నిర్మిత మగుచుండు నేమో యని తోఁచును. ధ్రువనాడిలో జాతకము తప్పినపు డెల్ల క్రొత్త జాతకము దొరకుచుండుట యిట్టిదే. కాన యీ నాడి నుపయోగించు గ్రంథస్వామి దానిని సృష్టించుచుండె నని కొంద అందురు. నాడి తప్పునప్పు డెల్లఁ దద్గ్రంథస్వామిని కొందఱు తస్కరుఁడు, తప్పుడు సృష్టి చేసె నని నిందించు చుందురు. దానిని జదివినందు కాతఁడు కొంత సొమ్ము గయి కొనుచున్నాఁడు గాన యక్రమముగా నాతఁడా నిందకు బాల్పడవలసి వచ్చుచుండును. అంతే కాని నిజముగా నా గ్రంథ స్వామి దానిని సృష్టింపఁ జాలఁడగుట నేను బాగముగా నెఱుఁ గుదును. ఆతని దృష్టి కా యక్షరము లట్లు కానవచ్చె నని కాని యాతని తల కట్లు శ్లోకపరంపర తోఁచె నని కాని వాకొనుట యుక్తము.

ధ్రువనాడీ స్వామి యగు శేషాచార్యుని విషయమున నీ యర్థము యథార్థము. అస్మదాదుల మనేకుల మా గ్రంథమున నుండి యా నాఁడు జాతకముల వ్రాయించుకొంటిమి. అబ్బురము చెందుచు మిత్రు లనేకులకు జాతకములు వ్రాయించితిమి. వ్రాయు నప్పుడు విడువకుండ సన్నిధినే యుంటిమి. ఇంత యేల? అస్మదాచార్యపాదుల జాతకము నందుండి పఠించునపుడు, వ్రాయించునపుడును నేను సన్నిధినే యుంటిని. ఇంకను గొందఱు మిత్రు లుండిరి. ఆ గ్రంథము గల శేషాచార్యుఁడు శ్రీవారియెడ నప్పు డద్భుతభక్తి గల శిష్యుఁడు. వారి జాతకము నంతవఱకు నక్షరాక్షరము సత్యముగా నుండెను.

అందులో నాకు విడ్డూరము గొల్పినవిషయములు గొన్ని యున్నవి.

"బ్రహ్మస్వరూపో భగవాన్ దర్శనం చ క్వచిత్ క్వచిత్
అదర్శనం క్వచిచ్చేతి తత శ్చంచలబుద్ధిమాన్"

అని నల్వదవయేటి వృత్తాంతము వర్ణిత మయి యుండెను. ఇది చదువుచో నేను దగ్గఱ నుంటిని. ప్రతిపదము ప్రామాణిక మగునో కాదో యని శ్రీవారు పరీక్షించు చుండిరి. ఈ శ్లోకము చదువునపుడు కొంత యాగి యోచించి నవ్వి 'సరిగా వ్రాసినాఁడు. మీఁద చదువుఁడు' అనిరి.

అప్పు డీ శ్లోకమున కర్థ మేమో బ్రహ్మదర్శనము లభించుట యనఁగా నెట్టిదో, అప్పు డేమి జరగినదో వివరించి

తెలుప వేఁడెద నని పలుక నాలుక చివరిదాఁక ప్రశ్నము సాగును గాని నాలుకదాఁటి బైటికి రాదయ్యెను. ప్రశ్నింప వలె నని చాల తంటాలు పడితిని గాని ప్రశ్నింప నాచేతఁ గాలేదు. 'జీర్ణ మంగే సుభాషితమ్' అన్నట్టుగా నీ ప్రశ్నార్థము నా లోనే నిలిచి పోయినది గాని పయికి రానే లేదు. నే నీ యోగమార్గమున చేరిన పదియేండ్లకు అనఁగా 1926-వ సంవత్సరమున నా యనుభవమున నొక యద్భుతానందమయ విషయము జరిగెను. దాని నెఱుగుదు నంతే కాని 1936 దాఁక అనఁగా మఱి పదియేండ్ల దాఁకఁ గాని దాని వివరణ మెల్ల తెలియరా దయ్యెను. దాని నాయా సందర్భములందు వివరింతును.

ఈ నాడీగ్రంథము లాయా జాతకుల హృదయములలో దాగియుండిన రహస్యార్థములఁ గూడఁ గొన్ని కొన్ని పట్టులం దద్భుతముగా వివరించుట కలదు. అవి నాడీరచయితకును, జాతకునకునే తెలియవలెను గాని గ్రంథపాఠకుఁడగునాడీస్వామికిఁ గూడ తెలియవు. ధ్రువనాడిలో నిట్టి వానిని గొన్నింటిని బేర్కొందును.

'జలగండ మవాప్నోతి మృతప్రాయోపజీవనః' అని నా జాతకమునఁ గలదు. నేను మఱచితిని గాని యది జరిగిన విషయమే! మా దొడ్డిలో పిల్లలము కొందఱ మాడుకొనుచుంటిమి. నూతిలో వెదురుగడలు దింపి వానిని బట్టుకొని పైకి లాగుచుంటిమి. నేను వేసినగడ నీటిలో అడుగున బురదలో లోనికిఁ జొచ్చుకొన్నది. దాని పై యంచు ఒరమీఁద

నున్న నా కండకుండెను. లోనికి తలవాంచి యెల్లే నందుకొన జూచుచుంటిని. ప్రక్క పిల్లవాఁడు నా ముడ్డి పైకెత్తెను. నేను నూతిలోఁ బడిపోయితిని. పిల్లలందఱు పటాపంచలై పాఱిపోయిరి. మా నాయనగా రూర లేరు. మా యమ్మగారు నింటిలో నేదో పని చేసికొనుచుండిరి. నూతిలో పెద్దధ్వని గలుగుట ప్రక్కయింటి యాతఁ డాలకించి దొడ్డిలోనికి వచ్చి చూడఁగా పిల్లలందఱు పాఱిపోవుచుండిరి. ఒక పిల్లవానిఁ బట్టుకొని గట్టిగా నడుగఁగా నేను నూతిలోఁ బడుట చెప్పెను. అతఁడు పర్వెత్తుకొని వచ్చి చూచుతఱికి నాల్గుమూఁడు నిమిషము లాయెను. నే నొక మునుక వేసి తేలి నూతిలో నూగిసలాడుచున్న గడను పట్టుకొని మరల మునుక వేయక తేలియుంటిని. అతఁ డొరల మీఁదుగా దిగివచ్చి నన్నుఁ బట్టుకొని మా యమ్మగారి కప్పజెప్పెను. ఈ విషయ మా నాడిలో నున్నది.

అశ్లే పందొమ్మిదవయేట అవనిగడ్డదగ్గఱ బండి యేటిలోనికి దిగుచుండఁగా బోల్తా కొట్టి చచ్చి బ్రదికితిని. "వాహనా త్పతనం చైవ తస్మాలాచ్చ మహద్విపత్" అనియందు కలదు. ఇట్టివి ప్రతి జాతకములోను వింత వింతలుగా నుండుట నే నెఱుఁగుదును.

నే నెఱిఁగిన మఱొక గొప్పవింత. మద్రాసులో నొకానొక గొప్పయింట నొక పిల్లవాని కేదో కడుపులో తీవ్రమయిన యనారోగ్యము. అది కుదుర్పరానిది. బ్రదికిన నొకవేళ శస్త్రచికిత్సతో బ్రదుకవచ్చు నని యాస. ఆ కుఱ్ఱ

వాఁడు జీవించునో లేదో గుర్తించుటకు ధ్రువనాడీకారున కత్యధికధన మిచ్చి యింటికి రప్పించి గ్రంథము నక్కడే యుంచి చదివించుచుండిరి. ఆ కుఱ్ఱవాని జాతకము సరిగానే యందుఁ గలదు. అతని యనారోగ్యపు నిర్వచన మెల్ల సరిగానే యందుఁ గలదు. ఆ జాతకపుటాకు తుదిపట్టు చదువుచుండిరి. అంతలో ఆపరేషన్ చేయుటకు డాక్టరు రంగాచార్యులుగారు విచ్చేసిరి. ఆ సమయమునకు సరిగా 'శస్త్రవైద్యేన జీవతి' యన్న వాక్యము నాడిలో వచ్చెను. తరువాతి యాకు నిఁక చదువవలెను. డాక్టరుగారు వచ్చుటచే నంతట నాపిరి. అందఱకును ఆ కుఱ్ఱవాఁడు శస్త్రవైద్యముచే జీవించును అనియే యర్థము స్ఫురించెను. డాక్టరు శస్త్రోప క్రమమునకు సిద్ధపడుచుండెను. నాడీగ్రంథమునఁ జదువుచున్న పట్టున గుర్తించి కట్టిపెట్టి గృహస్వామి యినుపపెట్టెలో తాళము వేసి తాళముచెవి నాడికారున కిచ్చెను. మర్నాడు వచ్చి కడమ గ్రంథమును జదువుట కేర్పాటు జరగెను. తొందరగా నాడీకారుఁడు శేషాచార్యుఁ డింటికి వచ్చి వేసెను. ఈ విషయ మెల్ల మాతోను జెప్పెను. మేమును నాతఁడు జీవించు ననియే యనుకొంటిమి.

మర్నాడు శేషాచార్యుఁ డుదయమున వారింటికి వెళ్లెను. ఆపరేషన్ జరగుచుండఁగానే ఆ బాలుఁడు మృతుఁ డౌట తెలియవచ్చెను. అక్కడి పండితులు నివ్వెఱ చెందుచుండిరి. ఈతనిని నాడి తెలుపు మనిరి. తెలుపఁగా నా జాతకమున తుదిశ్లోక మదియే. తర్వాతి యాకులో వేఱొక

జాతక ముపక్రాంత మయ్యెను. పర్యాలోచింపఁగా - శస్త్రవైద్యే = శస్త్రవైద్యమున (వైద్యము జరగుకాలమున) నజీవతి = చనిపోవును అని యర్థ మగుట, అట్లగుటచేతనే జాతకపుఁ బైభాగము లేకుండుట తెలియ నయ్యెను. అందఱును దైవవంచనకు ఖిన్ను లయిరి. ఇట్టివానిని ధ్రువనాడీచమత్కారముల నెన్నింటినేని పేర్కొన నెఱుఁగుదును.

అందు సి. వి. వి యోగమార్గమునఁ జేరినవారి జాతకములు పదులకొలఁదిగాఁ జదువుట నే నెఱుఁగుదును. ఆ చదువుట నా సమక్షముననే జరగినది. శ్రీవారి జాతకమునఁ గలవిషయములే యనేకుల జాతకములం దున్నవి. శ్రీవారి జాతకమును, శిష్యులయు తదితరులయు జాతకములును గొన్నాళ్లయినతర్వాతఁ దప్పిపోవుటయు, మరలఁ జూడఁగా సరి యయినవి దొరకుటయుఁ గూడ నెఱుఁగుదును. శ్రీవా రుండఁగా నానాడీగ్రంథమును శ్రీ వేపా రామేశము గారి దగ్గఱ గొన్ని వందలరూప్యములకుఁ దాకట్టు పెట్టుటయు వారు దానికి ఇండెక్సు వ్రాయించుటయు జరగినది. ఆ నాళ్లలోఁ గ్రొత్తగా జాతకములు చదువుట సాగలేదు. మఱియు నాతఁ డానాడీగ్రంథమును జదువుచుండిన నాళ్లలో వెల్లడి యయినజాతకము లనేకము లీయిండెక్సు చేసిన గ్రంథములలోఁ గానరాలేదు. వాని నాతఁడు దాఁచి యుంచు

తోనెనో, చదువునాళ్లలోనే కల్పించి చదివెనో యని కొందఱు సంశయించిరి. నా నిశ్చయ మాతఁడు కల్పింపను గాని, దాచి యుంచుకొనను గాని నేరనివాఁడే యని.

## భుజండనాడి.

శ్రీవారుండగానే, ధ్రువనాడి చదువుచుండునాళ్లలోనే యీనాడి బయల్పడెను. ఈనాడి గలయాతఁడు కుంభకోణవాస్తవ్యుఁడే. పట్టునూలిజాతివాఁడు. వలసినంత ధనము గొని తొలుత శ్రీవారి జాతకము చదివెను. అది చదువునాఁటి కాతనికి తద్గ్రంథవిధానము స్పష్టముగా నెఱుఁగరాకే యుండెనఁట! శ్రీవారిజాతకము చదువుటలో నాప్రజ్ఞ యేర్పడెనఁట! ఆజాతకము చదువుటవల్ల నాతనికి శ్రీవారియెడ భక్తిప్రపత్తు లేర్పడెను. శిష్యుఁడయ్యెను. అన్వహము శ్రీవారిదో, శిష్యులవో, ఇతరులవో జాతకములు చదువుట, దాని వలని యీ యతితో జీవితము గడపుట యాతని కేర్పడెను. ప్రధానముగా శ్రీవారియు, వారికుటుంబమువారియు, శిష్యులయు, వారికుటుంబములవారియు జాతకములు చదువుటలో నాతనికి తీరిక లేకుండెను.

కొంఁదిదినములలో శ్రీవారు శరీరమును విడుతురనఁగా నాతని ప్రశ్నించిరి. 'ఉన్నది యున్నట్టే వ్రాయుట, చదువుట జరుపుచున్నావా? కల్పనలు సాగించుచున్నావా?'

అని. ఆనాఁడే ఆతఁ డొక కల్పనము చేసె నఁట! శ్రీవారి ముఖ్యశిష్యులలో 'అంబష్ఠుఁ' డొకఁ డుండెను అనుటకు 'అమ్మట నొరువర్' అని యుండగా నాడి కాపి వ్రాయుచున్న వాఁడు గోపీనాథరా వను శ్రీవారి శిష్యుఁడే నాడికారునివంటి వాఁడే వాక్సహాయము చేయఁగా 'పండిత నొరువర్' అని మార్చి వ్రాసెనఁట! దక్షిణదేశమున 'అంబష్ఠుని' పండితుఁ డనుట పరిపాటి–గడగడలాడుచు దీని నాతఁడు శ్రీవారికి నివేదించెను. ఎప్పుడుగాని యిట్లు మార్పవల దని శ్రీవారు శాసించిరి. కడకు శిష్యగోష్ఠిలో నీవిషయమును దెలిపి ఇదివఱకు వ్రాసినభాగమున నిం కేమేని మార్పులు చేసి నాఁడేమో పరిశీలింపవలసియున్నది యని దానికాపి లెవరెవరు వ్రాసిరో, వారి వారి కాపీలతో నందఱను, మూలముతో నాడి కారుని రమ్మనిరి. ఎవ్వరు నేమి కల్పనము జరపిరో యెఱుఁగరు గాన తమనిర్దుష్టతను నిరూపించుకొనుట కందఱు వచ్చిన తర్వాత మూలమును, కాపిలను వశపఱచుకొని కట్ట కట్టి యట్టుకమీఁద దాచివైచిరి. ఇక నాడి చదువవల దనిరి.

"వ్రాయుసగాఁ డేమేని మార్పు చేయువచ్చును. మాతృక వ్రాసినవాఁడే యెఱుక చాలక యేమేని తప్పు వ్రాసి యుండవచ్చును. గ్రంథకారుఁడే యజ్ఞుఁడై తప్పిదపురచనము చేసి యుండవచ్చును. దానికి పరమప్రామాణ్యము కల్పించు కొని మీరు చదువరాదు. నాదగ్గఱకు మీరు వచ్చి శిష్యులగుట నాడిమూలమునఁ గాదు. నాడిఁ జూచుట మీరు నాశిష్యు లయినతర్వాతనే. ఏకారణములతో మీరు నాశిష్యు

లయితిరో ఆకారణములతోనే నన్ననువర్తింపుఁడు. నామాటలు స్వతఃప్రమాణములు గాని పరతః ప్రమాణములు గావు. నన్ను, నాకార్యములను నాడీ ననుసరించి విశ్వసింపవలదు'' అనిరి.

అక్కడ నున్నశిష్యులు కొందఱు 'మీయాదేశముల ననువదించుటచేతనే నాడిని విశ్వసించుచుంటిమి. తద్విరుద్ధముగా నుండునేని యప్పుడే విడనాడి యుందుము'అనిరి. 'సరే! ననసన్నగా ననువర్తించుచున్నట్టే యుండి యీనాడికాలాంతరమున నజ్ఞానముచే తప్పులు చెప్పుట సాగింపవచ్చును. అందాఁక రచియించినగ్రంథముపై ప్రామాణ్యము కల్పించుట మీకు సంగతముగాఁ దోఁపకపోవచ్చును. నాయోగమార్గమును బరిపూర్ణముగా గుర్తించుట యెవ్వరికిని సాధ్యము గాదు. అది నాకుఁ గూడ నప్పటప్పట దెలియనగునదిగా నుండును. శాఖోపశాఖలుగాఁ బెరుగఁగల మఱ్ఱిచెట్టునకు ఎన్నాళ్ల కేదిక్కున నేశాఖ నది వెలయింపఁగలదో తెలియనట్లే లోకతంత్రమున, మఱీ యీయోగతంత్రమున వికాస ముండును. మానవుఁడు ఈశ్వరతను జేరబోవుకొలఁదిని దానిని దెలియఁగల్గవచ్చును. వృక్షశాస్త్రమునఁ గొన్నివృక్షము లెన్నాళ్లకిన్ని యాకులనో, శాఖలనో వెలయింపఁగల వనీ, యీ యీ సమయములలో బుష్పింపఁగలవనీ, ఫలింపఁగలవనీ, ఇన్ని పుష్పము లనీ. యిన్ని ఫలము లనీ కూడ గుర్తించుట జరగుచున్నది. మానవప్రజ్ఞ పెరుగను పెరుగను ఈశ్వరునకుఁ జేరువ కానుగాను సర్వప్రాణిసృష్టిరహస్యములను మానవుఁడు గుర్తింపఁగల్గవచ్చును.

మానవత పెరుగను పెరుగను తద్హృదయమునుండి ప్రజ్ఞోద్బోధములు పెరుగఁగలవు. ఇప్పుడు పెంపొందుచున్న శాస్త్రము లన్నియు నట్టివే.

మానవహృదయము నిర్దుష్టము కానంతవఱకు, మానవవాక్కు సుపవిత్రము కానంతవఱకు, మానవకార్యములు వినిర్మలములు కానంతవఱకు సృష్టిరహస్యము మానవతగుర్తున కందనేరదు. ప్రయత్నములు సాగుచున్నవి. ఈనాడీగ్రంథము లట్టిప్రయత్నమున పుట్టినవే.

"విహాయ శాస్త్రజాలాని య త్సత్యం త దుపాస్యతామ్
వేదశాస్త్రపురాణాని పదపాంసు మివ త్యజేత్"

అని చెప్పినవా రిట్టిభావము గలవారే. మీ రీనాడీగ్రంథాదుల వెంటాడుట సాగించితి రేని మీలోని ప్రజ్ఞోద్బోధములు కుంటువడును. ప్రజ్ఞోద్బోధముల వెంటాడుచు బాహ్యశాస్త్రాదిసాధనములను విడనాడవలెను. కడకు ఆత్మానుభూతిలో నెలకొనుట యగును. మీరు చూడవలసినది యీ తాటాకులనాడి గాదు. శరీరమున చైతన్యముతో ఆడుచున్న నాడి. ఈతాటాకుల నిప్పటి కిఁకఁ గట్టిపెట్టి ఇందు చూపు తత్పరతను యోగసాధనములమీఁద చూపుఁడు" అనిరి.

ఇట్లు జరగిన కొన్నినాళ్లకు ముఖ్యశిష్యుఁ డొకఁడు 'నాడిలో నేమి విశేషము లున్నవో చదివి చూడ ననేకు లుత్సాహపడుచున్నారు. చదువ ననుగ్రహింప వేఁడుచున్నాను' అని వేఁడఁగా శ్రీవారు "ఆనాడి కొన్నిముఖ్యవిష

యములను వెల్లడింపఁగలదు. అది చదువుటకు సమయ మున్నది. అప్పుడు దానిని చదువుదు గాని'' యని బదులు చెప్పిరఁట! అంతకుఁ బూర్వమే శ్రీవారి జాతకమునఁ గొంత భాగము చదువు టయ్యెను. ఇతరుల జాతకములలోను గొన్ని భాగములు చదువు టయ్యెను. ఆ కాలమున నేనును నా జాతకపుఁ బీఠికాభాగమును జదివించుకొంటిని. ధ్రువనాడిని, భుజండనాడి యవతరణికాభాగమును, విజయనగరపుఁ బక్షిశాస్త్రశ్లోకములను, శ్రీవారినిగూర్చి నేను వ్రాసియుంచుకొన్న పద్యములను వ్రాసిపెట్టుకొన్న వ్రాఁతప్రతిని, ఇటాలియన్ నోటుబుక్కును ఎవ్వరో హరించిరి. అది నాదగ్గఱ నిపుడు లేదు. ఉన్నచో నాయాశ్లోకములను, అరవపద్యములను, దెలుఁగుపద్యములను, చాల వింతవిషయములు గలవాని నిక్కడ నుదాహరించి యుందును.

సీ. వీ. పీ కరుణాకటాక్షములు రక్షించుఁ సదా తన్మయం
బై వర్ధిల్లెడుభక్తి యున్నయెడ నిత్యానంద మారోగ్య మా
హా! పుట్టించెడుప్రజ్ఞ యాశ్రయము లభ్యంబౌను తార్గాణ నే
నే! వేయేటికి ? మీర లిందఱును దీనిం జక్క గుర్తింపరో!

Printed at The Weldun Press, Madras-21.

*Copies can be had from :*

V. SANKARA SASTRI,

**Publisher, Manimanjari,**

**MUKTYALA :: KISTNA DT.**